
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ విభాగంలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. కనీస డిగ్రీ అర్హతతో, అనుభవాన్ని బట్టి తగిన జీతం ఇవ్వబడును. పత్రికా రంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
సంక్షేమ మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540
Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073
email: jobs@manasarkar.com



# సంక్షేమ మనసర్కార్

Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:125 | హైదరాబాద్ 06 డిసెంబర్ 2025, శనివారం | పేజీలు: 8, వెల: రూ. 5/-

Vol-01 ::: Issue-125 | Hyderabad 06 December 2025, Saturday | Pages: 8, Rs. 5/-



అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు
కావలెను
అడ్వర్టైజింగ్ & మార్కెటింగ్ విభాగంలో పనిచేయుటకు ఎగ్జిక్యూటివ్‌లు కావలెను. కనీస డిగ్రీ అర్హతతో, అనుభవాన్ని బట్టి తగిన జీతం ఇవ్వబడును. పత్రికా రంగంలో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడును.
మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు
సంక్షేమ మనసర్కార్ PRGI REG. No. : TGTEL/25/A0540
Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073
email: jobs@manasarkar.com



# రూపాయితో రూబుల్ స్నేహం

## కుడంకుళం అణు విద్యుత్ కేంద్రానికి మహర్దశ

## భారత్‌లో షిప్‌బిల్డింగ్ రంగం బలోపేతం

భారత్, రష్యా మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న వ్యూహాత్మక బంధం మరో చారిత్రక మైలురాయిని చేరుకుంది. రెండు దేశాల మధ్య వాణిజ్య, ఆర్థిక సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం కీలక ఒప్పందాలపై ఏకాభిప్రాయానికి వచ్చారు. 2030 వరకు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని విస్తరించేందుకు ఉద్దేశించిన ఒక సమగ్ర ఆర్థిక సహకార కార్యక్రమానికి ఇద్దరు నేతలు ఆమోదం తెలిపారు. ఈ చారిత్రక భేటీ తర్వాత ఇద్దరు నేతలు సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు.

## భారత్, రష్యా మధ్య 2030 వరకు వాణిజ్య విస్తరణకు ఒప్పందం




**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

భారత ఇంధన అవసరాలకు గణనీయమైన మద్దతు రష్యా నుంచి లభిస్తుందని పుతిన్ హామీ ఇచ్చారు. తమిళనాడులోని కుడంకుళం అణు విద్యుత్ కేంద్రం భారత్-రష్యా సహకారంలో, అత్యంత ప్రతిష్ఠాత్మక ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్ట్ గా నిలుస్తుందని పుతిన్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీతో శుక్రవారం ఢిల్లీలో జరిగిన కీలక సమావేశంలో- ద్వైపాక్షిక సంబంధాలు, వ్యూహాత్మక భాగస్వామ్యం, రక్షణ, ఇంధన భద్రత వంటి అనేక అంశాలపై ఇద్దరు నేతలు చర్చించారు. తర్వాత ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో, ఇద్దరు నేతలు వివరాలను వెల్లడించారు. కుడంకుళం అణు విద్యుత్ కేంద్రం లోని ఆరు రియాక్టర్లలో రెండు విద్యుత్ నెట్‌వర్క్ కుఅనుసంధానం కాగా, మిగిలిన నాలుగూ నిర్మాణ దశలో ఉన్నాయని పుతిన్ తెలిపారు.

...::: తరువాయి 3వ పేజీలో..

# తిరుమల కొండపై ఎన్నారై భక్తుల అపచారం



**తిరుపతి(ఏడీఎన్ఎన్) :**

తిరుమల పుణ్యక్షేత్రంలో మరోసారి డ్రోన్ కెమెరా కలకలం సృష్టించింది. అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉన్న కొండపైకి ఇద్దరు భక్తులు డ్రోన్‌ను తీసుకురావడం, దానిని గాల్లోకి ఎగురవేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. అర్జున్ దాస్, సులక్షణ దాస్ అనే ఇద్దరు ఎన్నారై భక్తులు అలిపిరి వద్ద ఉండే మూడంచెల భద్రతా తనిఖీ వ్యవస్థను దాటుకుని శిలాతోరణం సమీపంలో డ్రోన్‌ను శుక్రవారం ఎగరేశారు. స్థానికులు, ఇతర భక్తులు వెంటనే టీటీడీ విజిలెన్స్ సిబ్బందికి సమాచారం అందించడంతో, అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని డ్రోన్‌ను ఎగరేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. డ్రోన్ కెమెరాను స్వాధీనం చేసుకొని, అందులో రికార్డయిన దృశ్యాలను పరిశీలించారు . తర్వాత నిందితులను విచారణ కోసం పోలీసులకు అప్పగించారు. ఆగమశాస్త్రం ప్రకారం, శ్రీవారి ఆలయంపై ఎలాంటి వస్తువులు, విమానాలు ఎగురవేయడం నిషేధం. భద్రతా కారణాల వల్ల తిరుమలలో డ్రోన్లపై కూడా నిషేధం ఉంది.

# పుతిన్ తో విందుకు శశి థరూర్‌కు ఆహ్వానం




**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గౌరవార్థం భారత ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన విందుకు కాంగ్రెస్ సీనియర్ నేత శశి థరూర్‌కు ఆహ్వానం అందింది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలైన రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలకు ఆహ్వానం అందలేదు. విదేశీ వ్యవహారాల పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న హోదాలోనే, తనను విందుకు ఆహ్వానించారని థరూర్ స్పష్టం చేశారు. కానీ ఈ నిర్ణయం వెనుక ఉన్న రాజకీయ ఉద్దేశ్యం ఏంటన్నది కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. రాహుల్, ఖర్గేలకు విందుకు ఆహ్వానం రాలేదని పార్టీ వర్గాలు ధృవీకరించిన నేపథ్యంలో, గత కొంతకాలంగా కాంగ్రెస్‌తో థరూర్ సంబంధాలు అంత బాగోలేదన్న అభిప్రాయం మరింత బలపడుతోంది. విదేశీ నాయకులు భారత్‌కు వచ్చినప్పుడు ప్రతిపక్ష నేతలను కలిసే ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని ప్రస్తుత ప్రభుత్వం పక్కన పెడుతోందని రాహుల్ గాంధీ విమర్శించిన తర్వాతి రోజే ఈ పరిణామం చోటుచేసుకుంది. వాజ్‌పేయి హయాంలో కూడా ప్రతిపక్ష నేతలను కలిసే సంప్రదాయం కొనసాగిందని రాహుల్ గుర్తు చేశారు. ఖర్గే, రాహుల్ గాంధీ వంటి టాప్ లీడర్లకు ఆహ్వానం అందకపోవడం ప్రభుత్వ-ప్రతిపక్ష సంబంధాలపై కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది.

# ఎమిరేట్స్ విమానానికి బాంబు బెదిరింపులు



హైదరాబాద్‌కు వచ్చే విమానాలే లక్ష్యంగా వరుసగా బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం సృష్టిస్తోంది. దుబాయ్ నుంచి హైదరాబాద్ కు శుక్రవారం బయల్దేరిన ఎమిరేట్స్ విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈకే526 విమానం దుబాయ్ నుంచి హైదరాబాద్ కు వస్తోంది. ఈ క్రమంలో విమానాన్ని పేల్చేస్తామంటూ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సంబంధించి ఎయిర్‌పోర్ట్ కస్టమర్ సపోర్ట్ కేంద్రానికి ఇమెయిల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎయిర్‌పోర్టులో ఆ విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులందరినీ సురక్షితంగా కిందికి దింపారు. ఆ తర్వాత విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇప్పటివరకు ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. గురువారం కూడా హైదరాబాద్‌కు వచ్చే విమానాలు లక్ష్యంగా బాంబు బెదిరింపులు వచ్చాయి. సౌదీ అరేబియాలోని మదీనా నుంచి హైదరాబాద్‌కు వస్తున్న విమానంలో బాంబు పెట్టినట్లు మెయిల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. విమానాన్ని అహ్మదాబాద్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేసి.. తనిఖీలు చేశారు. షార్జా నుంచి హైదరాబాద్ వస్తున్న మరో విమానానికి కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. ఈ క్రమంలో దాన్ని శంషాబాద్ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు.



# అమెరికాలో అగ్నిప్రమాదం తెలుగు విద్యార్థుల మృతి

...::: వివరాలు 3వ పేజీలో..



## రంగంలోకి దిగిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

# దండగమారి ఇండిగో

## ఎయిర్ పోర్టు లాబీల్లో ప్రయాణికుల ఆగ్రహావేశాలు

## ఈ నెల 15 నాటికి సర్వీసులు పూర్తిగా సాధారణ స్థితికి

## ప్రయాణికులకు క్షమాపణలు చెప్పిన ఇండిగో సీఈఓ

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

ఇండిగో విమానయాన సంస్థ ప్రస్తుతం గతంలో ఎన్నడూ ఎదురుకాని స్థాయిలో ఆపరేషన్ల ఇబ్బందులను ఎదుర్కొంటోంది. భారత డొమెస్టిక్ ఎయిర్‌లైన్స్ మార్కెట్లో 60 శాతం వాటా కలిగిన ఈ భారీ సంస్థకు నిధులు లేకపోవడం, నష్టాలు రావడం వంటి సమస్యలు ఏవీ లేవు. కానీ పైలట్లను వినియోగించే విధానంలో కొత్తగా అమలులోకి వచ్చిన ఫ్లైట్ డ్యూటీ టైం లిమిటేషన్లు ఇండిగో వ్యవస్థను అస్తవ్యస్తం చేశాయి. పైలట్ల డ్యూటీ గంటలకు పరిమితులు పెట్టడం, వారానికి తప్పనిసరి 36-48 గంటల రెస్ట్ ఇవ్వడం, రాత్రి ('రెడ్ ఐ') ఫ్లైట్లలో డ్యూటీ గంటలు తగ్గించడం, లీవ్‌ని వారపు రెస్ట్ గా లెక్కించకూడదన్న నిబంధనలు కిందటి నెల నుంచి పూర్తిగా అమల్లోకి రావడంతో ఇండిగోపై భారీ ఒత్తిడి ఏర్పడింది. సరిపడా పైలట్లు ఉన్నప్పటికీ, కంపెనీ రోస్టర్ ప్లానింగ్‌లో చేసిన తప్పిదాలు, కొత్త పైలట్ల నియామకంలో నిర్లక్ష్యం కారణంగా పరిస్థితి మరింత దిగజారింది. దీని ప్రభావంగా కిందటి నెలలో 1,232 విమానాలు రద్దు కాగా, వాటిలో 755 ఫ్లైట్ డ్యూటీ టైం లిమిటేషన్ల కారణంగా నిలిచిపోయాయి.

...::: తరువాయి 2వ పేజీలో..

# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు స్టాలిన్, ఒమర్ లకు ఆహ్వానం





**చెన్నై / న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణలో ఈ నెలలో నిర్వహించబోయే గ్లోబల్ సమ్మిట్‌కు హాజరుకావల్సిందిగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ను , జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆహ్వానించారు .తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి బయల్దేరి చెన్నై చేరుకొని తమిళనాడు రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ను కలిసి గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానించారు. ఆ తరువాత చెన్నై నుంచి బయలుదేరి ఢిల్లీ వెళ్లి అక్కడ జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ను ఆయన అధికారిక నివాసం లో కలిసి గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానించారు . జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లాను కలిసిన తర్వాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ, తెలంగాణ లో ఈ నెల 8, 9 తేదీల్లో 'తెలంగాణ రైజింగ్' స్లోగన్‌తో తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు సిద్ధమవుతున్నామని రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్‌మ్యాప్‌ను ఈ సదస్సులో ఆవిష్కరించనున్నట్టు ఆయన వెల్లడించారు.

...::: తరువాయి 2వ పేజీలో..

# పవన్‌ను ఇకపై విమర్శించను



**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును, తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆహ్వానించారు. తర్వాత ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో కోమటిరెడ్డి మాట్లాడారు. పవన్ కల్యాణ్‌పై అప్పటి పరిస్థితుల బట్టి వ్యాఖ్యలు చేశానని ఆయన తెలిపారు. చంద్రబాబు విజన్‌కి తగ్గట్టు అమరావతి ఫ్యూచరిస్టిక్ క్యాపిటల్‌గా అభివృద్ధి చెందుతుందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలాఉండగా, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీకి గైర్హాజరు కావటంపై, కోమటిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి వెళ్లకపోవడం తప్పని, అధికారపక్షం తర్వాత అసెంబ్లీలో ప్రతిపక్షానికే బాధ్యత ఉంటుందని ఆయన తెలిపారు. తెలంగాణలో తమ పార్టీ ఎమ్మెల్యేలను కేసీఆర్ విలీనం చేసుకున్న తర్వాత , కాంగ్రెస్ కు ఆరుగురే ఎమ్మెల్యేలున్నప్పటికి, తాము అసెంబ్లీలో పోరాడామని ఆయన గుర్తు చేశారు.




# మహిళలే నిందితులు

**జడ్చర్ల (ఏడీఎన్ఎన్) :**

మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల లోని ఒక గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన, ఆ స్కూల్ వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మిపైన, ప్రిన్సిపాల్ రజిని రాగమాలపైన పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి కొంతకాలంగా తనపై లైంగిక వేధింపులకు పాల్పడుతోందని, ఆ విద్యార్థిని ఇటీవల పాఠశాలలో నిర్వహించిన షీ టీమ్స్ అవగాహన కార్యక్రమంలో చెప్పటంతో, మొత్తం వ్యవహారం బయటపడింది. పోలీసుల విచారణలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి ఆగస్టు నెల నుంచే ఈ వేధింపులకు పాల్పడుతున్నట్లు తేలిందని డీఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. నైట్ డ్యూటీ సమయంలో ఆమె విద్యార్థినిని శారీరకంగా, లైంగికంగా వేధించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా ప్రిన్సిపాల్ రజిని రాగమాల బాధితురాలిని, ఆమె తల్లిదండ్రులను బెదిరించినట్లు కూడా పోలీసులు గుర్తించారు.

64

# వందేళ్ల... ఆర్ఎస్ఎస్

## భారత పునర్నిర్మాణ మహాయజ్ఞం

## దేశ నిర్మాణంలో 'యువ' భాగస్వామ్యం

## మిలీనియల్స్, జెన్-జీ తరాన్ని ఆకర్షిస్తున్న శతాబ్ది వృక్షం



సాధారణంగా ఏ సంస్థకైనా వందేళ్లు నిండాయంటే, అది వృద్ధాప్యంలోకి అడుగుపెట్టినట్లు, పాతకాలపు పద్ధతులతో మనుగడ సాగిస్తున్నట్లు భావిస్తాం. కానీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (RSS) ఈ సాధారణ సూత్రానికి ఒక అద్భుతమైన మినహాయింపు. సంఘ్ వయసు వందేళ్లు కావచ్చు, కానీ దాని మనసు ఎప్పుడూ ఇరవై ఏళ్ళ యువకుడిదే. దాని ఆత్మ సనాతనమైనది కావచ్చు, కానీ దాని ఆచరణ, ఆలోచన నిత్య నూతనమైనది (Ever Youthful). నేడు భారతదేశం ప్రపంచంలోనే అత్యంత యువ దేశం. మన జనాభాలో 65 శాతానికి పైగా 35 ఏళ్ళ లోపు వారే. ఈ 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' (Demographic Dividend) దేశానికి ఎంత ముఖ్యమో, ఒక జాతీయవాద సంస్థగా సంఘ్‌కు కూడా అంతే ముఖ్యం. అయితే, స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా, కార్పొరేట్ ఉద్యోగాలు, స్టార్టప్ కల్చర్, గ్లోబల్ ఆలోచనలతో పెరిగిన ఈ 'జెన్‌జీ' (GenZ) మరియు 'మిలీనియల్' (Millennial) తరాన్ని ఆకర్షించడం పాత పద్ధతులతో సాధ్యం కాదు. ఈ సత్యాన్ని గ్రహించిన సంఘ్, గత రెండు దశాబ్దాలుగా తన కార్యవిధానంలో, బాహ్య స్వరూపంలో, సంభాషణలో (Communication) ఒక నిశ్శబ్ద విప్లవాన్ని తీసుకొచ్చింది.ఒకప్పుడు మైదానంలో 'దండం' (కర్ర) తిప్పిన చేతులే, నేడు 'మౌస్' పట్టుకుని కోడింగ్ చేస్తున్నాయి. ఒకప్పుడు కరపత్రాలు పంచిన కార్యకర్తలే, నేడు 'హ్యాష్‌ట్యాగ్'లను ట్రెండ్ చేస్తున్నారు. శాఖ సమయాలు మారాయి, యూనిఫాం మారింది, చర్చించే అంశాలు మారాయి.


...::: తరువాయి 2వ పేజీలో..



# పదిహేళ్ల నాటి అపోహలకు తెర బహుమతిగా భగవద్గీత

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

భారత పర్యటనకు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ భగవద్గీతను బహూకరించారు. 2011లో రష్యాలో నిషేధించిన భగవద్గీత, ఇప్పుడు భారత్-రష్యా సంబంధాలకు చిహ్నంగా మారింది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ 2 రోజుల పాటు భారతదేశంలో పర్యటించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, పుతిన్‌ను గురువారం రాత్రి విందుకు ఆహ్వానించారు. అంతకు ముందు ఇద్దరు నేతలు విమానాశ్రయం నుంచి ఒకే కారులో ప్రధాని నివాసానికి చేరుకున్నారు. ప్రధాని నివాసంలో మోదీ, పుతిన్ ల మధ్య దాదాపు రెండున్నర గంటల పాటు సమావేశం జరిగింది. ప్రధాని మోదీ, పుతిన్ పలు కీలక అంశాలపై ఒంటరిగా చర్చించారు. ఆ సమయంలో ప్రధాని మోదీ, రష్యన్ భాషలో అనువదించిన భగవద్గీతను రష్యా అధ్యక్షుడు పుతిన్ కు బహుమతిగా ఇచ్చారు. దాదాపు పదిహేనేళ్ల క్రితం సైబీరియాలోని టామ్స్క నగరంలో నమోదైన ఒక కేసు కారణంగా, ఇస్కాన్ ప్రచురించిన "భగవద్గీత యాజ్ ఇట్ ఈజ్" రష్యన్ అనువాదంపై స్థానిక అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దానిని తీవ్రవాద సాహిత్యం అని పిలవటానికి కూడా ప్రయత్నించారు. అయితే, ఇప్పుడు చరిత్ర మారింది. ప్రధాని మోదీ, భగవద్గీతను పుతిన్ కు బహుమతిగా ఇచ్చిన సన్నివేశం రెండు దేశాల ప్రజల హృదయాలను హత్తుకుంది. "ఈ బహుమతి కేవలం ఒక పుస్తకం కాదు. గతంలోని నెలకొన్న అనుమానాలు తొలగిపోయాయి, రెండు దేశాలు మునుపటి కంటే బలమైన నమ్మకమనే పునాదిపై నిలబడ్డాయి," అని ఒక సీనియర్ దౌత్యవేత్త అభిప్రాయపడ్డారు.




# రష్యా పౌరులకు ఉచిత ఈ-వీసా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

రష్యన్ పౌరులు ఇకపై ఒక్క రూపాయి ఫీజు కూడా చెల్లించకుండా 30 రోజులలోపు మంజూరయ్యే ఈటూరిస్ట్ వీసా, గ్రూప్ టూరిస్ట్ వీసాల సౌకర్యాన్ని పొందబోతున్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, రెండు రోజుల భారత్ పర్యటనలో భాగంగా రెండు దేశాల నాయకులు శుక్రవారం కీలక సమావేశాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ముగిసిన వ్యూహాత్మక చర్చల తర్వాత మోదీ ఈ కొత్త వీసా విధానాన్ని ప్రకటించారు. పర్యాటక రంగంలో ఇది భారత్-రష్యా సంబంధాలకు కొత్త శకానికి నాంది పలుకుతుందని భావిస్తున్నారు. సంయుక్త విలేకరుల సమావేశంలో రెండు దేశాలు "విజన్ 2030" డాక్యుమెంట్‌ను విడుదల చేయడం మరో కీలక పరిణామం. దీర్ఘకాలిక ఆర్థిక భాగస్వామ్యాన్ని పెంపొందించే రోడ్‌మ్యాప్‌గా నిలిచే ఈ పత్రం వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, పారిశ్రామిక సహకారం వంటి రంగాల్లో విస్తృత అవకాశాలను తెరవనుందని మోదీ పేర్కొన్నారు. యూరేషియన్ ఎకనామిక్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని పురోగతి దిశగా తీసుకెళ్లేందుకు కూడా రెండు దేశాలు అంగీకరించాయి. ఈ పర్యటన ద్వైపాక్షిక అజెండాను మరింత బలంగా ముందుకు తీసుకెళ్తుందని, రెండు దేశాల మధ్య స్నేహబంధం కొత్త స్థాయికి చేరుకుందని ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అభిప్రాయపడ్డారు.

సంక్షిప్త మనసర్కార్
Follow: manasarkar
శనివారం | హైదరాబాద్
06.12.2025
www.manasarkar.com

# దండగమారి ఇండిగో



**మొదటి పేజీ తరువాయి...**
ఈ నెల మొదటి వారంలోనే మరో 750కి పైగా విమానాలు రద్దు కాగా, ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, ముంబై వంటి ప్రధాన నగరాల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదిలా ఉండగా, ఇండిగో తన A320 ఫ్లీట్‌కు ప్రత్యేక మినహాయింపులు కోరగా, పూర్తి స్థిరత్వం 2026 ఫిబ్రవరి 10 నాటికి వస్తుందని కంపెనీ ప్రకటించింది. ఇప్పటికే ఇండిగో షేర్లు 7-8% పడిపోవడం, మార్కెట్ క్యాప్ ₹16,000కోట్ల మేర క్షీణించడం పెట్టుబడిదారుల్లో ఆందోళన రేపుతున్నా, విశ్లేషకులు దీన్ని దీర్ఘకాలిక కొనుగోలు అవకాశంగా చూస్తున్నారు. అయితే కొత్త పైలట్ల నియామకానికి, ట్రైనింగ్‌కు కనీసం 2-3 నెలలు పడనుండడంతో తక్షణ పరిష్కారం కనిపించడం లేదు. ప్రయాణికులు ఇండిగో యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా ఫ్లైట్ స్టేటస్ చెక్ చేసుకుంటూ అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు స్టాలిన్, ఒమర్‌లకు ఆహ్వానం



**మొదటిపేజీ తరువాయి...**
జాతీయ, అంతర్జాతీయ స్థాయి దిగ్గజాలను ఈ సమ్మిట్‌కు ఆహ్వానిస్తున్నామన్నారు.ఈ నేపథ్యంలోనే జమ్మూ-కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను సమ్మిట్‌కు ఆహ్వానించేందుకు స్వయంగా వెళ్లి కలిసినట్లు ఉత్తమ్ తెలిపారు. షార్ట్ నోటీసులో ఆహ్వానం ఇవ్వాల్సి వచ్చినప్పటికీ, అవకాశం ఉంటే తప్పక హాజరవుతానని ఒమర్ అబ్దుల్లా హామీ ఇచ్చినట్టు ఆయన చెప్పారు. సమ్మిట్‌కు ఆయన వచ్చినా, రాకున్నా ఒమర్ అబ్దుల్లా ఆశీస్సులు తెలంగాణ ప్రభుత్వం వెంట ఉంటాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

**గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ కావాలి : జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా**
తెలంగాణలో నిర్వహించబోయే గ్లోబల్ సమ్మిట్‌ను తనను ఆహ్వానించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ధన్యవాదలు చెప్పారు. ఈ సమ్మిట్‌కు నేను హాజరు కాకపోయినా.. ఈ కార్యక్రమం విజయవంతం కావాలని కోరుకుంటానని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చెందుతోందని కొనియాడారు. కాగా రంగారెడ్డి జిల్లా మహేశ్వరం, మిర్ఖాన్‌పేటలో డిసెంబర్ 8, 9వ తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సమ్మిట్‌ను దావోస్ సమ్మిట్ తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ సదస్సు ద్వారా తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుకోవాలని, భవిష్యత్ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచవ్యాప్తంగా 500 కంటే ఎక్కువ పెద్ద కంపెనీలు, 2000 పైగా వ్యాపారవేత్తలు, నాయకులు, నిపుణులు ఈ సదస్సుకు హాజరవుతారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



## కూతురికి ప్యాడ్ కోసం ఓ తండ్రి ఆవేదన

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

ఇండిగో విమానయాన సంస్థ తీరుపై ఇప్పటికే పలు విమర్శలు ఎదుర్కొంటుంది. ఇండిగో విమాన ఆలస్యంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. విమానాశ్రయంలో ఒక తండ్రి తన కూతురికి అత్యవసరంగా శానిటరీ ప్యాడ్ ఇవ్వాలని సిబ్బందిని వేడుకుంటూ, ఆవేదనతో ఏడుస్తుండడం ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తుంది. అధునాతన సౌకర్యాలు ఉన్న ఎయిర్‌పోర్ట్‌లో కూడా ఇలాంటి పరిస్థితి రావడం ప్రజలను కలిచివేస్తోంది. చుట్టూ నిలబడ్డ వారిలో ఒక్కరూ కూడా ఆ తండ్రికి సహాయం చేయకపోవడం మరింత ఆవేదనకరం. ఇండిగో సిబ్బంది నిర్లక్ష్యంతో ఈ ఘటన చోటుచేసుకుందని సోషల్ మీడియాలో నెటిజన్లు మండిపడుతున్నారు. విమానం భారీగా ఆలస్యం కావడంతో ప్రయాణికులు గంటల తరబడి హాలులోనే ఆగాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈలోగా తన కూతురికి అత్యవసరంగా అవసరమైన ప్యాడ్ ఇవ్వాలని తండ్రి ఎంతగానో ప్రయత్నించినా, స్పందన రాకపోవడంతో నేలపై కూర్చొని ఆవేదన వ్యక్తం చేయాల్సి వచ్చింది. వీడియో బయటకు రాగానే నెటిజన్ల ఆగ్రహం అణచలేనిదిగా మారింది. కామెంట్ల విభాగంలో విమానయాన సంస్థ వ్యవస్థపైనా, సమాజ నిర్లక్ష్యపైనా తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తాయి. "ఇది చూడటం హృదయం మండిపోయే ఘటన", "ఇంకా హీనస్థితి ఏదైనా ఉంటుందా?", "ప్రభుత్వమే స్పందిస్తే ఇలాంటి పరిస్థితులు రాకపోవచ్చు" అంటూ పలువురు వ్యథ వ్యక్తం చేశారు. అత్యవసర సమయంలో ఒక చిన్న అవసరాన్ని కూడా తీర్చలేకపోవడం వ్యవస్థ వైఫల్యమని వినియోగదారులు ప్రశ్నించారు. "ఎంత నిస్సహాయుడైతే ఒక తండ్రి అందరి ముందూ ఇలా వేడుకుంటాడు?" అని చాలామంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సహాయం చేయడానికి ఎవ్వరూ ముందుకు రాకపోవడం సమాజం ఏ దిశగా పోతోందో చూపిస్తోందని నెటిజన్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# దేశ నిర్మాణంలో 'యువ' భాగస్వామ్యం



**మొదటి పేజీ తరువాయి...**
మారనిది ఒక్కటే "దేశం కోసం బ్రతకాలి" అనే మూల సిద్ధాంతం.
సంఘ్ యువతను ఆకర్షించడానికి ఎంచుకున్న ఈ 'కొత్త పంథాలు' (New Ways) కేవలం మనుగడ కోసం చేసిన మార్పులు కాదు. అవి దేశంలోని యువశక్తిని నిర్మాణాత్మక మార్గంలోకి మళ్ళించడానికి చేసిన శాస్త్రీయమైన ప్రయోగాలు. ఇందులో, సంఘ్ తన సంప్రదాయపు వేళ్ళను వదలకుండానే, ఆధునికత అనే ఆకాశంలోకి కొమ్మలను ఎలా విస్తరించిందో, డిజిటల్ యుగపు యువతను 'రాష్ట్ర సేవ' వైపు ఎలా ఆకర్షిస్తోందో సమగ్రంగా, సానుకూల దృక్పథంతో విశ్లేషించుకుందాం.

**మైండ్‌సెట్ మార్పు - 'కఠినత్వం' నుంచి 'సరళత' వైపు (Shift from Rigidity to Flexibility)**
యువతను ఆకర్షించడానికి సంఘ్ చేసిన మొదటి, అతి ముఖ్యమైన పని తన 'మైండ్‌సెట్' (ఆలోచనా ధోరణి)ని మార్చుకోవడం. యువత స్వేచ్ఛను కోరుకుంటారు, వారు కఠినమైన నియమాలను ఇష్టపడరు. ఈ విషయాన్ని సంఘ్ నాయకత్వం, ముఖ్యంగా సర్ సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భగవత్ గారు, స్పష్టంగా గుర్తించారు.

**1. శాఖల సమయాల్లో మార్పు (Flexible Timings):**
ఒకప్పుడు సంఘ్ శాఖ అంటే ఉదయం 6 గంటలకు లేదా సాయంత్రం 6 గంటలకు కచ్చితంగా జరగాలి. కానీ, నేటి కార్పొరేట్ యుగంలో, షిఫ్ట్ పద్ధతుల్లో పనిచేసే యువతకు, రాత్రిళ్ళు మేల్కొనే విద్యార్థులకు ఈ సమయాలు కుదరవు.
- **ఐటీ మిలన్ (IT Milans):** దీనికి పరిష్కారంగా, బెంగళూరు, పూణే, హైదరాబాద్, గుర్గావ్ వంటి ఐటీ హబ్‌లలో 'ఐటీ మిలన్' లేదా 'సాప్తాహిక్ మిలన్' (Weekly Meet) అనే కొత్త పంథాను ప్రవేశపెట్టారు.
- **ఇవి రోజువారీ** కాకుండా, వారాంతాల్లో (శనివారం లేదా ఆదివారం), యువతకు అనుకూలమైన సమయంలో జరుగుతాయి. మైదానాల్లోనే కాకుండా, అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లలో, కమ్యూనిటీ హాళ్లలో, ఏసీ కాన్ఫరెన్స్ రూమ్‌లలో కూడా ఇవి జరుగుతున్నాయి. "శాఖ ఎక్కడ జరిగినా, లక్ష్యం ఒక్కటే" అనే సరళతను (Flexibility) సంఘ్ స్వీకరించింది.

**2. గణవేష్ పరివర్తన (Uniform Change) - ఒక సామాజిక సంకేతం:**
90 ఏళ్ల పాటు సంఘ్ గుర్తింపుగా ఉన్న 'ఖాకీ నిక్కరు', క్రమశిక్షణకు ప్రతీక అయినప్పటికీ, ఆధునిక యువతకు అదొక సంకోచంగా (Inhibition) మారింది. జీన్స్, ఫార్మల్స్ వేసుకునే యువత, నిక్కరు వేసుకుని బహిరంగంగా రావడానికి ఇబ్బంది పడుతున్నారని సంఘ్ సర్వేలు గుర్తించాయి.
- **2016లో,** సంఘ్ ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. నిక్కరు స్థానంలో 'బ్రౌన్ ఫుల్ ప్యాంట్' (Full Pant) ను ప్రవేశపెట్టింది.
- **ఇది కేవలం** వస్త్రధారణలో మార్పు కాదు. ఇది "మేము మారుతున్న కాలంతో పాటు మారుతాము, మీ సౌకర్యం మాకు ముఖ్యం" అని యువతకు పంపిన ఒక బలమైన సంకేతం. ఈ ఒక్క నిర్ణయం, లక్షలాది మంది యువకులు సంఘ్ వైపు అడుగులు వేయడానికి అడ్డంకిగా ఉన్న మానసిక అవరోధాన్ని తొలగించింది.

**3. చర్చకు ఆహ్వానం (Open Dialogue):**
పాతకాలంలో సంఘ్ అంటే "ఆదేశాలు పాటించడం" (Obeying Orders) అనే భావన ఉండేది. కానీ నేటి యువత "ఎందుకు?" అని ప్రశ్నిస్తారు. వారు తర్కాన్ని కోరుకుంటారు.
- **సంఘ్** తన పంథాను మార్చుకుంది. ఇప్పుడు శాఖలలో 'బౌద్ధిక్' (ఉపన్యాసం) కంటే 'చర్చ' (Discussion) కు ప్రాధాన్యత ఇస్తున్నారు.
- **యువకులు** తమ సందేహాలను, విమర్శలను కూడా స్వేచ్ఛగా అడగవచ్చు. పర్యావరణం, ఆర్థిక వ్యవస్థ, సామాజిక న్యాయం వంటి అంశాలపై స్వేచ్ఛా చర్చలు జరుగుతున్నాయి. ఇది మేధావి వర్గపు యువతను (Intellectual Youth) ఆకర్షిస్తోంది.

టెక్నాలజీ డిజిటల్ అయస్కాంతం (Digital Magnetism)
నేటి యువత ప్రపంచం 'డిజిటల్'. వారు స్మార్ట్‌ఫోన్‌లో జీవిస్తున్నారు. వారిని అక్కడే కలుసుకోవాలి. ఈ విషయంలో సంఘ్ చూపిన చొరవ, కార్పొరేట్ కంపెనీలకు కూడా ఆదర్శం.

**1. 'జాయిన్ ఆర్ఎస్ఎస్' (Join RSS) - ఆన్‌లైన్ ద్వారం:**
ఒకప్పుడు సంఘంలో చేరాలంటే, తెలిసిన స్వయంసేవక్ ద్వారానే సాధ్యమయ్యేది. కానీ ఇప్పుడు, "Join RSS" అనే ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా, ప్రపంచంలో ఎక్కడి నుంచైనా, ఎవరైనా చేరవచ్చు.
- **డేటా అనలిటిక్స్:** ఈ వెబ్‌సైట్ ద్వారా ప్రతి సంవత్సరం 1 లక్ష నుంచి 1.25 లక్షల మంది కొత్త యువకులు చేరడానికి రిక్వెస్ట్ పెడుతున్నారు. ఇందులో ఐఐటీలు, ఐఐఎంలు, విదేశీ విశ్వవిద్యాలయాల విద్యార్థులు, డాక్టర్లు, ఇంజనీర్లు ఉన్నారు.
- **టెక్నాలజీని ఉపయోగించి,** ఆ రిక్వెస్ట్ వచ్చిన 24 గంటల్లోపు స్థానిక కార్యకర్త వారిని సంప్రదించి, సంఘంలోకి ఆహ్వానిస్తారు. ఇంతటి వేగవంతమైన, పారదర్శకమైన వ్యవస్థ యువతను ఆకట్టుకుంటోంది.

**2. సోషల్ మీడియాలో 'కూల్' ఫ్యాక్టర్:**
సంఘ్ ఒకప్పుడు మీడియాకు దూరంగా ఉండేది. కానీ ఇప్పుడు సోషల్ మీడియాలో సంఘ్ ఒక ప్రభంజనం.
- **ఇన్‌స్టాగ్రామ్ & యూట్యూబ్:** యువతకు నచ్చే చిన్న వీడియోలు (Shorts/Reels), స్ఫూర్తిదాయకమైన గ్రాఫిక్స్, దేశభక్తి వీడియోల ద్వారా సంఘ్ తన భావజాలాన్ని ప్రచారం చేస్తోంది.
- **ట్రెండ్ సెట్టర్స్:** జాతీయ పండుగలు, స్వామి వివేకానంద జయంతి, కార్గిల్ విజయ్ దివస్ వంటి సందర్భాల్లో సంఘ్ యువకులు సోషల్ మీడియాలో ట్రెండ్స్ సృష్టిస్తున్నారు. ఇది యువతకు ఒక "థ్రిల్"ను, తాము ఒక పెద్ద ఉద్యమంలో భాగమయ్యామనే భావనను ఇస్తోంది.

**3. టెక్నాలజీ ఫర్ నేషన్ (Technology for Nation):**
యువతకు తమ టెక్నికల్ స్కిల్స్ దేశానికి ఉపయోగపడాలని ఉంటుంది. సంఘ్ వారికి ఆ వేదికను కల్పించింది.
- **హ్యాకథాన్‌లు & యాప్స్:** సామాజిక సమస్యలకు పరిష్కారాలు కనుగొనడానికి హ్యాకథాన్‌లు నిర్వహిస్తోంది. సేవా భారతి కార్యకలాపాలకు, రక్తదానానికి యాప్స్ తయారుచేయడంలో టెక్కీలను భాగస్వామ్యం చేస్తోంది. "నీ కోడింగ్ దేశానికి ఉపయోగపడుతుంది" అనే పిలుపు, ఐటీ యువతను విశేషంగా ఆకర్షిస్తోంది.

**అడ్వెంచర్ మరియు ఫిట్‌నెస్ - సాహసమే ఊపిరిగా (Adventure & Fitness)**
యువతలో శక్తి (Energy) ఉంటుంది. వారు సాహసాన్ని (Adventure), ఫిట్‌నెస్‌ను ఇష్టపడతారు. జిమ్‌లు, ట్రెక్కింగ్ క్లబ్‌ల వైపు వెళ్లే యువతను, సంఘ్ తనదైన శైలిలో ఆకర్షిస్తోంది.

**1. 'ప్రహార్' మహా యజ్ఞాలు:**
సంఘ్ శాఖలలో శారీరక వ్యాయామం (Physical Training) ప్రధాన భాగం. అయితే, దీనిని ఆధునీకరించి, 'ప్రహార్' (దండం/కర్రతో చేసే వ్యాయామం) మహా యజ్ఞాలుగా నిర్వహిస్తున్నారు.
- **వేలాది మంది యువకులు,** ఒకే డ్రెస్ కోడ్‌తో, ఒకే తాళంతో, భారీ మైదానాల్లో చేసే ఈ విన్యాసాలు చూడటానికి అద్భుతంగా ఉంటాయి. దీనిని డ్రోన్ కెమెరాలతో షూట్ చేసి యూట్యూబ్‌లో పెట్టినప్పుడు, అది యువతలో ఒక "హీరోయిక్" భావనను కలిగిస్తోంది. "నేను కూడా ఇలాంటి శక్తివంతమైన బృందంలో ఉండాలి" అనే కోరికను రేకెత్తిస్తోంది.

**2. ట్రెక్కింగ్ మరియు క్యాంపింగ్:**
సంప్రదాయ శాఖలే కాకుండా, సంఘ్ ఇప్పుడు హిమాలయాల్లో ట్రెక్కింగ్, అడ్వెంచర్ క్యాంప్స్, సైకిల్ యాత్రలను నిర్వహిస్తోంది.
- **ఈ యాత్రల్లో** యువత ప్రకృతితో గడపడమే కాకుండా, రాత్రి వేళల్లో జరిగే క్యాంప్ ఫైర్ (Campfire) చర్చల్లో దేశభక్తి, చరిత్ర, సంస్కృతి గురించి తెలుసుకుంటారు. ఇది "వినోదం + విజ్ఞానం + దేశభక్తి" (Fun + Knowledge + Patriotism) అనే కొత్త ప్యాకేజీ.

**3. ఘోష్ (Band) - మ్యూజికల్ అట్రాక్షన్:**
సంఘ్ యొక్క బ్యాండ్ (ఘోష్) దళం, ఇప్పుడు ఆధునిక వాయిద్యాలను (Saxophone, Trumpet etc.) కూడా చేర్చుకుని, అత్యంత ప్రొఫెషనల్ ఆర్కెస్ట్రాలా మారింది. సంగీతంపై ఆసక్తి ఉన్న యువతను, ఘోష్ ద్వారా ఆకర్షించడం ఒక కొత్త పంథా. "స్వర లయలతో దేశభక్తి" అనేది వారి నినాదం.

**కెరీర్ మరియు దేశం - ప్రొఫెషనల్ ఫోరమ్స్ (Professional Forums)**
ఒకప్పుడు "దేశ సేవ చేయాలంటే సన్యాసిగా మారాలి లేదా కెరీర్ వదులుకోవాలి" అనే భావన ఉండేది. కానీ సంఘ్ ఈ భావనను మార్చింది. "నీవు డాక్టరుగా, లాయరుగా, ఇంజనీరుగా, పారిశ్రామికవేత్తగా రాణిస్తూనే... దేశానికి సేవ చేయవచ్చు" అనే భరోసాను కల్పించింది. ఇందుకోసం వివిధ వృత్తులకు ప్రత్యేక వేదికలను (Forums) సృష్టించింది.
1. **అధివక్తా పరిషత్ (Adhivakta Parishad):** ఇది లాయర్ల కోసం. న్యాయ విద్యార్థులు, యువ న్యాయవాదులు ఇందులో చేరి, దేశం కోసం న్యాయ పోరాటం (Legal Activism) చేస్తారు. అయోధ్య కేసు, ఆర్టికల్ 370 వంటి అంశాలపై వీరు చేసిన న్యాయ పోరాటం యువ లాయర్లకు స్ఫూర్తినిచ్చింది.
2. **నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ (NMO):** ఇది డాక్టర్లు, వైద్య విద్యార్థుల కోసం. వీరు వారాంతాల్లో గిరిజన ప్రాంతాలకు వెళ్లి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. మెడికల్ విద్యార్థులకు ఇది ఒక ప్రాక్టికల్ అనుభవంతో పాటు, సేవా సంతృప్తిని ఇస్తుంది.
3. **విజ్ఞాన భారతి (Vijnana Bharati):** ఇది సైంటిస్టులు, సైన్స్ విద్యార్థుల కోసం. భారతదేశ ప్రాచీన విజ్ఞానాన్ని, ఆధునిక సైన్స్ ను అనుసంధానిస్తూ పరిశోధనలు చేయడానికి ఇది యువతను ప్రోత్సహిస్తుంది.

ఈ ఫోరమ్‌ల ద్వారా, యువత తమ కెరీర్‌ను వదులుకోకుండానే, తమ వృత్తి నైపుణ్యంతోనే (Professional Skill) దేశ సేవ చేయవచ్చని సంఘ్ నిరూపించింది. ఇది ఆశయవాదులైన (Ambitious) యువతను విశేషంగా ఆకర్షిస్తోంది.

**మేధో మథనం - లిటరేచర్ ఫెస్టివల్స్ (Intellectual Engagement)**
నేటి యువత ప్రశ్నిస్తుంది. వారికి లాజిక్ కావాలి, డేటా కావాలి. పాతకాలపు కథలు చెబితే వినరు. ఈ విషయాన్ని గ్రహించిన సంఘ్, మేధో రంగంలో (Intellectual Space) యువతను ఆకర్షించడానికి కొత్త వేదికలను సృష్టించింది.

**1. లోక్ మంథన్ & లిట్ ఫెస్ట్స్ :**
ఒకప్పుడు లిటరేచర్ ఫెస్టివల్స్ అంటే కేవలం వామపక్ష భావజాలం ఉన్నవారికే పరిమితం. కానీ సంఘ్ ప్రేరణతో 'లోక్ మంథన్', 'పాంచజన్య సమ్మేళనం', 'యంగ్ థింకర్స్ ఫోరం' వంటి వేదికలు వచ్చాయి.
- **ఇక్కడ యువత సినిమా,** సాహిత్యం, చరిత్ర, పర్యావరణం, ఫెమినిజం వంటి ఆధునిక అంశాలపై స్వేచ్ఛగా చర్చిస్తారు.
- **ఈ వేదికలపైకి** బాలీవుడ్ నటులు, క్రీడాకారులు, యువ రచయితలు వస్తుండటంతో, ఇవి యువతకు 'ట్రెండీ'గా మారాయి.

**2. థింక్ ట్యాంక్స్:**
ఇండియా ఫౌండేషన్, వివేకానంద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వంటి అంతర్జాతీయ స్థాయి థింక్ ట్యాంక్‌ల ద్వారా, విదేశాంగ విధానం, ఎకానమీ, స్ట్రాటజిక్ అఫైర్స్ పట్ల ఆసక్తి ఉన్న యువ మేధావులను సంఘ్ ఆకర్షిస్తోంది. వారికి ఇంటర్న్‌షిప్‌లు ఇస్తూ, భవిష్యత్ పాలసీ మేకర్లుగా (Policy Makers) తీర్చిదిద్దుతోంది.

సేవ కూల్ ఫ్యాక్టర్ (Service is Cool)
**ఈ తరం** యువతలో సామాజిక బాధ్యత (Social Responsibility) ఎక్కువ. వారు సమాజానికి ఏదో ఒకటి చేయాలనుకుంటారు (Volunteering). ఈ కోరికను సంఘ్ 'సేవా భారతి' మరియు 'యూత్ ఫర్ సేవా' (Youth for Seva) ద్వారా అద్భుతంగా ఉపయోగించుకుంటోంది.

**ఇంటర్న్‌షిప్ విత్ పర్పస్:**
యువకులు కాలేజీ సెలవుల్లో, లేదా వారాంతాల్లో మురికివాడలకు వెళ్లి పిల్లలకు చదువు చెప్పడం, ఆసుపత్రుల్లో సేవ చేయడం, పర్యావరణ కార్యక్రమాల్లో పాల్గొనడం చేస్తున్నారు.
- **సంఘ్ దీనిని** ఒక సీరియస్ పనిగా కాకుండా, ఒక "జాయ్ ఆఫ్ గివింగ్" (ఇవ్వడంలో ఆనందం) గా మార్చింది.
- **కేరళ వరదలు,** చెన్నై వరదలు, కోవిడ్ సమయంలో... జీన్స్, టీషర్ట్ వేసుకున్న వేలాది మంది యువతీ యువకులు, సంఘ్ బ్యానర్ కింద బురదలో దిగి పనిచేయడం మనం చూశాం. ఆ అనుభవం వారికి జీవితకాల బంధాన్ని ఏర్పరుస్తుంది.

**సామాజిక సమ్మిళితం - అందరికీ స్వాగతం (Inclusive Approach)**
యువత వివక్షను సహించదు. సమానత్వాన్ని కోరుకుంటుంది. సంఘ్ ఈ విషయంలో చాలా స్పష్టమైన, ఆధునిక వైఖరిని తీసుకుంది.
- **సామాజిక సమరసత:** కుల రహిత సమాజం కోసం సంఘ్ చేస్తున్న కృషి యువతను ఆకర్షిస్తోంది. దళిత, వెనుకబడిన వర్గాల యువతను నాయకత్వంలోకి తేవడం, "హిందువులందరూ సోదరులే" అనే భావనను ఆచరణలో పెట్టడం యువతకు నచ్చుతోంది.
- **మహిళా శక్తి:** రాష్ట్రీయ సేవికా సమితి ద్వారానే కాకుండా, ప్రధాన సంఘ్ కార్యక్రమాల్లో, మేధో చర్చల్లో మహిళలకు, యువతులకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నారు. మహిళా సాధికారత గురించి సంఘ్ మాట్లాడుతున్న తీరు ఆధునిక యువతులకు కనెక్ట్ అవుతోంది.

**భవిష్యత్ భారత్ - యువ భారత్**
రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, యువతను ఆకర్షించడానికి అవలంబిస్తున్న ఈ కొత్త పంథాలు, కేవలం మార్కెటింగ్ టెక్నిక్స్ కావు. అవి ఒక లోతైన అవగాహన (Deep Understanding) నుంచి పుట్టినవి.
1. **ఆధునికత + సంప్రదాయం:** సంఘ్ యువతకు "ఐఫోన్ చేతిలో ఉన్నా, గీత (భగవద్గీత) గుండెల్లో ఉండాలి" అని నేర్పుతోంది. ఆధునికతను ఆస్వాదిస్తూనే, భారతీయ మూలాలను ఎలా కాపాడుకోవాలో (Modern yet Rooted) నేర్పుతోంది. ఇది యువతకు బాగా నచ్చుతోంది.
2. **యాక్షన్ ఓరియెంటెడ్:** యువతకు కేవలం ఉపన్యాసాలు వద్దు, పని కావాలి. సంఘ్ వారికి ఆ పనిని (సేవ, ప్రచారం, నిర్మాణం) ఇస్తోంది.
3. **గుర్తింపు (Identity):** పాశ్చాత్య సంస్కృతిలో కొట్టుకుపోతున్న యువతకు, "నేను భారతీయుడిని, నా సంస్కృతి గొప్పది" అనే ఆత్మగౌరవాన్ని (Pride), గుర్తింపును సంఘ్ ఇస్తోంది.

ఈ రోజు ఐఐటీ క్యాంపస్ నుంచి ఇస్రో ల్యాబ్ వరకు, కార్పొరేట్ బోర్డ్ రూమ్ నుంచి కిసాన్ పొలం వరకు... ఎక్కడ చూసినా సంఘ్ భావజాలం ఉన్న యువత కనిపిస్తున్నారు అంటే, దానికి కారణం సంఘ్ అనుసరించిన ఈ నూతన, ఆధునిక పంథాలే.

**రచన: భూక్యా గోపినాయక్**

> **వందేళ్ళ వృక్షం, కొత్త చిగుర్లతో కళకళలాడుతోంది. ఆ చిగుర్లే నేటి యువత. డాక్టర్ హెడ్గేవార్ నాడు ఐదుగురు పిల్లలతో మొదలుపెట్టిన ఆట, నేడు కోట్లాది మంది యువకుల గుండె చప్పుడిగా మారింది. ఈ యువశక్తితోనే, సంఘ్ రాబోయే శతాబ్దంలో "విశ్వగురు భారత్"ను నిర్మించడానికి సిద్ధమవుతోంది.**



## పాన్ మసాలాపై కొత్త బిల్లుకు ఆమోదం

పాన్ మసాలా తయారీ యూనిట్లపై సెస్సు విధిస్తూ, తద్వారా వచ్చే నిధులను జాతీయ భద్రతను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రజారోగ్యాన్ని మెరుగుపరచేందుకు ప్రతిపాదించే 'హెల్త్ సెక్యూరిటీ సే నేషనల్ సెక్యూరిటీ సెస్సు బిల్లు 2025'ను లోక్‌సభలో శుక్రవారం ఆమోదం పొందింది. పాన్ మసాలా కంపెనీలపై సెస్సును ప్రతిపాదిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ, ప్రజారోగ్యం రాష్ట్రాల పరిధిలోని అంశం కాబట్టి, సెస్సు ద్వారా వచ్చే నిధులను రాష్ట్రాలతో పంచుకుంటామని ఆమె స్పష్టం చేశారు. ఈ సెస్సు ద్వారా సమకూరిన నిధులను జాతీయ భద్రత, ప్రజారోగ్యానికి వినియోగించనున్నట్లు నిర్మలా సీతారామన్ తెలిపారు. పార్లమెంటు దిగువ సభలో ఈ బిల్లును మూజువాణి ఓటు ద్వారా ఆమోదించారు. పాన్ మసాలా, ఈ తరహా ఉత్పత్తులను తయారు చేసే యూనిట్లకు ఈ సెస్సు వర్తిస్తుంది. జాతీయ ఆరోగ్యం, జాతీయ భద్రత వంటి అంశాలకు ఈ నిధులను వినియోగిస్తామని ఆర్థిక మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం పాన్ మసాలాపై జీఎస్టీ గరిష్ఠ శ్లాబు అయిన 40 శాతం విధిస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఈ సెస్సు వల్ల జీఎస్టీ రాబడిపై ఎలాంటి ప్రభావం ఉండదని ఆమె తెలిపారు. తయారీ సామర్థ్యం ఆధారంగా ఈ సెస్సును విధిస్తామని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. 201014 మధ్య సెస్సుల రూపంలో ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం 7 శాతంగా ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆ మొత్తం 6.1 శాతానికి తగ్గినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి వెల్లడించారు.

## ఇండిగో వైఫల్యానికి కేంద్రానిదే బాధ్యత: రాహుల్




**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**


ఇండిగో ఎయిర్‌లైన్‌లో మూడు రోజులుగా తలెత్తిన సమస్యలతో దేశవ్యాప్తంగా ప్రయాణికులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టాయి. వేల సంఖ్యలో విమానాలు రద్దు కావడం, మరెన్నో ఫ్లైట్ల టైమ్‌లు మారడం వల్ల ఎయిర్‌పోర్టుల్లో గందరగోళం నెలకొంది. ఈ పరిణామం ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలే ఈ సంక్షోభానికి కారణమని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శుక్రవారం ఈ సమస్యపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్'లో ఒక ఆర్టికల్‌ను షేర్ చేస్తూ, "ఇండిగో ఫియాస్కో ప్రభుత్వం నడిపిస్తున్న 'మోనోపాలీ మోడల్' ఫలితం ఇదని ఆయన తెలిపారు. విమానాల ఆలస్యం, రద్దు కారణంగా సాధారణ భారతీయులు మళ్లీ ఇబ్బందుల్లో పడతారని ఆయన పేర్కొన్నారు. దేశానికి నిష్పక్షపాత పోటీ అవసరం, మ్యాచ్‌ఫిక్సింగ్ లాంటి మోనోపాలీ కాదు" అని రాహుల్ విమర్శించారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, దేశం భయం, స్వేచ్ఛా వ్యాపార వాతావరణం మధ్య ఒక సందిగ్ధంలో నిలిచిందని ఆయన అన్నారు. గతంలో ఈస్ట్ ఇండియా కంపెనీ 'మోనోపాలీ ఒత్తిడి'తో భారత్‌ను బలహీనపరిచిందని, నేడు కొంతమంది పారిశ్రామిక వర్గాలు అదే విధంగా పరిస్థితిని మలుస్తున్నాయని ఆయన వివరించారు. వారు సంపాదిస్తున్న సంపద దేశంలో ఆర్థిక అసమానతను మరింత పెంచుతోందని రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుతం వ్యాపారులకు ఫోన్‌లో మాట్లాడటానికే భయమొస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఐటీ, సీబీఐ, ఈడీ దాడుల భయంతో అనేక వ్యాపారాలు మూతపడుతున్నాయని, మూలధనం నిలిచిపోతుందని ఆయన తెలిపారు. దేశంలో నిష్పాక్షిక పోటీతో అద్భుత ఫలితాలు సాధిస్తున్న కొన్ని కంపెనీలను ఉదాహరణగా ఆయన ప్రస్తావించారు. బలహీనులను రక్షించడం తన రాజకీయాల ధ్యేయమని, ఇప్పుడు వ్యాపార వర్గం కూడా అన్యాయానికి గురవుతోందని రాహుల్ స్పష్టం చేశారు. ప్రభుత్వం ఏ వ్యాపారాన్నీ ఇతరుల ఖర్చుతో ప్రోత్సహించకూడదని, బ్యాంకులు పెద్ద రుణగ్రహీతలకే కాదు 'ఫ్లే ఫెయిర్ బిజినెస్'కూ మద్దతు ఇవ్వాలని ఆయన చెప్పారు. దేశంలో ఉద్యోగాలు, అభివృద్ధిని ముందుకు తీసుకువెళ్లేది స్వతంత్ర వ్యాపార వాతావరణమే అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు.



## గ్లోబల్ సమ్మిట్ పై సోనియా ప్రశంసలు
### సీఎం రేవంత్ కు అభినందన లేఖ

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పై కాంగ్రెస్ అధినేత సోనియా గాంధీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందిస్తూ శుక్రవారం లేఖ రాశారు. తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా ముందుకు వెళ్తున్నందున సమ్మిట్ దీనికి తోడ్పడుతుందని ఆమె ఈ లేఖలో పేర్కొన్నారు.మూడంచెల వ్యూహంతో తెలంగాణ అభివృద్ధి వైపు పయనిస్తున్నదని సోనియా స్పష్టం చేశారు.తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా డిసెంబర్ 8, 9న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమ్మిట్‌ను దావోస్ సమ్మిట్ తరహాలో, అంతర్జాతీయ ప్రమాణాల మేరకు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమ్మిట్ ద్వారా తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ పెంపొందించడం, భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను రూపొందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు .ప్రపంచవ్యాప్తంగా 500 పైగా ప్రముఖ కంపెనీలు, 2,000కి పైగా వ్యాపారవేత్తలు, నాయకులు, నిపుణులు ఈ సమ్మిట్‌లో పాల్గొననున్నారు.




## చిన్నారుల అకౌంట్లు బ్లాక్ మెయిల్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఆస్ట్రేలియా ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పదహారేళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా వేదికలను వాడకూడదని చట్టం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఈ కొత్త చట్టం డిసెంబర్ 10 నుంచి అమల్లోకి రానుండగా, గడువు ముందుగానే మెటా సంస్థకు చెందిన ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర ప్లాట్‌ఫారమ్‌లు ఆస్ట్రేలియాలోని చిన్నారుల అకౌంట్లను వరుసగా బ్లాక్ చేయడం ప్రారంభించాయి.

తాము తీసుకుంటున్న ఈ చర్యలను ప్రపంచ దేశాలు కూడా అనుసరించాలని ఆస్ట్రేలియా ఇంటర్నెట్ రెగ్యులేటరీ సంస్థ సూచించింది. పిల్లలను ఆన్‌లైన్ ముప్పుల నుంచి దూరంగా ఉంచడంలో ఇది అత్యంత అవసరమని పేర్కొంది. మొదట ఈ నిర్ణయం పట్ల తాను సందేహంతో ఉన్నానని, కానీ తల్లిదండ్రుల స్పందన చూసి తన అభిప్రాయం మారిపోయిందని ఇసేఫ్టీ కమిషనర్ జూలీ ఇన్మాన్ గ్రాంట్ తెలిపారు. పిల్లల రక్షణ విషయంలో ఆస్ట్రేలియా తీసుకున్న అడుగును ప్రపంచ దేశాలు ఆసక్తిగా గమనిస్తున్నాయని ఆమె వెల్లడించారు. అకౌంట్లు బ్లాక్ అవుతున్న నేపథ్యంలో, ఇప్పటికే పిల్లలు తమ సోషల్ మీడియా ప్రొఫైల్ ఉన్న ఫొటోలు, వీడియోలు, ఇతర డేటాను ముందస్తుగా డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్లాట్‌ఫారమ్‌లు సూచించాయి. ఈ నూతన చట్టం ప్రభావం వల్ల వేలాది మంది టీనేజర్ల ఖాతాలు మూతపడనున్నాయి. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ కొందరు కోర్టును ఆశ్రయించినా, ప్రభుత్వం మాత్రం చట్టం అమలులోకి తెచ్చే విషయంలో వెనక్కి తగ్గబోమని స్పష్టం చేసింది. ఈ నిబంధనలను ఉల్లంఘించిన సోషల్ మీడియా సంస్థలపై భారీ మొత్తంలో జరిమానాలు విధించనున్నట్లు ఆస్ట్రేలియా వెల్లడించింది. టిక్‌టాక్, ఫేస్‌బుక్, స్నాప్‌చాట్, రెడిట్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ మొదలైన అన్ని ప్రధాన వేదికలకు ఈ చట్టం వర్తించనుంది. ఈ చట్టం అధికారికంగా అమల్లోకి వస్తే, ప్రపంచంలోనే 16 ఏళ్లలోపు పిల్లల కోసం సోషల్ మీడియా పూర్తిగా నిషేధించిన తొలి దేశంగా ఆస్ట్రేలియా నిలవనుంది. ప్రజల భద్రత, పిల్లల భవిష్యత్తు నేపథ్యంలో తీసుకున్న ఈ నిర్ణయం అంతర్జాతీయ వేదికల దృష్టిని ఆకర్షిస్తోంది.

## రూపాయితో రూబుల్ స్నేహం

**మొదటిపేజీ తరువాయి....**

మొత్తం 6 వేల మెగావాట్ల సామర్థ్యంతో పనిచేయనున్న ఈ ప్లాంట్ పూర్తి స్థాయిలో ప్రారంభమయితే, భారత ఇంధన అవసరాలకు గణనీయమైన మద్దతు లభిస్తుందన్నారు. పుతిన్ ప్రకటన తర్వాత, రష్యా అణుశక్తి సంస్థ రోసాటమ్ కుడంకుళం ప్లాంట్ మూడో రియాక్టర్‌కు అవసరమైన తొలి అణు ఇంధనాన్ని కార్గో విమానంలో భారత్‌కి పంపినట్లు వెల్లడించింది. నోవోసిబిర్స్క్ కెమికల్ కాన్‌సెంట్రేట్స్ ప్లాంట్‌లో తయారైన ఈ ఇంధనం, 2024లో రెండు దేశాలు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం, మూడో మరియు నాలుగో రియాక్టర్ల కోసం మొత్తం ఏడు విమానాల్లో దశలవారీగా డెలివరీ చేయబడనుంది. అణు విద్యుత్ రంగానికే కాకుండా, చిన్న మాడ్యులర్ రియాక్టర్లు, తేలియాడే అణు విద్యుత్ కేంద్రాలు, వైద్యం, వ్యవసాయం వంటి రంగాల్లో అణు టెక్నాలజీ వినియోగాన్ని విస్తరించేందుకు కూడా భారత్‌కు సహకరించేందుకు రష్యా సిద్ధంగా ఉందని పుతిన్ స్పష్టం చేశారు. ఇంధన భద్రత విషయానికొస్తే, చమురు, గ్యాస్, బొగ్గు వంటి ప్రధాన వనరుల సరఫరాలో రష్యా భారత్‌కు విశ్వసనీయ భాగస్వామిగా కొనసాగుతుందని, వేగంగా ఎదుగుతున్న భారత ఆర్థిక వ్యవస్థకు ఎలాంటి అంతరాయం లేకుండా ఇంధనం అందించేందుకు తమ దేశం కట్టుబడి ఉందని పుతిన్ హామీ ఇచ్చారు. దేశీయ కరెన్సీల్లో ట్రేడ్ సెటిల్‌మెంట్ వ్యవస్థను అమలు చేయడానికి రష్యా, భారత్ అంగీకరించాయి. ఈ విధానం ట్రేడ్ ఖర్చులను గణనీయంగా తగ్గించడంతో పాటు, ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సులభంగా, స్థిరంగా మారుస్తుంది. గత ఏడాది ఇండియారష్యా వాణిజ్యం 12 శాతం పెరిగి $64 బిలియన్ డాలర్లకు చేరిన నేపథ్యంలో, ఈ కరెన్సీ ఒప్పందం మరింత వృద్ధికి ఊతమిస్తుంది. ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన ఉన్నత స్థాయి చర్చలు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలలో ఒక కీలక ముందడుగుగా నిలిచాయి. ఈ చర్చల ఫలితంగా, రాబోయే దశాబ్దంలో ఉమ్మడి ఆర్థిక వృద్ధికి దిశానిర్దేశం చేసే 'ఇండియా-రష్యా 2030 ఆర్థిక సహకార ప్రోగ్రామ్' కు రెండు దేశాలు అంగీకరించాయి. ఈ ప్రణాళిక ప్రధానంగా పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, పరిశ్రమ అభివృద్ధిని వేగవంతం చేయడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ రోడ్‌మ్యాప్ కేవలం ఆర్థిక సంబంధాలనే కాక, ఇరు దేశాల భవిష్యత్తు వృద్ధి దిశను పూర్తిగా మార్చే అవకాశం ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ముఖ్యంగా, ఎనర్జీ, మైనింగ్, ట్రాన్స్ పోర్ట్, కెమికల్స్ వంటి రంగాల్లో భాగస్వామ్యం మరింత బలోపేతం కానుంది.ఈ చర్చల్లో అత్యంత ప్రధానమైన భారత్‌కు గ్యాస్, ఆయిల్, కోల్ సరఫరాలో రష్యా విశ్వసనీయ భాగస్వామ్యమని, ఈ సరఫరాలు కొనసాగుతాయని పుతిన్ వెల్లడించారు. అలాగే, దశాబ్దానికి పైగా కొనసాగుతున్న సివిల్ న్యూక్లియర్ ఎనర్జీ సహకారం మరింత బలపడుతుందని తెలిపారు.'ఇండియా-రష్యా 2030 ఆర్థిక సహకార ప్రోగ్రామ్' కింద ముఖ్య రంగాల్లో సహకారం విస్తరించనుంది. భారత్, ఇండియా-రష్యా బిజినెస్ ఫోరంలో మరింత చురుకుగా పాల్గొనబోతోంది, ఇది పరిశ్రమల మధ్య సంయుక్త ఉత్పత్తి, పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలకు బలమైన వేదిక అవుతుంది. ఇరుదేశాల ఆర్థిక ప్రవాహాలను పెంచేందుకు ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ (FTA) ను త్వరగా పూర్తి చేయాలనే అంశం కూడా ప్రధాన చర్చలలో ఒకటి. ఈ ఒప్పందం అమలులోకి వస్తే వాణిజ్యానికి ఉన్న చాలా అడ్డంకులు తొలగిపోతాయి. సంయుక్త యూరియా ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటు దిశగా మంచి పురోగతి సాధిస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. అదేవిధంగా, ఇంటర్నేషనల్ నార్త్-సౌత్ ట్రాన్స్ పోర్ట్ కారిడార్ (INSTC), నార్దర్న్ సీ రూట్, చెన్నై-వ్లాడివోస్టోక్ సముద్ర మార్గం వంటి రవాణా మార్గాలు భవిష్యత్తులో ఆసియా-యూరప్ సరుకు రవాణాలో గేమ్‌చేంజర్‌గా మారబోతున్నాయి. చివరగా, భారత్‌లో షిప్‌బిల్డింగ్ రంగాన్ని బలోపేతం చేయడంపై చర్చలు జరిగాయి. ఈ రంగం 'మేక్ ఇన్ ఇండియా' విజన్‌కు, దేశీయ ఉద్యోగాలు, టెక్నికల్ స్కిల్స్ పెరగడానికి మార్గం సుగమం చేస్తుందని మోదీ పేర్కొన్నారు.

## లగ్జరీ కాదని "ఫార్చ్యూనర్" లోనే మోదీ, పుతిన్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్ పర్యటన దేశ వ్యాప్తంగానే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పుతిన్ పాలం విమానాశ్రయంలో దిగిన వెంటనే, ప్రధాని నరేంద్ర మోదీ ప్రోటోకాల్ ను పక్కన పెట్టి స్వయంగా వెళ్లి స్వాగతం పలికారు.




ఈ తరహా హైలెవల్ స్వాగతం భారతరష్యా బంధానికి ప్రత్యేక ప్రతీకగా భావిస్తున్నారు. సాధారణంగా దేశ నాయకులు అత్యంత భద్రత కలిగిన ఆర్మర్డ్ రేంజ్‌రోవర్‌లు, బీఎండబ్ల్యూలు లేదా ప్రత్యేక భద్రతా వాహనాలు ఉపయోగిస్తారు. ఈసారి మోదీ తన రూటైన్ రేంజ్‌రోవర్‌లో కాకుండా టయోటా ఫార్చ్యూనర్ సిగ్మా 4 ఎంటీ కారులో పుతిన్‌తో కలిసి ప్రయాణించడంతో రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. రష్యా అధ్యక్షుడు తన ఆరస్ సెనేట్ లిమోసిన్‌ను ప్రక్కన పెట్టి మోదీ తో మాటామంతీ ప్రయాణించడం చెప్పుకోదగ్గ విశేషం. అయితే, పుతిన్, మోదీ ఒకే కారులో ప్రయాణించడం మూడు నెలల్లో ఇది రెండోసారి. చైనాలోని తియాంజిన్ సిటీలో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా వారిద్దరూ ఒకే కారులో ప్రయాణించిన సంగతి తెలిసిందే. పుతిన్, మోదీ ఇద్దరూ కీలక దేశాధినేతలు కావడంతో, సాదాసీదా ఎస్యూవీ లో ప్రయాణించడం అరుదైన విషయం. మరోవైపు ఈ కారులోనే ఎందుకు కలిసి ప్రయాణంపై చర్చ కొనసాగుతోంది. ఇక ఈ ఫార్చ్యూనర్ (MH01EN5795) 2024 ఏప్రిల్‌లో రిజిస్టర్ అయ్యింది. BS6 నార్మ్స్ కి అనుగుణంగా ఉండి 2039 వరకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉంది. ఉక్రెయిన్ తో యుద్ధం కారణంగా 2022లో అమెరికాతో పాటు యూరప్ దేశాలు రష్యాపై ఆంక్షలు అమలు చేస్తోంది. ఆ దేశాల కార్లు కాకుండా జపాన్ కు చెందిన టయోటాను ఎంచుకుని మోదీ, పుతిన్ మంచి సందేశం పంపినట్లు విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ రాష్ట్రపతి భవన్ చేరుకున్నారు. భారత త్రివిధ దళాలు లాంఛన స్వాగతం తర్వాత పుతిన్ రాజ్‌ఘాట్‌లో మహాత్మా గాంధీకి నివాళులు అర్పించనున్నారు. హైదరాబాద్ హౌస్‌లో జరిగే 23వ ఇండియారష్యా సదస్సులో పాల్గొంటారు. ఇదే భవనంలో పుతిన్‌కు, ఆయన ప్రతినిధి బృందానికి ప్రధాని నరేంద్ర మోదీ విందు ఇవ్వనున్నారు. తర్వాత నేతలిద్దరూ ఒక ఉమ్మడి వేదికగా కీలక ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. రష్యా ప్రభుత్వం ఆధ్వర్యంలోని న్యూ ఇండియా చానల్‌ను పుతిన్ ప్రారంభిస్తారు. పుతిన్ గౌరవార్థం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇచ్చే విందులో పాల్గొంటారు. రాత్రి 9 గంటల సమయంలో పుతిన్ ఢిల్లీ నుంచి భారత్ కు వీడ్కోలు పలికి స్వదేశానికి బయలుదేరి వెళతారు.

## రష్యా - భారత్ ..ఈనాటి బంధం ఏనాటిదో


**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్నారు. భారత్, రష్యా మధ్య సత్సంబంధాలు ఇప్పటివి కావు. గత కొన్ని దశాబ్దాలుగా రెండు దేశాలు, మిత్ర దేశాలుగా కొనసాగుతున్నాయి. ఇక ప్రపంచ వేదికలపై పుతిన్, మోదీ భేటీ అయిన ప్రతిసారి ఆప్యాయత, అనురాగాలు స్పష్టమవుతాయి. ఇక ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి విదేశీ పర్యటనలకు అరుదుగా వెళ్తున్న పుతిన్, ఇప్పుడు భారత్‌కు వచ్చారు.



యుద్ధానికి ముందు కూడా పుతిన్ గానీ, రష్యా మాజీ అధ్యక్షులు గానీ పాకిస్తాన్‌ను సందర్శించిన దాఖలాలు లేవు. ఒకే ఒక్క రష్యా ప్రధాని ఎప్పుడో ఒక పర్యటన తప్ప.. రష్యా నేతలు పాక్ గడ్డపై అడుగు పెట్టలేదు. భారత్, రష్యా మధ్య దశాబ్దాలుగా మంచి మైత్రి బంధం నెలకొంది. చాలా రంగాల్లో రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు, ఒప్పందాలు, సహకారాలు, ఎగుమతులుదిగుమతులు ఉన్నాయి. అంతర్జాతీయ వేదికలపైనా భారత్, రష్యా పరస్పరం సహకరించుకుంటాయి. భారత్, రష్యాలు చిరకాల మిత్రులుగా ప్రపంచ దేశాలు పిలుస్తాయి. మన పొరుగు దేశమైన పాకిస్తాన్‌తో మాత్రం రష్యాకు సత్సంబంధాలు లేవు. అందుకే గత కొన్నేళ్లుగా పాక్ గడ్డపై రష్యా అధినేతలు, నాయకులు అడుగు పెట్టలేదంటే అతిశయోక్తి కాదు. పుతిన్ అధ్యక్షుడు అయినప్పటినుంచి ఇప్పటి వరకూ పాకిస్తాన్ పర్యటనకు సుముఖత చూపలేదు. రష్యా, పాక్‌కు మధ్య సంబంధాలు ఎంత దూరంలో ఉన్నాయో అర్థం అవుతోంది. ప్రస్తుతం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటిస్తున్న క్రమంలో రష్యా అగ్రనేతలు పాకిస్తాన్‌లో అధికారిక పర్యటనలు చేయకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 1991లో సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం అయిన తర్వాత 2007లో పాకిస్తాన్‌ను సందర్శించిన ఏకైక రష్యా అగ్రనేత ప్రధానమంత్రి మైఖైల్ ఫ్రాడ్కోవ్ మాత్రమే. అప్పటి నుంచి ఇప్పటివరకు పుతిన్ ఒక్క సారి కూడా పాకిస్తాన్ వెళ్లకపోవడం గమనార్హం. అయితే దీని వెనుక చారిత్రక, వ్యూహాత్మక, దౌత్య పరమైన కారణాలు నెలకొన్నాయి. పాకిస్తాన్‌ను పుతిన్ సందర్శించకపోవడానికి ప్రధాన కారణం భారత్‌తో రష్యాకు ఉన్న బలమైన వ్యూహాత్మక భాగస్వామ్యం. కోల్డ్ వార్ వారసత్వం, కాశ్మీర్ సమస్యపై పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా రష్యా వైఖరి వంటి చారిత్రక కారణాలు కూడా ఉన్నాయి. అగ్రనేతలు పర్యటించేలా, రష్యాపాకిస్తాన్ మధ్య కీలక ఒప్పందాలు, భారీ ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలు లేకపోవడం కూడా మరో కారణంగా చెప్పుకోవచ్చు. ఇక 2012లో పుతిన్, పాక్ పర్యటన రద్దుకు ప్రధాన కారణాలు ఇవే. భారత్‌ను దూరం చేసుకోకుండా పాకిస్తాన్‌తో అగ్రస్థాయి సంబంధాలను పరిమితం చేసుకోవడానికి రష్యా మొగ్గు చూపుతోంది. కోల్డ్ వార్ వారసత్వం, చారిత్రక ఇబ్బందులు 1991కి ముందు సోవియట్ యూనియన్ కాలంలో అమెరికా నాయకత్వంలోని సైనిక కూటముల్లో పాకిస్తాన్ భాగమైంది. సోవియట్ యూనియన్ భారత్‌తో బలమైన సంబంధాన్ని కొనసాగించింది. ఈ చారిత్రక వైరుధ్యం కారణంగా, రష్యాపాకిస్తాన్ సంబంధాలు బలపడటం అటుంచితే అనుమానం, అవిశ్వాసంగా ఇవి మారాయి. ఐక్య రాజ్యసమితిలో కాశ్మీర్ విషయంలో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా, భారత్ కు అనుకూల వైఖరిని రష్యా సమర్థించింది. 19791989 మధ్య సోవియట్ ఆఫ్ఘన్ యుద్ధం జరిగిన సమయంలో పాకిస్తాన్ ముజాహిదీన్లకు మద్దతు ఇవ్వడం రష్యాతో సత్సంబంధాలు పెరగకపోవడానికి కారణాలుగా నిలిచాయి. ఇదిలాఉండగా, రష్యాతో భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యం రష్యా తన విదేశాంగ విధానంలో భారత్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో పాకిస్తాన్ పర్యటనలు లేకపోవడానికి అతిపెద్ద కారణం. రష్యాకు ఆయుధాలు, ఆర్థిక, సైనిక రంగాల్లో దీర్ఘకాలిక, అత్యంత ముఖ్యమైన వ్యూహాత్మక భాగస్వామిగా భారత్ కొనసాగుతోంది. భారత్‌కు సున్నితమైన అంశంగా ఉండే పాకిస్తాన్‌తో అత్యున్నత స్థాయి పర్యటనలు చేయడం వల్ల, రష్యాకు భారత్‌తో ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడవచ్చనే కారణాలు ఉన్నాయి. రష్యా తన మిత్రుడిని దూరం చేసుకోకుండా ఉండటానికి, పాకిస్తాన్‌తో స్నేహపూర్వక సంబంధాలను పరిమితం చేసుకుంటోంది. 2012లో అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పాకిస్తాన్‌లో జరిగిన ఒక సమావేశానికి హాజరు కావాల్సి ఉండగా.. అది చివరి నిమిషంలో రద్దయింది. రష్యా అగ్రనేతలు సాధ్యమైనంతవరకు ఏ దేశంలో పర్యటించడానికి ఇష్టపడరు. ఒకవేళ పర్యటించాల్సి వస్తే భారీ ఎత్తున వ్యూహాత్మక లేదా ఆర్థిక ప్రయోజనం ఉండాలని భావిస్తారు. దానికి గల ప్రధాన కారణాల్లో ఒకటి.. ఆ పర్యటనలో రష్యాపాకిస్తాన్ మధ్య పెద్ద ఒప్పందాలు లేకపోవడమేనని అప్పట్లో వార్తలు వచ్చాయి. భారీ వాణిజ్య ఒప్పందాలు, పెట్టుబడి ప్రణాళికలు లేదా కీలకమైన వ్యూహాత్మక ప్రకటనలు సిద్ధంగా ఉన్నప్పుడే పాకిస్తాన్‌కు తమ అధ్యక్షుడు వెళ్తారని రష్యా రాయబారి గతంలోనే స్పష్టం చేశారు. అయితే పాకిస్తాన్‌తో రష్యాకు అలాంటి భారీ స్థాయి ఆర్థిక సహకారం ఇప్పటికీ జరగకపోవడం ఒక కారణం. భద్రతా అంశాలు, అస్థిరత పాకిస్తాన్‌లో తరచుగా సంభవించే రాజకీయ, భద్రతా అస్థిరత కారణంగా కూడా అగ్రనేతలు ఆ దేశంలో పర్యటించేందుకు రష్యా మొగ్గు చూపడం లేదు. ఆఫ్ఘనిస్తాన్, ఉగ్రవాద వ్యతిరేక పోరాటం వంటి భద్రతా అంశాలపై మాత్రం రష్యా, పాకిస్తాన్ రెండు దేశాల మధ్య సహకారం ప్రస్తుతానికి కొనసాగుతోంది.

## పుతిన్ విమానం 'ఫ్లయింగ్ క్రెమ్లిన్'



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

**భారత దేశ పర్యటనకు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విమానంపై ప్రస్తుతం ప్రపంచం అంత ఆకర్షిస్తోంది. ఎగిరే క్రెమ్లిన్‌గా పిలిచే ఈ విమానాన్నిపూర్తిగా రష్యా సాంకేతికతతో తయారు చేయడం విశేషం. భద్రత పరంగా చాలా అడ్వాన్స్‌డ్ ఫీచర్లు ఉన్న ఈ పుతిన్ విమానం, చాలా విలాసవంతంగా కూడా ఉంటుంది. ఎటువంటి ఎమర్జెన్సీ పరిస్థితుల్లోనైనా ప్రయాణించడం, ఆ విమానంలో నుంచే ఆదేశాలు జారీ చేయడం, కమ్యూనికేషన్ వ్యవస్థ కలిగిన ఈ విమానానికి సంబంధించి మరెన్నో విశేషాలు ఉన్నాయి.**

23వ భారత్‌రష్యా వార్షిక సమావేశాల కోసం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఢిల్లీలో గురువారం అడుగుపెట్టారు. తన 25 ఎళ్ల చిరకాల మిత్రుడికి ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా వెళ్లి, పుతిన్‌కు సాదర ఆహ్వానం పలికారు. శుక్రవారం రోజున రెండు దేశాల నేతలు పుతిన్ పర్యటన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పటిష్ఠ భద్రతా, బస ఏర్పాట్లను చేసింది. పుతిన్ భారత సందర్శన సందర్భంగా ఆయన ప్రయాణించిన విమానం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. పుతిన్ ప్రయాణించే కారు ఆరస్ సెనట్ సాయుధ లిమోసిన్‌ను, భారత పర్యటన కోసం తీసుకురావడం గమనార్హం. అత్యంత ప్రత్యేకమైన ఇల్యూషిన్ ఐఎల్96300 పీయూ అధ్యక్ష విమానం కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. పుతిన్ ప్రయాణించే ఈ ఇల్యూషిన్ ఐఎల్96300 పీయూ విమానాన్ని ఫ్లయింగ్ క్రెమ్లిన్ అని పిలుస్తారు. ఇది అత్యవసర పరిస్థితుల్లో సైనిక ఆదేశాలను జారీ చేయడానికి వీలు కల్పించే పూర్తి స్థాయి మొబైల్ కమాండ్ సెంటర్‌గా పనిచేస్తుంది. అత్యాధునిక ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్ రెస్పాన్స్ చర్యలు, మిసైల్ నిరోధక రక్షణలతో పాటు అణు కమాండ్ ఇంటర్‌ఫేస్‌ను ఈ ఫ్లయింగ్ క్రెమ్లిన్ కలిగి ఉంటుంది. ఈ విమానం లోపల బంగారు పూత, విలాసవంతమైన ఫర్నిచర్‌తో పాటు ఆకాశంలో తేలియాడే విలాసవంతమైన భవనాన్ని పోలి ఉంటుంది.

**అసలు ఈ విమానం ప్రత్యేక సాంకేతికత**

రష్యా దేశాధ్యక్షుడు పుతిన్ వాడే విమానం కనుక ఇది పూర్తి స్థాయిలో ఆ దేశ సాంకేతికతతో తయారయ్యింది. ఈ ఇల్యూషిన్ IL96300PU.. 1980లలో అభివృద్ధి చేసిన ఇల్యూషిన్ IL96300 విమానాన్ని స్పెషల్‌గా అప్‌గ్రేడ్ చేసిన కొత్త వెర్షన్ ను ఉపయోగించారు. ఈ విమానం 55.35 మీటర్ల పొడవు, 60.12 మీటర్ల రెక్కల వెడల్పు కలిగి ఉంది. 4 అవియద్విగాటెల్ పీఎస్ - 90 ఏ టర్బోఫాన్ ఇంజిన్‌ల ద్వారా శక్తిని పొందుతుంది. ఈ విమానంలో ఒక్కసారి ఇంధనం నింపితే, నాన్ స్టాప్‌గా సుమారు 11 వేల కిలోమీటర్ల దూరం తిరుగులేని విధంగా ప్రయాణిస్తుంది. ఈ విమానాన్ని రష్యాకు చెందిన వోరోనెజ్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రొడక్షన్ అసోసియేషన్ సైతం కీలక పాత్ర పోషిస్తుంది. రష్యా స్పెషల్ ఫ్లైట్ స్క్వాడ్రన్ ఈ విమానాన్ని ఆపరేట్, మెయింటైన్ చేస్తుంది. ఈ ఇల్యూషిన్ IL 96300PU లోని PU అంటే పుంక్ట్ ఉప్రావ్లెనియాగా అని అర్థం స్ఫురిస్తుంది. ఈ విమానం జాతీయ అత్యవసర పరిస్థితుల్లో పూర్తి స్థాయి మొబైల్ కమాండ్ సెంటర్‌గా పనిచేసేలా దీనిని తీర్చిదిద్దారు. విమానం ప్రపంచవ్యాప్తంగా సైనిక, గూఢచార, ప్రభుత్వ నెట్‌వర్క్‌లతో సురక్షిత సంభాషణకు వీలు కల్పించే ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్‌ను రూపొందించారు. ఈ పుతిన్ విమానం ఎలక్ట్రానిక్ ప్రతిఘటన చర్యలు, రాడార్ జామింగ్ టెక్నాలజీ సహా అత్యాధునిక రక్షణ వ్యవస్థలను కలిగి ఉంది. క్షిపణి దాడులను ఎదుర్కొనేందుకు ఇన్‌ఫ్రారెడ్ డెకాయ్ లాంచర్‌లు, యాంటీ మిస్సైల్‌స్‌ను మోహరించి ఉంటాయి. ఈ విమానం ఎలక్ట్రానిక్స్ విద్యుదయస్కాంత పల్స్ దాడుల నుంచి తట్టుకునేలా రూపొందించారు. అత్యంత తీవ్రమైన పరిస్థితుల్లో విమానం నుంచే సైనిక ఆదేశాలను, ప్రధానంగా అణు కమాండ్ ఆదేశాలను జారీ చేయడానికి వీలు కల్పించే ఇంటర్‌ఫేస్‌ను వ్యవస్థను కలిగి ఉంటుంది. ఇల్యూషిన్ IL96300PU విమానం లోపలి భాగం రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ పనిచేసే విధంగా ఏర్పాటు చేశారు. ఆకాశంలో తేలియాడే విలాసవంతమైన అద్భుత భవనంలా ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ఆ విమానంలో ప్రైవేట్ ప్రెసిడెన్షియల్ సూట్, పెద్ద కాన్ఫరెన్స్ రూమ్, ప్రైవేట్ ఆఫీస్, ప్రముఖుల కోసం గెస్ట్ లాంజ్, షవర్లతో కూడిన విలాసవంతమైన బాత్రూమ్‌లు, స్పెషల్ కిచెన్, జిమ్ స్పేస్ వంటి లగ్జరీ సౌకర్యాలను చక్కగా తీర్చిదిద్దారు. ఇక లోపలి భాగంలో బంగారు పూత పూసిన ఫిట్టింగ్‌లు, విలువైన కరేలియన్ బిర్చ్‌తో చేసిన ఇంటీరియర్స్, నియోక్లాసికల్ ఫర్నిషింగ్, ప్రీమియం లెదర్, అద్భుతమైన కళాఖండాలను ఈ ఫ్లయింగ్ కెమ్లిన్ విమానాన్ని అద్భుతంగా రూపొందించారు.



## పుతిన్ భారత్ టూర్ పై చైనా కథనాలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ రెండు రోజుల పాటు భారత్ సందర్శనకు వచ్చారు. ఈ పర్యటనలో భారత్, రష్యాల మధ్య అనేక ద్వైపాక్షిక ఒప్పందాలు కుదిరాయి. ఈ పర్యటనపై చైనీస్ మీడియా ప్రశంసలు కురిపించింది.

చైనా ప్రభుత్వ మీడియా గ్లోబల్ టైమ్స్ పుతిన్, భారత పర్యటనను హైలెట్ చేసింది. చైనా విదేశాంగ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ లీ హైడాంగ్ చైనా మీడియాతో మాట్లాడారు. రష్యా, భారత్ మధ్య సమన్వయం, సహకారం రెండు దేశాల స్వతంత ప్రతిపత్తి, సామర్థ్యాలను బలోపేతం చేస్తున్నాయని ఆయన అన్నారు. భారత్ రష్యా సంబంధం అత్యంత వ్యూహాత్మకమైనదని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, పుతిన్ పర్యటనలో భారత్, రష్యా ఏ దేశమూ కూడా ప్రపంచంలో ఒంటరిగా లేదని ప్రపంచానికి స్పష్టమైన సందేశాన్ని ఇస్తోందని లీ పేర్కొన్నారు. రెండు దేశాలు కూడా ఒకరికి ఒకరు మద్దతు ఇచ్చుకుంటున్నారని, ఒకరి అవసరాలను మరొకరు తీర్చుకుంటున్నారని చెప్పారు. రష్యా, భారత్‌లపై అమెరికా, పాశ్చాత్య దేశాల ఆంక్షలు, ఒత్తిడి విజయం కావని అన్నారు. భారత్, రష్యా మధ్య సంబంధాలు కొన్ని విషయాలను స్పష్టం చేస్తున్నాయని, రష్యాకు గణనీయమైన శక్తి, ప్రభావం ఉందని పాశ్చాత్య ఆంక్షలు దాని ప్రయోజనాలు, డిమాండ్లను ప్రభావితం చేయలేదని అమెరికా, పాశ్చాత్య దేశాలకు నిరూపిస్తోందని లీ మాటల్ని ఉటంకిస్తూ గ్లోబల్ టైమ్స్ చెప్పింది. భారత్ తన సొంత ప్రయోజనాలను మాత్రమే దృష్టిలో పెట్టుకుని రష్యా పట్ల తన విధానాన్ని రూపొందిస్తుందని స్పష్టం చేస్తోందని గ్లోబల్ టైమ్స్ ప్రకటించింది.



## ప్రియురాలితో మాజీ ప్రధాని వినోద యాత్ర

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో.. అమెరికన్ పాప్‌స్టార్ కేటీ పెర్రీ తో డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వస్తున్న వేళ తాజాగా ఆసక్తికర కీలక పరిణామం నెలకొంది. వీరు జపాన్ పర్యటనకు వెళ్లారు. ఆ దేశ మాజీ ప్రధాని ఫ్యుమియో కిషిదాతో జరిగిన సమావేశం తర్వాత, విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కిషిదా తన స్వీయ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

'ట్రూడో తన భాగస్వామి పెర్రీతో కలిసి జపాన్‌ను సందర్శించారు. మాతో కలిసి భోజనం చేశారు. ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు.. దేశాల అధినేతలుగా మేము అనేకసార్లు కలిశాము. అప్పుడు రెండు దేశాల ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి మేం కలిసి పనిచేశాం. మా స్నేహాన్ని ఇలాగే కొనసాగించడం ఆనందంగా ఉంది' అని రాసుకొచ్చారు. ట్రూడో, పెర్రీలతో కలిసి దిగిన ఫొటోను కూడా ఆయన పంచుకున్నారు. ఇక, కిషిదా పోస్టును ట్రూడో రీపోస్టు చేశారు. జపాన్ మాజీ ప్రధానితో భేటీ కావడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. దాదాపు దశాబ్దం పాటు కెనడా ప్రధానిగా ఉన్న జస్టిన్ ట్రూడో.. ఈ ఏడాది ప్రారంభంలో తన పదవికి రాజీనామా చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే జులైలో ట్రూడోపెర్రీలు మాంట్రియాల్‌లోని ఓ రెస్టరంట్‌లో తొలిసారి కనిపించారు. దీంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే ప్రచారం ఊపందుకుంది. ఆ తర్వాత ఓ విలాసవంతమైన నౌకపై వీరు అత్యంత సన్నిహితంగా ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఆ తర్వాత కేటీ పెర్రీ పుట్టినరోజు సందర్భంగా వీరు పారిస్‌లో జరిగిన ఓ మ్యూజికల్ షోకు హాజరయ్యారు. వీరు చేతిలో చెయ్యి వేసుకొని వచ్చిన దృశ్యాలు నెట్టింట తెగ చక్కర్లు కొట్టాయి. ట్రూడోకేటీలు దీనిపై ఇప్పటివరకు స్పందించలేదు.

## అమెరికాలో అగ్నిప్రమాదం.. ఇద్దరు తెలుగు విద్యార్థుల మృతి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అమెరికాలోని బర్మింగ్‌హామ్‌లో అపార్ట్ మెంట్ కాంప్లెక్స్ లో భారీ ఎత్తు అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి చెందారు. విద్యార్థులకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించారు.

మృతి చెందిన వారిలో ఉడుముల సహజ రెడ్డి, కూకట్ పల్లికి చెందిన మరొక విద్యార్థి ఉన్నారు. అలబామా యూనివర్సిటీలో ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులుగా వీరిని గుర్తించారు. మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. అపార్ట్ మెంట్ కాంప్లెక్స్ లో పదిమంది తెలుగు విద్యార్థులు నివసిస్తున్నట్లు సమాచారం. హఠాత్తుగా చెలరేగిన మంటలతో విద్యార్థులు ఉక్కిరిబిక్కిరయ్యారు. అపార్ట్ మెంట్‌లో మంటలు అంటుకున్న కొద్ది సేపటికే ఘాటైన పొగ వెలువడడంతో విద్యార్థులు శ్వాస తీసుకోలేక భయంతో కేకలు వేశారు. స్థానికులు ప్రాణ భయంతో వణికిపోయారు. పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లోపల చిక్కుకుపోయిన 13 మంది విద్యార్థులను అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకొని రావడంతో వీరంతా ఊపిరి పిల్చుకున్నారు.

మనసర్కార్
Follow: manasarkar
శనివారం | హైదరాబాద్
06.12.2025
www.manasarkar.com



# చంద్రబాబు గోబెల్స్‌కి టీచర్

**తాడేపల్లి (ఏడీఎన్‌ఎన్) :**

చంద్రబాబు దగ్గర గోబెల్స్ నేర్చుకోవాలని.. ఆయన గోబెల్స్ కి టీచర్ అని వైసీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్.గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబును ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు .రైతు సంతోషంగా ఉంటేనే, రాష్ట్రం సంతోషంగా ఉంటుందని అన్నారు.

తమ పాలనలో వ్యవసాయం పండగలా ఉంటే, బాబు పాలనలో వ్యవసాయం దండగాలా ఉందని జగన్ అన్నారు. తుఫాన్ ను చంద్రబాబు కాబట్టి అపగలిగారు అనేలా బిల్డ్ అప్ ఇచ్చారని, తుఫాన్ బాధిత రైతులకు ఒక్క రూపాయి సాయం అందలేదని అన్నారు . చంద్రబాబు 19 నెలల పాలనలో 17 సార్లు ప్రకృతి వైపరిత్యాలు వచ్చాయని,1100 కోట్ల ఇన్పుట్ సబ్సిడీ బకాయిలు ఇవ్వలేదని విమర్శించారు . ఈ రోజు 19 లక్షల మంది రైతులకు మాత్రమే రైతు బీమా అందుతుందని.. చంద్రబాబు బకాయి ఉన్న ఇన్పుట్ సబ్సిడీ నిధులు ఎప్పుడూ ఇస్తారో చెప్పాలని జగన్ ప్రశ్నించారు . అన్నదాత సుఖీభవ కింద ప్రతి ఏట రైతులకి ఇరవై వేలు ఇస్తానని చెప్పి.. కేవలం పదివేలు ఇచ్చి ముప్పై వేలు ఎగొట్టారని జగన్ ఆరోపించారు . రాష్ట్రంలో ఏ పంటకు మద్దతు ధర రావడం లేదని.. తుఫాన్ వల్ల నష్టపోయిన రైతుల ధ్యానాన్ని కొనేవాళ్ళు లేరని ఎద్దేవా చేశారు. దిత్వా తుఫాన్ వస్తుంది అని పదిరోజుల ముందే తెలుసని , తుఫాన్ సమయంలో తమ ప్రభుత్వం ఎలా స్పందించేదో అందరికీ తెలుసని.. రైతుల దగ్గరకు వెళ్ళే పరిస్తితి చంద్రబాబు ప్రభుత్వానికి లేదని జగన్ విమర్శించారు . చంద్రబాబు రైతుల కోసం ఏనాడు అయినా నిలబడ్డాడా అని జగన్ ప్రశ్నించారు



# శబరిమలలో తెలుగు స్వాములపై దాడి

**శబరిమల (ఏడీఎన్‌ఎన్) :**

శబరిమలలో తెలుగు రాష్ట్రాల నుంచి వెళ్లిన కొందరు భక్తులపై స్థానిక వ్యాపారులు దాడులకు దిగారు. వాటర్ బాటిల్ ధర విషయంలో ప్రశ్నించినందుకు ఓ షాపు యజమాని రక్తం వచ్చేలా అయ్యప్ప మాలాధారణలో ఉన్న భక్తుడిపై దాడి చేశాడు . గాజు సీసాలతో దాడి చేసినట్లు అక్కడి భక్తులు చెప్పారు .

ఈ దాడుల్లో ఒక భక్తుడి తలకు గాయమైంది. దీంతో తెలుగు రాష్ట్రాల స్వాములందరు షాపు వద్ద ఆందోళన చేపట్టారు. అయితే ఆ షాపు యజమానికే స్థానిక వ్యాపారులు, పోలీసులు వత్తాసు పలికినట్లు తెలుస్తోంది. దీంతో తెలుగు భక్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అయ్యప్ప మాల ధరించి నిష్టగా పూజలు చేసి స్వామిని దర్శించుకునేందుకు శబరిమల వచ్చిన భక్తులను స్థానిక వ్యాపారులు దోచుకుంటున్నారని, ప్రతి వస్తువుకూడా అధికార ధరలు అమ్ముతున్నారని తెలుగు భక్తులు తెలిపారు. ఎమ్మార్పీపై ప్రశ్నిస్తే దాడులకు సైతం దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో దూరం వచ్చిన తమ పట్ల వివక్ష చూపడం తగదని వాపోయారు.



# అమరావతి ఒక అంతులేని కథ

**తాడేపల్లి (ఏడీఎన్‌ఎన్) :**

చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును సర్వనాశనం చేసి, కేవలం బ్యారేజీకే పరిమితం చేశారని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆరోపించారు. పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంలా వాడుకున్నారని, కాఫర్ డ్యాం కట్టకుండా డయాఫ్రం వాల్ కట్టి విఫలమవడంతో వేల కోట్ల నష్టం జరిగిందని ఆయన విమర్శించారు.

చంద్రబాబు, కూటమి నేతలు ప్రాజెక్టును మొదటి దశ 41.5 మీటర్లకు మాత్రమే పరిమితం చేస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. అమరావతిది "అంతులేని కథ" కాగా, పోలవరం "ముగింపు లేని కథగా" మారిందని ఎద్దేవా చేశారు. నాడునేడు కింద వైఎస్ జగన్ వేల పాఠశాలలను బాగు చేస్తే, ఆయన ఇచ్చిన బెంచీలపై కూర్చునే చంద్రబాబు విమర్శలు చేస్తున్నారని అంబటి పేర్కొన్నారు. అంతేకాక, చంద్రబాబు తనపై ఉన్న అవినీతి కేసులను దొంగచాటుగా మూసేయించుకుంటున్నారని ఆరోపించారు. చివరగా, చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేశ్‌లకు హెడ్ క్వార్టర్ ఎక్కడో చెప్పాలని, లోకేశ్ తొందరలో చంద్రబాబు కుర్చీ కూడా తీసేస్తారని వ్యాఖ్యానిస్తూ, రాజకీయ కక్షల కోసం నీచమైన రాజకీయాలు చేయవద్దని హితవు పలికారు.

# విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించాలి

**అమరావతి (ఏడీఎన్‌ఎన్) :**

**విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో పట్టు సాధించేలా బలమైన పునాది వేయాలని, ఇందుకోసం పిల్లల బలాలు, బలహీనతలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించి లోపాలుంటే వెంటనే సరిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. విద్యార్థులు నూతన కార్యక్రమాలకు ఎప్పుడూ ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు.**



పిల్లలు చదువుతో పాటు ఆటపాటలతో చదువు నేర్చుకోవాలని, తక్కువ సమయమైనా ఇష్టపడి చదవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. భవిష్యత్తులో పిల్లలు ఎక్కువగా ఉండే దేశం మనదే అవుతుందని పేర్కొన్నారు . విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, తమ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకొచ్చిందని, ఉపాధ్యాయుల బదిలీల్లో పారదర్శకత తీసుకొచ్చామని తెలిపారు. తరగతి గది నుంచే దేశ భవితను మార్చవచ్చని సీఎం చంద్రబాబు నమ్ముతున్నారని, 2029 నాటికి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థను ప్రథమ స్థానానికి తీసుకురావడమే తమ లక్ష్యమని లోకేశ్ హామీ ఇచ్చారు. క్లిక్కర్ టెక్నాలజీని పైలట్ ప్రాజెక్టుగా భామిని మోడల్ స్కూల్‌లో అమలు చేస్తున్నామని, విదేశీ విద్యా విధానాలను పరిశీలించేందుకు టీచర్లను, విద్యార్థులను విదేశాలకు పంపుతామని చెప్పారు. అలాగే, పిల్లల అభ్యాస పురోగతిని తల్లిదండ్రులు నేరుగా తెలుసుకునేందుకు 'లీప్ యాప్'ను అందుబాటులోకి తెచ్చామని, ప్రభుత్వ పాఠశాలలపై చిన్నచూపు వద్దని, వాటిలో విద్యార్థులను చేర్చడం ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికి తీద్దామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా తమకు సలహాలు ఇస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు.

## పెట్టుబడులే లక్ష్యంగా ...
# మరోసారి విదేశాలకు లోకేష్



**అమరావతి (ఏడీఎన్‌ఎన్) :**

ఆంధ్ర ప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో మరోసారి విదేశీ పర్యటనకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నారా లోకేష్ సిద్ధమయ్యారు. ఈనెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఐదు రోజుల పాటు అమెరికా, కెనడా దేశాల్లో ఆయన పర్యటించనున్నారు.

అక్కడి పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులతో సమావేశమై రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలను మంత్రి బృందం వివరించనున్నారు. పర్యటనలో భాగంగా ఈనెల 6న లోకేశ్ అమెరికాలోని డల్లాస్‌లో జరిగే తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొంటారు. తర్వాత 8, 9 తేదీల్లో శాన్ ఫ్రాన్సిస్కో వేదికగా పలు దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో భేటీ అవుతారు. 10వ తేదీన కెనడాలోని టొరంటోలో పర్యటించి అక్కడి పారిశ్రామికవేత్తలతో చర్చలు జరుపుతారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి లోకేశ్ అమెరికాలో పర్యటించడం ఇది రెండోసారి. గత 18 నెలల కాలంలో పెట్టుబడుల సాధన కోసం లోకేశ్ అమెరికా, దావోస్, సింగపూర్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో విస్తృతంగా పర్యటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకున్న బ్రాండ్ ఇమేజ్, రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అనుకూల వాతావరణాన్ని వివరించడంలో ఈ పర్యటనలు విజయం సాధించాయి. తాజాగా విశాఖలో జరిగిన భాగస్వామ్య సదస్సు భారీగా పెట్టుబడులు తరలిరావడంలో ఈ పర్యటనలు కీలక పాత్ర పోషించాయని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. గత పర్యటనలో మంత్రి నారా లోకేశ్ అమెరికాలో పర్యటించడం ద్వారా గూగుల్ ను రాష్ట్రానికి సాధించుకువచ్చారని తెలిపారు. ఈసారి కూడా లోకేశ్ భారీ పెట్టుబడులతో వస్తారని కూటమి ప్రభుత్వం ధీమా వ్యక్తం చేస్తోంది.

# డీడీవోలు గ్రామాలకు మినీ కలెక్టరేట్లు

**చిత్తూరు (ఏడీఎన్‌ఎన్) :**

**రాష్ట్రవ్యాప్తంగా మరో 76 కార్యాలయాలను వర్చువల్‌గా ఏపీ డిప్యూటీ సీఎం ప్రారంభించారు. చిత్తూరులోని రెడ్డిగుంటలో డీడీవో కార్యాలయాన్ని ప్రారంభించారు . గ్రామీణ స్థానిక సంస్థల్లో 10-12 రకాల పౌరసేవలను ఒకే వేదిక కిందకు తీసుకురావడం కోసమే ఈ డీడీవో వ్యవస్థను తీసుకొచ్చామని, ఇవి గ్రామాలకు మినీ కలెక్టరేట్లుగా పనిచేస్తాయని ఆయన పేర్కొన్నారు.**



ఈ సంస్కరణ ద్వారా 22 ఏళ్లుగా ఉద్యోగోన్నతులు లేని ఎంపీడీవోలు డీడీవోలుగా మారారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 10,000 మందికి పారదర్శకంగా ఉద్యోగోన్నతి కల్పించామని తెలిపారు. ఇది ఉద్యోగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, జవాబుదారీతనాన్ని పెంపొందిస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. వైకాపా ఐదేళ్ల పరిణామాలను మదింపు చేసి సరికొత్త వ్యవస్థను తెస్తున్నామని, డీడీవో కార్యాలయాల్లో ఆర్డీవో స్థాయి అధికారిని నియమిస్తున్నామని పవన్ కల్యాణ్ వివరించారు. 7,244 క్లస్టర్లను రద్దు చేసి 13,350 పంచాయతీలను స్వయంపాలనా వ్యవస్థలుగా తీర్చిదిద్దామని, పురపాలికల్లో మాదిరిగానే గ్రామాల్లోనూ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, వీధిదీపాలు వంటి విభాగాలు ఏర్పాటు చేశామని తెలిపారు. వ్యవస్థలపై ఆత్మవిశ్వాసం పెరిగిందని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రశంసించగా, స్పీకర్ అయ్యన్న పాత్రుడు దీన్ని విప్లవాత్మకమైన మార్పుగా కొనియాడారు. ఈ సందర్భంగా, గంజాయి సాగును తగ్గించి, ఉపాధి నిధులతో పండ్ల మొక్కలు నాటించి ప్రజల ఆదాయాన్ని పెంచిన చిత్తూరు ప్రస్తుత కలెక్టర్ సుమిత్‌కుమార్, దినేష్‌కుమార్ లను పవన్ కల్యాణ్ అభినందించారు. ఈ వార్త లేదా డీడీవో వ్యవస్థపై మీకు మరేదైనా సమాచారం కావాలా?

# చిన్నారి ప్రతిభకు చంద్రబాబు ప్రశంస

**మన్యం జిల్లా (ఏడీఎన్‌ఎన్) :**

మన్యంలో ఓ చిన్నారి ప్రతిభకు సాక్షత్తూ సీఎం చంద్రబాబు నాయుడు ఫిదా అయ్యారు. పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ నియోజకవర్గంలోని భామిని మోడల్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు.




ఈ క్రమంలోనే చంద్రబాబు తన చేతిలో ట్యాబ్ పట్టుకొని ఓ చిన్నారి వద్దకు తీసుకెళ్లారు. ట్యాబ్ లో ఉన్న అంశాన్ని చదవాలని సూచించగా, చిన్నారి చక్కగా చదివి వినిపించడంతో ముఖ్యమంత్రి అభినందించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా కూటమీ ప్రభుత్వం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 3.0 కార్యక్రమాన్నితలపెట్టింది. సుమారు 45 వేల ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. పాఠశాలకు వెళ్లిన సీఎం చంద్రబాబు ముందుగా నేరుగా విద్యార్థుల తరగతులను పరిశీలించారు. తర్వాత విద్యార్థులతోపాటు క్లాస్ రూములో కాసేపు కూర్చొని డిజిటల్ పాఠాలు ఉపాధ్యాయులు ఏ విధంగా బోధన చేస్తున్నారనేది ఆసక్తిగా గమనించారు. తర్వాత విద్యార్థులతో కూర్చుని వారితో ముచ్చటిస్తూ, విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు.

# జగన్‌పై పల్లా ఫైర్ : చంద్రబాబుకు విజనరీ క్రెడిట్

**విశాఖపట్నం (ఏడీఎన్‌ఎన్) :**

**మాజీ ముఖ్యమంత్రి జగన్ పై రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు తీవ్ర విమర్శలు కురిపించారు. తిరుమల శ్రీవారి పవిత్ర నామాన్ని రాజకీయాల కోసం వాడుకున్నారని మండిపడ్డారు.**



సనాతన ధర్మం అంటే ఏంటో కూడా అర్థం కాని జగన్ కి శ్రీ వేంకటేశ్వర స్వామి గురించి మాట్లాడే అర్హత లేదు అని తీవ్రంగా విమర్శించారు. స్వామి వారు కోట్లాది హిందువుల విశ్వాసం. భక్తులు కష్టపడి సంపాదించి స్వామివారికి సమర్పించిన మొక్కుబడులను కూడా దోచుకునే ధైర్యం జగన్ పాలనలోనే కనబడిందని పల్లా ఆరోపించారు. తిరుమల దేవాలయ వ్యవహారాల్లో జరిగిన అవకతవకలు భక్తుల భావాలను తీవ్రంగా దెబ్బతీసాయని ఆయన తెలిపారు. పరకామణి కేసు ఘటనే, "దొంగ చేతికి అధికారం ఇస్తే ఏ స్థాయిలో అయోమయం, అవినీతి జరుగుతుందో చెప్పే తార్కాణం" అని ఆయన వ్యాఖ్యానించారు. జగన్ మూడు రోజులకు ఒక్కసారి మీడియా ముందుకు వచ్చి "నేను ఉన్నా... మా పార్టీ ఉంది" అని నటించడం ప్రజలు చూసి నవ్వుకుంటున్నారని పల్లా విమర్శించారు. "నీ నోటి వెంట నిజం రాదు... నిద్రలో లేపి దేవుడి గురించైనా అడిగినా అబద్ధమే చెప్తావు. ఎందుకంటే నీలో భక్తి లేదు, భయం లేదు" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఒక్క చుక్క పాలు కూడా లేకుండా తయారు చేసిన నెయ్యిని శ్రీవారి ప్రసాదంలో ఉపయోగించడం అవినీతి మాత్రమే కాక, "మహా పాపం మరియు ధార్మిక ద్రోహం" అని ఆయన ఆరోపించారు. శ్రీవారి పవిత్ర లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడటం ద్వారా కోటానుకోట్ల భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీశారని పల్లా తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంలో టెండర్ పిలుపు నుండి సరఫరా ప్రారంభం అయ్యే వరకు అన్ని చర్యలు వైసీపీ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని ఆయన స్పష్టం చేశారు. అంతేకాక, చంద్రబాబు ప్రమాణ స్వీకార రోజునే నెయ్యి సరఫరా ప్రారంభించటాన్ని "కుట్ర, ముందుగా పన్నిన రాజకీయ ప్రయత్నం"గా పల్లా ఖండించారు. ఈ చర్యలు తిరుమల ఆలయ పరిపాలనలో ఉన్న లోపాలు, గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని బయటపెడుతున్నాయని పల్లా పేర్కొన్నారు. తిరుమల దేవాలయ ఆచారాలలో మాజీ సీఎం జగన్‌కు అవగాహన లేదని పల్లా మండిపడ్డారు. "గుడిలో చెప్పులు వేసుకుని రాకూడదన్న సాధారణ ఆచారం కూడా తెలియని వ్యక్తి తిరుమల నియమాల గురించి ఉపన్యాసాలు చేయడం భక్తుల మనోభావాలపై దాడిలాంటి విషయం" అని ఆయన విమర్శించారు. అలాగే, వేంకటేశ్వర స్వామికి సతీసమేతంగా పట్టువస్త్రాలు సమర్పించాలి అనే సంప్రదాయం కూడా జగన్ కు తెలియదని, ఇలాంటి ప్రాథమిక ఆచారాలపై అవగాహన లేకుండానే ఆయన వ్యాఖ్యలు చేయడం బాధాకరమని పల్లా అన్నారు. న్యాయవ్యవస్థ, న్యాయమూర్తులు, సీనియర్ ఐఏఎస్ అధికారులను అగౌరవంగా సంబోధించడం, చివరికి కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామిని కూడా చులకనగా మాట్లాడటం... ఇవన్నీ వైఎస్సార్ కాంగ్రెస్ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అహంకార స్వభావానికి ప్రతిబింబమని విమర్శలు కురిపించారు. ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి వనంగా మార్చి, కల్తీ మద్యంతో వేలాది కుటుంబాలను దుఃఖంలో ముంచాడు. రాష్ట్రం మొత్తం నేరాలు, డ్రగ్స్, కల్తీ మద్యం దందాలతో పరువు పోయేలా చేసి, ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్‌ను దేశంలోనే అత్యంత హీన స్థితికి నెట్టాడు. ఇలాంటి పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన విజనరీ లీడర్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, యువనేత నారా లోకేష్ కలిసి ఆంధ్రప్రదేశ్ ను మళ్లీ గౌరవప్రదమైన దిశగా నడిపిస్తూ, ప్రపంచ పటంలో రాష్ట్ర ప్రతిష్ఠను పెంచుతున్నారని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులు, అభివృద్ధి అవకాశాలను ఆకర్షించేలా 'న్యూ ఏపీ బ్రాండ్'ను పునర్నిర్మించడం, రాష్ట్ర భవిష్యత్తుకు స్పష్టమైన మార్గరేఖలు వేస్తున్నారన్నారు. పరిశ్రమలు, టెక్నాలజీ, మౌలిక వసతుల విస్తరణతో ఆంధ్రప్రదేశ్‌ను సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్న ఈ నాయకత్వాన్ని వ్యాపార వర్గాలు, నిపుణులు కూడా మెచ్చుకుంటున్నారు.



# ఏఐ వరల్డ్ సమ్మిట్‌లో ఏపీకి భాగస్వామ్యం

**న్యూఢిల్లీ (ఏడీఎన్‌ఎన్) :**


ఏఐ ఆధారిత వృద్ధిలో ఏపీ కీలకపాత్ర పోషిస్తోందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 2026 ఫిబ్రవరిలో భారత్‌లో నిర్వహించబోతున్న ఏఐ వరల్డ్ సమ్మిట్‌లో భాగంగా ఏపీకి భాగస్వామ్యం కల్పించాలని రాజ్యసభలో తెదేపా ఎంపీ బీద మస్తాన్‌రావు కోరారు . సదస్సులో భాగంగా దేశ వ్యాప్తంగా 200 కార్యక్రమాలు చేపడతామని కేంద్రమంత్రి సమాధానమిచ్చారు. ఏపీ, మహారాష్ట్ర, యూపీ తదితర రాష్ట్రాల్లో డేటా సెంటర్లు వస్తున్నాయన్నారు. డేటా సెంటర్ల కేంద్రంగా విశాఖ ఎదగడం శుభపరిణామమన్నారు.




# లిక్కర్ కేసులో నిందితులకు ఏసీబీ కోర్టు షాక్

**విజయవాడ (ఏడీఎన్‌ఎన్) :**

లిక్కర్ కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లను కొట్టివేస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నిందితులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేశ్ నాయుడు, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణలు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం.. ఇటీవల తీర్పు రిజర్వ్ చేసింది. శుక్రవారం బెయిల్ పిటిషన్లను కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. చెవిరెడ్డి, వెంకటేశ్ నాయుడు విజయవాడ జిల్లా జైల్లో, బాలాజీ, నవీన్‌లు గుంటూరు జిల్లా జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.



# తిరుపతిలో బాలాజీ రైల్వే డివిజన్..!

### కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ సానుకూల సంకేతాలు

**తిరుపతి (ఏడీఎన్‌ఎన్) :**

ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా వెలుగొందుతున్న తిరుపతి సిగలో మరో కలికితురాయి చేరనుంది. ఈ మేరకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకోనుంది. తిరుపతికి పుణ్యక్షేత్రానికి ప్రతి ఏటా రూ.250 కోట్ల ఆదాయం సమకూరుతోంది.

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో అత్యధిక ఆదాయం ఆర్జిస్తున్న మూడో స్టేషన్‌గా ఈ తిరుపతి ప్రాంతం కూడా నిలిచింది. ఆధ్యాత్మిక కేంద్రం కావడంతో నిత్యం లక్షలాది మంది ప్రయాణీకులు తిరుపతికి భారీ సంఖ్యలో రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ఈ రద్దీ దృష్ట్యా తిరుపతి కేంద్రంగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు ప్రతిపాదనపై కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. తిరుపతి కేంద్రంగా కొత్తగా బాలాజీ రైల్వే డివిజన్ దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంది. అవసరాల దృష్ట్యా డివిజన్ ఏర్పాటు చేయాలని ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల రైల్వే డివిజన్ సాధన సమితి సభ్యులు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్ తో సమావేశమై డివిజన్ ఏర్పాటుపై చర్చించారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంత రైల్వే అవసరాలు తీర్చడంలో కొన్ని చిక్కులు తొలగించి , రైల్వే డివిజన్ ఏర్పాటు ద్వారా సమస్యలు తగ్గుముఖం పడతాయని భావిస్తున్నారు. దక్షిణ కోస్తా రైల్వేజోన్ ప్రధాన కార్యాలయాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చే యనున్నారు. ఇదిలాఉండగా, విజయవాడ, గుంటూరు డివిజనల్ కార్యాలయాలు అమరావతి ప్రాంతంలో ఉన్నాయి. ఈ క్రమంలో డివిజనల్ ప్రధాన కార్యాలయం దక్షిణ రాయలసీమలోని తిరుపతి ప్రాంతానికి లేకుండా పోతోంది. అందుకే తిరుపతి కేంద్రంగా బాలాజీ డివిజన్‌ను ఏర్పాటు చేయడం న్యాయ బద్ధంగా ఉంటుందని యోచిస్తున్నారు. కేంద్ర మంత్రికి సమర్పించిన వినతి పత్రంలో తిరుపతిఒంగోలు, తిరుపతికాట్పాడి, పాకాలధర్మవరం, రేణిగుంటఎర్రగుంట్ల, ఎర్రగుంట్లనంద్యాల, శ్రీకాళహస్తినడికుడి, ఓబుళవారిపల్లె కృష్ణపట్నం, కడప, బెంగుళూరుల మధ్య 1,550 కిలో మీటర్ల దూరం ఉన్న సెక్షన్లతో తిరుపతి డివిజన్‌ను ఏర్పాటు చేయాలని వారు కోరారు. కేంద్ర రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలోనే అధ్యయనం ప్రారంభం అయ్యే అవకాశం ఉందని రైల్వే డివిజన్ సాధన సమితి తెలిపింది.



# వరంగల్ లో సీఎం వరాల జల్లు

**వరంగల్ (ఏడీఎన్ఎన్) :**

ప్రజాపాలన–ప్రజా విజయోత్సవాల సందర్భంగా వరంగల్ జిల్లాలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. నర్సంపేటలో రూ.508 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు . నర్సంపేట–నెక్కొండ నాలుగు లేన్ల రోడ్డు నిర్మాణం, హనుమకొండ–మహబూబాబాద్ రోడ్డు విస్తరణ, నర్సింగ్ కాలేజీ నిర్మాణానికి సీఎం పునాది వేశారు.

నర్సంపేటలో జరిగిన బహిరంగ సభలో సీఎం రేవంత్, వరంగల్ జిల్లాకు సంబంధించి పలు కీలక హామీలు ప్రకటించారు. గత ప్రభుత్వం వరంగల్ విమానాశ్రయంపై ఏ చర్యలూ తీసుకోలేదని విమర్శించారు. పదేళ్లు పాలించినా గత ప్రభుత్వం ఒక్క కొత్త ఎయిర్‌పోర్ట్ సాధించలేదని సీఎం విమర్శించారు. వరంగల్ గడ్డ వీరుల ధైర్యానికి నిలయమని , కాకతీయ యూనివర్సిటీ పోరాటాలు స్ఫూర్తిదాయకమని సీఎం అన్నారు . తెలంగాణ వస్తే సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలు నమ్మారని , కానీ పది ఏళ్ల పాలనలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆస్తులు మాత్రమే పెరిగాయని సీఎం గుర్తు చేశారు . తెలంగాణ ప్రజల జీవితం మాత్రం మారలేదని , మీ ఓటుతో ఆ గడీల పాలనను పడగొట్టారని రేవంత్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పండించిన చివరి గింజ వరకు కొనుగోలు చేస్తోందని ,కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని అబద్ధాలు చెప్పినవారు... ఇప్పుడు రాష్ట్రాన్ని దోచుకున్న వారి పవర్ మాత్రమే కట్ అయ్యిందని రేవంత్ పేర్కొన్నారు . వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌పై పేటెంట్ హక్కు కాంగ్రెస్‌కే ఉందని ,గత సీజన్‌లో 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లను రైతు భరోసాగా అందించామని సీఎం పేర్కొన్నారు. దేశంలో అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నామని రేవంత్ గుర్తుచేశారు . పది సంవత్సరాల పాలనలో కొత్తగా ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని , ప్రస్తుతం 1.10 కోట్ల రేషన్ కార్డుల ద్వారా 3.10 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని సీఎం చెప్పారు . కొత్త చేర్పులు, మార్పులకు అవకాశాలు కల్పించామని సీఎం తెలిపారు.



# గ్రామ స్వరాజ్యం బీఆర్ఎస్ తోనే సాధ్యం

**ఎర్రవల్లి (ఏడీఎన్ఎన్) :**

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలన్నీ స్వయం సమృద్ధి సాధించి స్వయంపాలిత కేంద్రాలుగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలుగా అభివృద్ధి చెందినట్లు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొన్నారు.

దళిత, గిరిజన, బహుజన, మహిళా వర్గాలకు, కులవృత్తులకు, గ్రామీణాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం, అమలు చేసిన పథకాలు, పల్లె ప్రగతికి అందించిన ఆర్థిక సహకారం తెలంగాణ పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి మార్గం సుగమం చేశాయని ఆయన అన్నారు. తాను ముఖ్యమంత్రిగా చేపట్టిన పాలనా సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని గుర్తుచేశారు. గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామాల నూతన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు శుక్రవారం కేసీఆర్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం పొందగా, గ్రామస్థుల సమష్టి మద్దతుతో ఎన్నికైన వారిని కేసీఆర్ శాలువాతో సత్కరించి మిఠాయిలు పంచారు. గ్రామాల వాతావరణం, మౌలిక వసతుల పరిస్థితులు, సాగులో ఉన్న పంటల వివరాలను కేసీఆర్ పేరుపేరునా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో తమ పల్లెలు సువర్ణయుగం చూశాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పరిస్థితులు దిగజారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలపరిచిన ఆసరా పింఛన్లు, నిరంతర విద్యుత్ సరఫరా, సాగునీటి లభ్యత, కులవృత్తుల అభివృద్ధికి తీసుకున్న చర్యలు, దళిత-బహుజన-గిరిజన మహిళల కోసం అమలు చేసిన ప్రత్యేక పథకాల గురించి గ్రామస్థులు ప్రస్తావించారు. "మీ హయాంలో మా పల్లెలకు నిజమైన స్వర్ణయుగం... ఇప్పుడు గోస మాత్రమే మిగిలింది. అప్పుడే మీ విలువ తెలిసింది సార్. తిరిగి మీరొస్తే తప్ప పల్లెల్లో మునుపటి కళ రాదు" అని ఒక గ్రామస్థుడు చెప్పాడు . దీనికి స్పందించిన కేసీఆర్, కష్టకాలాలు వచ్చినా ప్రజలు ధైర్యం కోల్పోవద్దని, తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే తెలంగాణ పల్లెల్లో మంచి రోజులు వస్తాయని కేసీఆర్ భరోసానిచ్చారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు గంగదేవిపల్లి వంటి ఆదర్శ గ్రామాలను నమూనాగా తీసుకుని స్వయం సహాయక వ్యవస్థలను పెంపొందించుకోవాలని, ప్రజల భాగస్వామ్యంతో కమిటీలు ఏర్పాటు చేసి గ్రామ అభివృద్ధి పథకాలు రూపొందించాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా గ్రామీణాభివృద్ధికి కృషి చేసిన ప్రొఫెసర్ యూనిస్, భారత దేశానికే చెందిన అన్నా హజారే వంటి దార్శనికుల సేవలను వివరించడంతో పాటు, వారి స్ఫూర్తితో తమ పల్లెలను సామాజిక-ఆర్థిక స్వయం సమృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎర్రవెల్లి సర్పంచి నారన్నగారి కవితా రామ్మోహన్ రెడ్డి దంపతులు, ఉపసర్పంచ్ ఎద్మ సబితా కరుణాకర్, వార్డు సభ్యులు, నర్సన్నపేట సర్పంచ్ గిలక బాల నర్సయ్య, రెండు గ్రామాల ప్రముఖులతో పాటు పార్టీ నేత, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల పథకంలో నిర్లక్ష్యం... అధికారులపై వేటు

**9 మంది పంచాయతీరాజ్ కార్యదర్శుల సస్పెండ్**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఇందిరమ్మ ఇండ్ల మంజూరు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, అర్హులైన ప్రతి పేదకు ఇళ్లు అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. పథకం అమలులో అలసత్వం చూపిన 9 మంది పంచాయతీరాజ్ కార్యదర్శులను సస్పెండ్ చేశామని చెప్పారు .



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు . రాష్ట్రంలోని ఇందిరమ్మ ఇండ్ల పథకం పురోగతిని వివరించారు. గతంలో సుమారు 15 వేల మందికి ప్రారంభించి వదిలిన ఇళ్ల కోసం గృహ జ్యోతి పథకం ద్వారా కొత్త అవకాశాలు కల్పిస్తామని, పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే జీ ప్లస్4 పద్ధతిలో ఇండ్లను నిర్మించే విధంగా త్వరలో ఇందిరమ్మ అర్బన్ హౌసింగ్ పాలసీని ప్రకటిస్తామని మంత్రి స్పష్టం చేశారు.ఇప్పటివరకు దాదాపు 4 లక్షల ఇండ్లను మంజూరు చేశామని , అందులో 3 లక్షల ఇండ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని మంత్రి స్పష్టం చేశారు . వచ్చే ఏడాది మార్చి నాటికి లక్ష, జూన్ నాటికి మిగిలిన రెండు లక్షల గృహ ప్రవేశాలు జరగనున్నాయని చెప్పారు. ఏప్రిల్ నుంచి రెండో విడత ఇండ్ల మంజూరును మంత్రివర్గం ఇప్పటికే నిర్ణయించిందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని పట్టణాలు, నగరాల్లో పేదలకు ఇండ్ల మంజూరుకు ప్రణాళిక సిద్ధమైందని, జీ ప్లస్3 పద్ధతిలో నిర్మించాల్సిన గృహాల పాలసీ కొద్ది రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. ఓఆర్ఆర్ చుట్టూ నాలుగు స్థలాలను గుర్తించి, ఒక్కో చోట 8-10 వేల ఇండ్లు నిర్మించే ప్రతిపాదన ఉందని స్పష్టం చేశారు . గత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలో నిర్మించిన, శిథిలావస్థకు చేరిన ఇళ్లను తొలగించి, హైరైజ్ అపార్ట్ మెంట్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని సూచన ఉందని మంత్రి స్పష్టం చేశారు. అసంపూర్తిగా వదిలిన 2BHK ఇండ్ల నిర్మాణాన్ని 700 కోట్లు ఖర్చు చేసి పూర్తి చేసినట్లు, 200 కోట్లు మౌలిక సదుపాయాల కోసం కేటాయించామని చెప్పారు.హౌసింగ్ బోర్డు పరిధిలో లీజుకు ఇచ్చిన లేదా కబ్జా అయిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. ఇప్పటికే వెయ్యి ఎకరాల భూమికి చుట్టూ ప్రహరీ నిర్మాణం పూర్తయింది. గడచిన ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖను రద్దు చేసిన తర్వాత, పేదలకు పక్కా ఇళ్లు అందించడానికి శాఖను పునరుద్ధరించారు. 394 మంది డీఈఈలను తిరిగి నియమించి, 800 మంది ఏఈలను కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకున్నారు. ఇతర శాఖల నుంచి 152, రెవెన్యూ శాఖ నుంచి 32 మందిని డిప్యూటేషన్‌పై తీసుకుని వ్యవస్థను పటిష్టం చేశారు.



**ఎమ్మెల్యే దానం సంచలన వ్యాఖ్యలు**

# సీఎం చెప్తే రాజీనామా చేస్తా

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఎన్నికల్లో పోరాడటం, గెలవడం తన రక్తంలోనే ఉందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశిస్తే తను రాజీనామా చేయడానికి సిద్ధంగా ఉన్నానని దానం నాగేందర్ స్పష్టం చేశారు .

హిమాయత్‌నగర్, నారాయణగూడ ప్రాంతాల్లో రూ.1.40 కోట్లతో చేపట్టనున్న డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు . ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ , తన రాజీనామా ప్రస్తావన ఇంకా రాలేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని ఆయన ప్రకటించారు . తనకు ఎన్నికలు కొత్త కాదని ఇప్పటివరకు 11 సార్లు ఎన్నికల బరిలో నిలిచిన అనుభవం ఉందన్నారు. అనర్హత అంశంపై సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోందని, తాను అక్కడ వాదనలు వినిపిస్తానని ఆయన చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని దానం ప్రశంసించారు . రేవంత్ మరో పదేళ్లు సీఎం పీఠంపై ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని పేర్కొన్నారు. రైజింగ్ తెలంగాణ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్ విజయవంతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# పోలీసుల ఆరోగ్యానికి భద్రత ఏది?

**ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ మంత్రి హరీశ్ రావు**


**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

**పోలీసుల జీతాల నుండి ప్రతినెలా ఆరోగ్య భద్రత కోసం డబ్బులు కట్ చేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. వారికి సేవలు అందించడంలో మాత్రం తీవ్ర వివక్ష చూపిస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు.**



నిత్యం ప్రజల భద్రత కోసం కృషి చేసే పోలీసులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యాన్ని దూరం చేసి, నిమ్స్ ఆసుపత్రికే పరిమితం చేయడం శోచనీయమని ఆయన శుక్రవారం ఎక్స్ వేదికగా ఆవేదన వ్యక్తం చేశారు . ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల, సకాలంలో వైద్యం అందక పోలీసు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని హరీశ్ రావు అన్నారు . గతేడాది అక్టోబర్‌లో గుండెపోటుకు గురైన ఏఆర్ ఎస్సై జనార్దన్‌రావును 'గోల్డెన్ అవర్'లో ఓ ప్రముఖ ప్రైవేటు దవాఖానకు తరలించినప్పటికీ.. పోలీసు ఆరోగ్య భద్రత కార్డు ద్వారా చికిత్సకు నిరాకరించడంతో సకాలంలో చికిత్స అందక ప్రాణాలు కోల్పోయాడని హరీశ్ రావు పేర్కొన్నారు.ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నా, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పాలకులకు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదని హరీశ్ అన్నారు . ఇది అత్యంత బాధాకరం, అమానవీయం అన్నారు . రేవంత్ రెడ్డి పాలనలో పోలీసు ఆరోగ్య భద్రత గాలిలో దీపంగా మారిందని , ప్రజల ప్రాణాలకు రక్షగా ఉండే పోలీసులకే రక్షణ కరువైన దిక్కుమాలిన పాలన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానిదని ఆయన ఎద్దేవా చేశారు . ఆపత్కాలంలో ఆదుకునే ఉద్దేశ్యంతో ప్రారంభించిన ఆరోగ్య భద్రత పథకం లక్ష్యాన్ని నీరుగార్చుతుండటం హేయమైన చర్య అని హరీశ్ సీరియస్ అయ్యారు. ఆంక్షలు, అరెస్టులతో నిత్యం పోలీసుల పహారా నడుమ పాలన సాగిస్తున్న రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఆ పోలీసుల జీవితాలతో చెలగాటమాడటం దుర్మార్గమన్నారు.రక్షణ కోసం వేల మంది పోలీసులను వాడుకుంటూ.. వారి కనీస హక్కులను కాలరాయడం మీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు . ఎన్నికలకు ముందు ఏక్ పోలీస్ వ్యవస్థ తెస్తామని ఊదరగొట్టిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చాక ఆ హామీని తుంగలో తొక్కారని , తమ సమస్యలు పరిష్కరించాలని, హక్కుల కోసం రోడ్డెక్కిన పోలీసులనే అరెస్టు చేయించి జైలు పాలు చేయడం, సస్పెండ్ చేయడం మీ అహంకారానికి నిదర్శనమని హరీశ్ అన్నారు . ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అంటే? అని ప్రశ్నించారు. ఒకపక్క వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారు.. మరోపక్క పోలీసులకు రావాల్సిన సరెండర్ లీవ్ డబ్బులు, టీఏలు, స్టేషన్ అలవెన్సులు రాక మానసికంగా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన చెందారు.

# హిల్ట్ పాలసీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ లాండ్స్ ట్రాన్స్‌ఫార్మేషన్ పాలసీ జీవో నిబంధనలకు విరుద్ధమని ఆరోపిస్తూ ఇద్దరు పిటిషనర్లు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు.

శుక్రవారం ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు జస్టిస్ సుజయ్ పాల్ నేతృత్వంలోని ధర్మాసనం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ నవంబర్ 28న పిల్ దాఖలు చేయగా, మరో పిటిషన్‌ను పర్యావరణవేత్త ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి దాఖలు చేశారు.తాను దాఖలు చేసిన పిల్‌లో హిల్ట్ విధానం కింద చేపట్టిన అన్ని ప్రక్రియలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, పాలసీని నిలిపివేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించాలని కేఏ పాల్ కోరారు. హిల్ట్ పాలసీ కింద 9,292 ఎకరాల భూకేటాయింపు నిబంధనలకు విరుద్ధమని, ఈ అంశంపై సీబీఐ లేదా ఈడీతో దర్యాప్తు చేయించాలని విజ్ఞప్తి చేశారు. హిల్ట్ పాలసీ పరిధిలో వస్తున్న భూములకు సంబంధించిన ఫైళ్లు, క్యాబినెట్ నోట్స్, శాఖల మధ్య వాల్యుయేషన్ రిపోర్ట్‌లు, ధరణి ఎంట్రీలు, లీజు డీడ్‌లు, బదిలీ ప్రతిపాదనలను స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ ఆడిట్ చేయాలని అభ్యర్థించారు.ఇక మరో పిటిషన్‌లో ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, హిల్ట్ పాలసీ వాణిజ్య అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ పర్యావరణ ప్రమాణాలను విస్మరిస్తోందని పేర్కొన్నారు. రెండూ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల 29వ తేదీకి వాయిదా వేసింది.

# కాళోజీ హెల్త్ యూనివర్సిటీ కొత్త ఇంచార్జ్ వీసీ నియామకం

**భువనగిరి జిల్లా (ఏడీఎన్ఎన్) :**

**కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఇంచార్జ్ వైస్‌చాన్స్ లర్‌గా డా. రమేష్ రెడ్డిని తెలంగాణ ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఆయన యాదాద్రి–భువనగిరి జిల్లా ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.**



గతంలో మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ గా కూడా సేవలు అందించారు.గత నెల 28న వీసీగా ఉన్న డాక్టర్ నందకుమార్ రెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను అక్రమంగా పాస్ చేసినట్లు, ఇంచార్జ్ పోస్టుల నియామకాల్లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో వివాదం తీవ్రరూపం దాల్చింది. పదవికి రాజీనామా చేసిన మరుసటి రోజే తానే ఆపద్ధర్మ వీసీ అని ప్రకటించుకోవడం మరింత వివాదానికి దారితీసింది. తాను ఎటువంటి తప్పూ చేయలేదని, విచారణకు సిద్ధమని ఆయన పేర్కొన్నప్పటికీ, యూనివర్సిటీ వ్యవస్థను గాడిన పెట్టాలనే ప్రభుత్వ నిర్ణయంతో కొత్త ఇంచార్జ్ వీసీ నియామకం జరిగింది. డీఎంఈగా పనిచేసిన అనుభవం ఉన్న డా. రమేష్ రెడ్డి నియామకం యూనివర్సిటీ నిర్వహణలో సమర్థతను తీసుకురావడమే లక్ష్యమని అధికార వర్గాలు భావిస్తున్నాయి. పీజీ అడ్మిషన్ల గందరగోళంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు కూడా ఈ నియామకాన్ని హర్షంగా స్వాగతిస్తున్నారు.

**పీజీ విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తా : డా. రమేష్ రెడ్డి**

నీట్ పీజీ ఆల్ ఇండియా కోటా కౌన్సిలింగ్‌తో పాటు స్టేట్ కోటా కౌన్సిలింగ్ జరగకపోవడం వల్ల తెలంగాణ విద్యార్థులు నష్టపోతున్నారని, ఈ సమస్యను అత్యంత ప్రాధాన్యంగా తీసుకొని వెంటనే చర్యలు ప్రారంభిస్తామని ఇంచార్జ్ వీసీ డా. రమేష్ రెడ్డి తెలిపారు. ఓ మంచి ర్యాంకు సాధించిన విద్యార్థికి అతని ర్యాంక్‌కు తగ్గ పీజీ సీటు దక్కేలా చూడడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యార్థుల ప్రయోజనాలే తన ప్రథమ కర్తవ్యమని, వైద్య విద్యా వ్యవస్థను సవ్యంగా నడిపించేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.



# దేశంలోనే తొలి ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ స్థాపన

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఆస్ట్రేలియాకు చెందిన డీకిన్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో రాష్ట్రంలో కృత్రిమ మేధకు సంబంధించిన సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌ను ఏర్పాటు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం కీలక ఒప్పందం చేసుకుంది. దేశంలోనే ఈ తరహా నైపుణ్య శిక్షణ కేంద్రం మొట్టమొదటిది కావడం విశేషం . ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యా మంత్రి జూలియన్ హిల్ తో కలిసి సచివాలయంలో శుక్రవారం మీడియా సమావేశంలో ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఎంఓయు వివరాలను వెల్లడించారు. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేయనున్న ఏఐ యూనివర్సిటీలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్‌ను నెలకొల్పనున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. డీకిన్ అప్లయిడ్ ఆర్టిఫిషియల్ ఇన్ స్టిట్యూట్ ఈ ఎక్సెలెన్స్ సెంటర్ ను రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నిర్వహిస్తుందని ఆయన వివరించారు. కాలేజీల నుంచి అకడమిక్ గ్రాడ్యుయేట్లను కాకుండా ప్రపంచ స్థాయి నైపుణ్యాలతో కూడిన ప్రతిభావంతులను తయారు చేయాలన్న లక్ష్యంతోనే ఆస్ట్రేలియా ప్రభుత్వంతో ఈ భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. ఈ ఒప్పందం ద్వారా సాధారణ గ్రాడ్యుయేట్లను కాకుండా, ప్రపంచ స్థాయి నైపుణ్యాలు కలిగిన ప్రతిభావంతులను తయారుచేయాలనే లక్ష్యంతో శిక్షణ, పరిశోధన అవకాశాలు అందించనున్నారు. ప్రభుత్వం, ఆరోగ్యం, విద్య, ఐటీ, లైఫ్ సైన్సెస్, వ్యవసాయం, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లో అధునాతన నైపుణ్యాలు అభివృద్ధి చేయడంలో ఈ కేంద్రం సహాయపడుతుంది. రాష్ట్రంలో విదేశీ విశ్వవిద్యాలయాలను స్థాపించాలన్న సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నాల్లో భాగంగా ఈ ఒప్పందం కుదిరిందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఉద్యోగాల్లో ఉన్న వృత్తి నిపుణులకు కూడా ఉన్నతస్థాయి శిక్షణ అందించడానికి ఆస్ట్రేలియా అంగీకరించింది. ఈ కార్యక్రమంలో ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యామంత్రి జూలియన్ హిల్‌తో పాటు ఇరు పక్షాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సర్పంచ్‌లే సుప్రీం



**బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు**

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్లమెంట్, అసెంబ్లీతో పాటు గ్రామ సచివాలయాలు, మండల–జిల్లా పరిషత్‌లు సమర్థంగా పనిచేసినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు.

ఎన్నికల్లో డబ్బు ప్రభావాన్ని నిలువరించే శక్తి ప్రజల చేతుల్లోనే ఉందని, ఈ చెడు సంస్కృతిని తుడిచివేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.గ్రామాల్లోని సమస్యలపై సర్పంచ్‌లకు ఉండే అవగాహన ఎమ్మెల్యే , ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులకు ఉండదని ఈటల వ్యాఖ్యానించారు. గ్రామ సచివాలయాలు బలంగా పనిచేసినప్పుడే ప్రజల సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామపంచాయితీలు నిర్వీర్యమయ్యాయని, ప్రస్తుతం గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా కేంద్ర ప్రభుత్వం అందించే పర్ కాపిటా, ఫైనాన్స్ కమిషన్, ఉపాధిహామీ నిధులపైనే ఆధారపడి జరుగుతోందని వివరించారు. గతంలో సర్పంచ్‌లు చేసిన పనుల బిల్లులు చెల్లించకపోవడంతో అనేక మంది అప్పుల బారి పడి ఆత్మహత్యలు చేసుకోవాల్సి వచ్చిన విషాదాన్ని ఈటల ప్రస్తావించారు. రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించలేని, అభివృద్ధి పనులు చేపట్టలేని మంత్రులు ఇప్పుడు గ్రామాల్లో తిరిగి వచ్చి మూడేళ్లు పనులు చేస్తామని చెప్పే మాటలు నమ్మొద్దని ఆయన హెచ్చరించారు. గ్రామపంచాయితీలను నిర్వీర్యం చేసిన బీఆర్ఎస్ నాయకులు మళ్లీ ఓట్లు అడగడానికి రావడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమేనని అన్నారు. గ్రామాల్లో చెట్లు నాటడం, మురుగు కాలువలు, సిమెంట్ రోడ్లు, గ్రామపంచాయితీ భవనాలు, అంగన్వాడీలు, రైతు వేదికలు, స్మశానవాటికలు, తడి-పొడి చెత్త షెడ్లు, హైమాస్ట్ లైట్లు ఇవి అన్నీ కేంద్ర నిధులతోనే నిర్మించబడినవని ఈటల స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రజలకు అమాయక హామీలు ఇవ్వకుండా, తమతోపాటు నిలిచి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామనే హామీ మాత్రమే ఇవ్వాలని సూచించారు. రెండు పార్టీలకు ఓటు వేసినా ప్రజలకు లాభం ఉండదని, అభివృద్ధి కేంద్ర నిధులతోనే సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు .




# కోకాపేట భూముల వేలంలో హెచ్ఎండీఏ కు భారీ ఆదాయం

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

కోకాపేట నియోపోలిస్‌లో నాలుగో విడత భూవేలాన్ని హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ శుక్రవారం విజయవంతంగా పూర్తి చేసింది. నాలుగు విడతల్లో కలిపి హెచ్ఎండీఏ ఆదాయం రూ.3,862 కోట్లను దాటింది. నియోపోలిస్ భూభాగాలకు భారీ డిమాండ్ ఉండటంతో పలు వ్యాపార, వాణిజ్య సంస్థలు పోటీ పడి స్థలాలను కైవసం చేసుకున్నాయి. ఈవేలంలో 1.98 ఎకరాల గోల్డెన్ మైల్ స్థలాన్ని COEUS ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ఎకరా రూ.77.75 కోట్లకు దక్కించుకుంది. ఇప్పటి వరకు నాలుగు విడతలుగా జరిగిన వేలాల్లో గత ఏడాదితో పోలిస్తే హెచ్ఎండీఏ ఆదాయం 87 శాతం వృద్ధి సాధించినట్లు అధికారులు తెలిపారు.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar

శనివారం | హైదరాబాద్
06.12.2025
www.manasarkar.com

## రాశి ఫలాలు

**06-12-2025 శనివారం**

**మేషం:**
ఆర్థిక లాభం కోసం కొత్త మార్గాలు వెతుక్కుంటారు. చిన్న చిన్న ప్రలోభాలకు దూరంగా ఉండటానికి ప్రయత్నించాలి. మీకు ఉన్న ఆస్తి గురించి గర్వంగా భావిస్తారు. చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. మరోవైపు వ్యాపారవేత్తలకు ఈరోజు నిరాశ కలిగించే రోజుగా అనిపించొచ్చు.

**వృషభం:**
మీరు ఈరోజు మీ బాధ్యతలను సకాలంలో పూర్తి చేయగలరు. ప్రేమ సంబంధాలకు ఇది శుభ సమయం. ఉద్యోగులు కష్టపడి పనిచేయడం ద్వారా తమ ఉన్నతాధికారులను సంతృప్తి పరచగలరు. ఉద్యోగులకు ప్రమోషన్ గురించి శుభవార్తలు వింటారు. వ్యాపారవేత్తలు నిజాయితీగా వ్యవహరించాలి.

**మిధునం:**
మీ కుటుంబ జీవితంలో ఆనందంగా ఉంటుంది. విద్యార్థులకు ఈరోజు శుభప్రదంగా ఉంటుంది. వ్యాపారులు మెరుగైన లాభాలను పొందే అవకాశం ఉంది. మీ ఆదాయం పెరిగే అవకాశం ఉంది. మీ వైవాహిక జీవితంలో సంతోషంగా ఉంటుంది. మీ జీవనశైలిని మెరుగుపరిచే కొత్త కొనుగోళ్లు మీరు చేయొచ్చు.

**కర్కాటకం:**
కెరీర్ పరంగా పురోగతి కోసం కొత్త మార్గాలను అన్వేషించాలి. ఈరోజు వ్యాపారులకు చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అనవసరమైన ఖర్చులను నియంత్రించడానికి ప్రయత్నించాలి. వనరుల కొరత కారణంగా కొన్ని వ్యాపార ప్రణాళికలను నిలిపివేయాల్సి రావొచ్చు. ఆర్థిక పరంగా మెరుగైన ఫలితాలు వస్తాయి.

**సింహం:**
ఉద్యోగులకు తమ ఉన్నతాధికారులతో ప్రత్యేక సంబంధం ఏర్పడుతుంది. ఈరోజు మీకు రావాల్సిన బకాయిలన్నీ తిరిగి పొందొచ్చు. అనవసరమైన ఖర్చులను తగ్గించుకోవాలి. పనిలో మార్పులు మీకు అనుకూలంగా ఉండొచ్చు. ఒక ముఖ్యమైన కార్యక్రమానికి స్నేహితుల మద్దతు లభిస్తుంది.

**కన్య:**
ఉద్యోగులు కార్యాలయంలో సీనియర్ల నుంచి సంపూర్ణ మద్దతు పొందుతారు. అయితే వ్యాపారవేత్తలు ఈ సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ఆర్థిక విషయాలు మీకు అనుకూలంగా పరిష్కరించబడొచ్చు. వృత్తి, వ్యాపారాల్లో లాభాలకు కొదవ ఉండదు.

**తుల:**
ఒకరిపై అతిగా ఆధారపడటం ఒత్తిడికి కారణమవుతుంది. మీ కుటుంబంలోని పెద్దలు మీ అన్ని ప్రయత్నాలలో సంతోషంగా మీకు మద్దతు ఇస్తారు. వ్యాపారులు మంచి లాభాలను పొందే అవకాశం ఉంది. ఆర్థిక పరంగా మెరుగ్గా ఉంటుంది. మీరు కొత్త దానిపై బలమైన ఉత్సాహం చూపుతారు.

**వృశ్చికం:**
త్వరగా డబ్బు సంపాదించడానికి మీ మూలధనాన్ని తప్పుడు పథకాలలో పెట్టుబడి పెట్టకుండా జాగ్రత్త వహించాలి. విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించే అవకాశం ఉంది. మీ వైవాహిక జీవితంలో సంతోషంగా ఉంటుంది. ఉద్యోగులు కార్యాలయంలో ఉన్నతాధికారులు, సహోద్యోగుల దృష్టిని ఆకర్షిస్తారు.

**ధనస్సు:**
పనిలో మీ ప్రతిభను ప్రదర్శించడానికి మీకు అవకాశం లభిస్తుంది. మీ ఆదాయాన్ని పెంచుకోవడానికి కొన్ని మంచి అవకాశాలు కూడా లభిస్తాయి. విద్యార్థులకు, ఉద్యోగులకు ఈరోజు శుభప్రదం కానప్పటికీ, మీ లక్ష్యాలు, ఆశయాలను సాధించడంలో చురుగ్గా ఉండాలి.

**మకరం:**
ఈరోజు మీ సమయాన్ని ఒక అభిరుచి లేదా నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి కేటాయించాలి. మీరు కొత్తగా ఏదైనా ప్రారంభించాలని ఆలోచిస్తారు. ఆర్థిక విషయాలపై దృష్టి పెట్టడం వల్ల మీ మనసు ప్రశాంతంగా ఉంటుంది. మీ వ్యాపారానికి సంబంధించిన ఆందోళనలు ఉంటాయి.

**కుంభం:**
నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. సోదరుల నుండి శుభ కార్య ఆహ్వానాలు అందుతాయి. చిన్ననాటి మిత్రులతో దూర ప్రయాణాలు చేస్తారు. వ్యాపారాల్లో ఆశించిన పురోగతి సాధిస్తారు. వృత్తి ఉద్యోగాలలో సహోద్యోగులతో సఖ్యత కలుగుతుంది.

**మీనం:**
వ్యాపారాన్ని విస్తరించడానికి కొత్త ప్రణాళికలు వేయాలి. మీ పెండింగ్ ప్రాజెక్టులను తిరిగి ప్రారంభించడానికి ఈ సమయం అనుకూలంగా ఉంటుంది. ఆర్థిక పరమైన సమస్యల పరిష్కారానికి కొంత సమయం పట్టొచ్చు. వ్యాపారులు ఈరోజు మిశ్రమ ఫలితాలు పొందుతారు.



### కారులో రూ.4 కోట్ల
# నగదు లభ్యం

**హైదరాబాద్ ఏడీఎన్ఎన్) :**

హైదరాబాద్ - నగరంలోని శామీర్‌పేటలో కారులో భారీగా తరలిస్తున్న హవాలా నగదు పట్టుకున్న పోలీసులు. టైర్లు, సీట్ల కింద రూ.4 కోట్ల నగదును పోలీసులు గుర్తించారు. హవాలా మార్గంలో తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో బోయిన్‌పల్లి క్రైమ్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. హవాలా ముఠాను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

### ఇకపై భారీ ఇంటి అడ్వాన్సులకు చెల్లు
# యజమానులకు కేంద్రం అల్టిమేటం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**




ఇంటి యజమానులు, అద్దెదారుల మధ్య వివాదాలు తగ్గించే దిశగా కేంద్రం కొత్త మార్గదర్శకాలు రూపొందించింది. దేశవ్యాప్తంగా అద్దె ఒప్పందాలను సరళీకృతం చేసింది. దీనికోసం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మోడల్ టెనెన్సీ యాక్ట్ 2025 మార్గదర్శకాలను రాష్ట్రాలకు అందజేసింది. భారీ ఇంటి అద్దె అడ్వాన్సులకు చెల్లు పలికింది.

- ప్రస్తుతం ఢిల్లీ, ముంబై, బెంగళూరు వంటి మహా నగరాలలో అద్దెకుండేవారు 8 నెలల నుండి ఏడాది అద్దెను డిపాజిట్ గా చెల్లించాల్సి వస్తోంది. దీనితో ఈ భారాన్ని తీవ్రంగా పరిగణించింది కేంద్రం.
- నివాస గృహాలకు 2 నెలల అద్దె మాత్రమే డిపాజిట్ గా తీసుకోవాలని ఖచ్చితమైన పరిధి విధించింది. అలాగే వాణిజ్య సముదాయాల అద్దె గరిష్టంగా 6 నెలలు చేసింది.
- కొత్త నియమాల ప్రకారం, ప్రతి ఇంటి అద్దె ఒప్పందం రాత ఒప్పందం లేకపోయినా సరే డిజిటల్ స్టాంప్ తో పాటు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లో తప్పనిసరిగా ఉండాలి.
- ఒప్పందం సంతకం తర్వాత 60 రోజుల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రిజిస్ట్రేషన్ లేకపోతే, జరిమానాలు విధించే అవకాశాలున్నాయి.
- యజమాని ఒక సంవత్సరం మధ్యలో అద్దె పెంచకూడదు. పెంపు చేసే ముందు 90 రోజుల ముందుగా నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది.
- యజమాని అనుచితంగా నోటి మాట ద్వారా కాంట్రాక్ట్ రద్దు చేయలేరు. ఇళ్లు ఖాళీ చేయించాలంటే అధికార రెంట్ ట్రిబ్యునల్ కోర్ట్ ఆదేశం తప్పనిసరి.
- ఇంటికి అవసరమైన మరమ్మతులు యజమాని చేయాలి. లేకపోతే టెనెంట్ స్వయంగా చేయించి ఖర్చును అద్దె నుంచి తగ్గించుకునే అవకాశం ఉంది.

# ఇవి తిన్నారంటే మీ ఎముకలకు ఉక్కు బలం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



వయసు పెరిగే కొద్దీ ఎముకలు బలహీన పడడం సహజమే. కానీ మంచి పోషకాహారంతో ఎముకలను బలోపేతం చేసుకోవచ్చని వైద్యులు చెప్తున్నారు. జీవనశైలి, వృద్ధాప్యం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, సూర్యరశ్మి లేకపోవడం, ఎక్కువసేపు కూర్చునే అలవాటు కారణంగా, ఎముకలు వయసుతో సంబంధం లేకుండా బలహీనపడుతున్నాయి. ఈ ఎముకలను బలోపేతం చేయడానికి కాల్షియం మాత్రమే సరిపోదు. కాల్షియంతో పాటు, విటమిన్ డి, మెగ్నీషియం, ప్రోటీన్ కూడా అంతే ముఖ్యమైనవి. ఈ పోషకాలన్నింటినీ మనం మనకు అందుబాటులో ఉన్న ఆహారం ద్వారా సులభంగా పొందవచ్చు.

- ఎముకలను దృఢంగా ఉండాలంటే పాలు, పాల ఉత్పత్తులు తప్పనిసరి. పాలు, పెరుగు, చీజ్ వంటి పాల ఉత్పత్తుల ద్వారా ఎముకలు బలపడతాయి.
- పాలకూర, మెంతికూర వంటి ఆకుకూరలు, మెంతులు, ఆవాలు, ఉసిరికాయలలో కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ కె వంటివి సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఎముకలను బలోపేతం చేయడంలో పగుళ్ల నుంచి త్వరగా కోలుకోవడానికి సహాయపడతాయి.
- బాదం, వాల్ నట్ వంటి డ్రైఫ్రూట్స్ ఎముకలకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వాటిలో కాల్షియం, మెగ్నీషియం, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఒమేగా3 కొవ్వు ఆమ్లాలు ఉంటాయి, ఇవి ఎముక నొప్పిని తగ్గించడానికి ఎముక బలాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి.
- నువ్వులలో కాల్షియం, భాస్వరం, మెగ్నీషియంతో సమృద్ధిగా ఉంటాయి. ముఖ్యంగా శీతాకాలంలో, నువ్వుల లడ్డు లేదా నువ్వుల చట్నీ ఎముకలను బలోపేతం చేస్తాయి.
- సాల్మన్, సార్డిన్, మాకేరెల్ వంటి కొవ్వు చేపలు విటమిన్ డి, ఒమేగా3 కొవ్వు ఆమ్లాలతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి కాల్షియం శోషణను పెంచుతాయి. ఎముకలను బలోపేతం చేస్తాయి.
- మొలకెత్తిన విత్తనాలు, పల్లీలు, గోధుమలలో ప్రోటీన్, మెగ్నీషియం, ఇనుము పుష్కలంగా ఉంటాయి, ఇవి ఎముకలను బలోపేతం చేయడానికి సహాయపడతాయి.
- టోఫు, సోయా పాలు, సోయాబీన్స్ కాల్షియం, ప్రోటీన్ లకు మొక్కల ఆధారిత ఆహారం మంచి వనరు. ఇవి శాఖాహారులకు ఎముకల ఆరోగ్యానికి ముఖ్యంగా ప్రయోజనకరంగా ఉంటాయి.
- ఈ ఆహారాలతో పాటు సూర్యరశ్మి తగిలేలా రోజూ ఉదయం పూట ఎండలో కాసేపు గడపడం కూడా ఎముకల పటుత్వానికి సహాయపడుతుంది.

# చేతబడి చేశాడన్న అనుమానంతో హత్య..

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



హైటెక్ యుగంలో కూడా ఈ మూఢనమ్మకాలు ఏమిటో అర్థం కావడంలేదు. చేతబడి చేశాడన్న అనుమానంతో ఓ వ్యక్తిని దారుణంగా కొట్టి చంపేశారు. ఈ సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఉస్మానియా యూనివర్సిటీ సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు రోజుల క్రితం జరిగిన హత్య కేసును ఓయూ పోలీసులు, నల్లకుంట డిటెక్టివ్ టీం, ఈస్ట్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా ఛేదించారు. చేతబడి చేస్తున్నాడన్న అనుమానంతో హత్య చేసినట్టు తేలింది. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఓయూ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ బి.బాలస్వామి కేసు వివరాలు వెల్లడించారు. ధూల్‌పేట్ మంగళ్‌హాట్‌కు చెందిన మాగుసింగ్ (58) క్షుద్రశక్తుల ద్వారా లేక మంత్రాల ద్వారా వ్యాపారంలో బాగా లాభాలు వచ్చేలా చేస్తానని చిలకలగూడాకు చెందిన చేపల వ్యాపారి షేక్‌గౌస్, అతడి అల్లుడు సయ్యద్ షోయబ్ నుంచి కొంతకాలం క్రితం డబ్బులు తీసుకున్నాడు. కానీ వారి వ్యాపారంలో నష్టాలు రావడంతో పాటు, కుటుంబసభ్యులకు ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. మాగుసింగ్ చేతబడి చేసి ఉంటాడనే అనుమానంతో అతడిపై కక్ష పెంచుకున్నారు. పక్కా ప్లాన్‌తో డిసెంబర్ 1న మాగుసింగ్‌ను సయ్యద్ షోయబ్ స్కూటీపై చిలకలగూడకు తీసుకొచ్చాడు. వచ్చిన వెంటనే షేక్ గౌస్ ఇనుపరాడ్‌తో అతని తలపై బలంగా కొట్టాడు. తర్వాత షోయబ్‌కు చెందిన కారులో తీసుకెళ్లి కత్తితో గొంతుకోసి చంపేశారు. మృతదేహాన్ని తార్నాకలోని ఎర్రకుంట కట్ట వద్ద పడేసి వెళ్లిపోయారు. ఇల్యాస్ అనే వ్యక్తి కారు నడిపాడు. విచారణ చేపట్టిన పోలీసులు విశ్వసనీయ సమాచారంతో నిందితులను అరెస్ట్ చేశారు. విచారణలో నిందితులు నేరం అంగీకరించారు. గతంలో షేక్‌గౌస్ చోరీ, హత్యాయత్నం కేసుల్లో మైలార్‌దేవ్ పల్లి, బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్లలో నిందితుడిగా ఉన్నాడు.

# ఆస్పత్రిలో చేరిన ఆర్టీసీ డ్రైవర్ ఆకస్మిక మరణం!

**హైదరాబాద్(ఏడీఎన్ఎన్) :**




హైదరాబాద్‌లో ఓ ఆర్టీసీ బస్సు డ్రైవర్ ట్రీట్‌మెంట్ తీసుకుంటూ ఆకస్మికంగా మరణించాడు. కాలికి గాయమైందని ఆస్పత్రిలో చేరిన డ్రైవర్‌కు.. మూడు రోజుల చికిత్స అనంతరం ఇవాళ అతను మరణించాడని డాక్టర్లు తెలిపారు. దీనిపై మృతుడి కుటుంబసభ్యులు, తోటి ఉద్యోగులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే సతీష్ ప్రాణాలు కోల్పోయాడని ఆరోపిస్తున్నారు. హైదరాబాద్‌లోని పంజాగుట్టకు చెందిన సతీష్ టీజీఎస్‌ఆర్టీసీలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. నవంబర్ 30వ తేదీన జరిగిన ప్రమాదంలో సతీష్ కాలికి గాయమైంది. దీంతో సతీష్‌ను తార్నాకలోని ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ సతీష్ కాలికి సిమెంట్ పట్టి వేసి చికిత్స అందించారు. ఈ క్రమంలో నిన్న మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా సతీష్ చనిపోయాడని ఆస్పత్రి వైద్యులు వెల్లడించారు. దీనిపై సతీష్ కుటుంబసభ్యులు, తోటి ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటలకు డాక్టర్లు అన్ని పరీక్షలు చేసి ఎలాంటి సమస్య లేదని ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారని, మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్నిసార్లు అడిగినా సమాధానం ఇవ్వలేదని కుటుంబసభ్యులు, తోటి కార్మికులు ఆరోపించారు. ఎందుకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని నిలదీయడంతో సతీష్ చనిపోయాడని డాక్టర్లు చెప్పారని పేర్కొన్నారు. అనుభవం లేని డాక్టర్లతో ఆపరేషన్ చేయించడం వల్లనే సతీష్ మృతి చెందాడని వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, టీజీఎస్ ఆర్టీసీ ఆస్పత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### మెడికల్ కాలేజీల
# ప్రైవేటీకరణను తక్షణం ఆపాలి

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**



కూటమి ప్రభుత్వం పై గత 16 నెలల్లోనే ప్రభుత్వం రూ.2.5 లక్షల కోట్లు అప్పు చేసిందని మాజీ మంత్రి అప్పలరాజు మండిపడ్డారు. పీపీఏ విధానంలో మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో, మంత్రి అప్పలరాజు శుక్రవారం మాట్లాడుతూ ,మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా నిరసనలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రజా సంపదను ప్రభుత్వం దోచుకుంటూ లక్షల కోట్లు అప్పులు చేస్తోందని ఆరోపిస్తూ, జగన్ హయాంలో రూ.3 లక్షల 30 వేల కోట్ల అప్పు తీసుకొచ్చినా, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కేవలం 16 నెలల్లోనే రూ.2.5 లక్షల కోట్లు అప్పు చేసి రికార్డు మించిందని తెలిపారు. రెండు ప్రభుత్వాల్లో అసలు విధ్వంసానికి పాల్పడింది ఏది అని ప్రజలే నిర్ణయించాలని సవాల్ విసిరారు. తమ ప్రభుత్వం కాలంలో స్కూళ్లను అభివృద్ధి చేసి విద్యా వ్యవస్థను బలోపేతం చేశామని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ ఆదర్శవంతమైన పాఠశాలలను శిథిలావస్థకు చేర్చేసిందని మాజీ మంత్రి అప్పలరాజు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

# 'ఆపరేషన్ కవచ్' తో తనిఖీలు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**




హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్ నగర శాంతిభద్రతలను మరింత బలపర్చే దిశగా అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. డిసెంబర్ 5 రాత్రి 10 గంటల నుంచి 'ఆపరేషన్ కవచ్' పేరుతో హైదరాబాద్ అంతటా విస్తృత స్థాయిలో నాకాబందీ నిర్వహించామని తెలిపారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ చరిత్రలో ఇదే మొదటి సారిగా ఇంత భారీ స్థాయిలో పోలీసు తనిఖీలు చేపడుతున్నామని సజ్జనార్ పేర్కొన్నారు. మొత్తం 5,000 మంది పోలీసు సిబ్బంది ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో పాల్గొంటుండగా, నగరంలోని 150 కీలక ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు సాగుతున్నాయి. లా అండ్ ఆర్డర్ వింగ్, ట్రాఫిక్ విభాగం, టాస్క్ ఫోర్స్, ఆర్మ్డ్ రిజర్వ్, బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ బృందాలు కలిసి సమన్వయంతో ఈ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నాయి. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని చేపట్టిన ఈ భారీ ఆపరేషన్‌లో పౌరులందరూ సహకరించాలని కోరుతూ, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా కదలికలు గమనిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. ఈ చర్య నగర భద్రతను కొత్తస్థాయికి తీసుకువెళ్తుందని, ప్రజల్లో నమ్మకం పెంపొందించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.



### ఆర్బీఐ ప్రకటనతో హోమ్ లోన్
# గ్రహీతలకు పండగే

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

హోమ్ లోన్ గ్రహీతలకి గుడ్ న్యూస్ చెప్పింది ఆర్బీఐ. శుక్రవారం ఈ విషయంగా ముఖ్య ప్రకటన చేసింది. మరోసారి తన రెపో రేటును తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. తన రేపో రేటును 5.50 శాతం నుండి 5.25 శాతానికి తగ్గించింది. ఇది ఈ ఏడాదిలో నాల్గవ సారిగా రేటు తగ్గింపు కావడం విశేషం. ఇప్పటి వరకూ మొత్తం 125 బేసిస్‌పాయింట్లు తగ్గించారు. రెపో రేటు తగ్గడం వలన, వడ్డీ తక్కువ అవుతుంది. మరీ ముఖ్యంగా, ఫ్లోటింగ్ రేటు, ఎక్స్ టర్నల్ బెంచ్ మార్క్ ఉన్న లోన్లు ఉన్న వారికి వడ్డీ తగ్గింపు ప్రత్యక్షంగా ఉంటుంది. దాని ఫలితంగా నెలవారీ ఈఎంఐలు తగ్గే అవకాశముంది. ఉదాహరణకి: రూ. 30 లక్షలు, రూ 50 లక్షలు లేదా రూ.75 లక్షల లోన్ తీసుకున్న వారు, వడ్డీ రేటు తగ్గింపుతో సంవత్సరానికి కొద్దిపాటి మొత్తంలో కూడ ఆదా చేయగలరు . ఇది వారి పూర్తి నిడివి మీద ఆధారపడి మారుతుంది. ఈ రేటు తగ్గింపు వలన, ఇళ్ల కొనుగోళ్లకు ఉత్సాహం పెరుగుతుందని, రియల్ ఎస్టేట్ రంగంలో డిమాండ్ పెరుగుతుందని పరిశోధకులు భావిస్తున్నారు. ప్రత్యేకంగా, మధ్యమ ఆదాయ వర్గాలు ఇది మంచి సమయం. ఇళ్లు కొనేవారికి ఇది చాలా ఎంకరేజింగ్ గా ఉంటుంది.



### చనిపోయేలోగా
# శ్రీవారి దర్శనం కల్పించండి

**తిరుమల (ఏడీఎన్ఎన్) :**

కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వృద్ధులు, దివ్యాంగులు తపన పడుతున్నారు. టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్ శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో అనేక రాష్ట్రాల వృద్ధులు ఈవోకు ఫోన్ చేసి మాట్లాడారు. వారి మాటలు విన్న ఈవో షాక్ తిన్నారు. తాము వృద్ధులమై పోయామని, ఆన్ లైన్ టిక్కెట్లు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయేలోగా శ్రీవారి దర్శనం కల్పించాలంటూ వేడుకున్నారు. వృద్ధులు, వికలాంగులకు ఒకే టైమ్ స్లాట్ కేటాయించడం వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నామని, వైకుంఠ ద్వార దర్శనాలు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడుకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. గతంలో మాదిరిగా వృద్ధులు, వికలాంగులు, చంటిపిల్లల తల్లులకు వేర్వేరుగా ఆఫ్ లైన్ దర్శనం కల్పించాలంటూ కోరుతున్నారు. ఒక వృద్ధుడు మాట్లాడుతూ టీటీడీ వెబ్ సైట్ లో దర్శనం కోటా నెలలుగా ప్రయత్నిస్తున్నా దొరకడం లేదని, రెండేళ్ల కన్నా ఎక్కువ బతకలేనని ఈవోను ప్రాధేయపడడంతో ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులంతా అవాక్కయ్యారు.



### నిబంధనలకు 'నీళ్లు'..
# నీటి నాణ్యత గాలికి..

**కాకినాడ (ఏడీఎన్ఎన్) :**

స్వచ్ఛమైన నీటిని తాగాలనే సంకల్పంతో జనాలు మినరల్ వాటర్ ప్లాంట్ల బాట పట్టారు. ఖరీదైనా సరే ఆ నీటినే తాగుతున్నారు. అయితే.. వీటి నిర్వహణలో మాత్రం నాణ్యత కరవైంది. కాకినాడలో ఇటీవల పలు ఆర్వో ప్లాంట్లను తనిఖీ చేసి.. నీటి శాంపిళ్లను పరిశీలనకు పంపగా ప్లాంట్ల నిర్వహణా లోపాలు బయటపడ్డాయి. అయితే.. మనం తీసుకునే ఈ నీరు నాణ్యమైనదేనా? అనే ఆలోచన చాలా మందికి ఉండటం లేదు. ఆర్వో వాటర్ ప్లాంట్ అని కనిపిస్తే చాలు.. అక్కడి నుంచే నీటిని కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు. మరోవైపు నీటి వ్యాపారం బాగుండటంతో వీధికొకటి చొప్పున మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా యి. కాకినాడ జిల్లాలో ఇటీవల కాలంలో తాగునీటి శుద్ధి ప్లాంట్ల సంఖ్య విపరీతంగా పెరిగింది. 20 లీటర్ల బాటిల్ నీటిని పట్టుకోవాలంటే రూ.10 నుంచి మొదలు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. అనుమతులు లేకుండానే.. కాకినాడ జిల్లాలోని ప్రతి గ్రామంలోనూ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా విస్తరించాయి. వాస్తవానికి మినరల్ వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు గ్రామ పంచాయతీ, పురపాలక సంస్థ నుంచి నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకుని విద్యుత్ శాఖ కనెక్షన్ పొందాలి. ట్రేడ్ లైసెన్స్ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ (బీఐఎస్), ఆహార కల్తీ నిరోధక, భూగర్భజల, ఇతర శాఖల అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ, ఇవన్నీ ఎవరూ పట్టించుకోవడం లేదు. జలనాణ్యతను పరిశీలించే పరికరాలు, రసాయనాలు, మైక్రో బయాలజిస్టు లేదా కెమిస్టులు ప్లాంటులో పనిచేయాలి. స్టీల్ డ్రమ్ములు, అంతర్గత పైప్‌లైన్, ఏసీలు ఉపయోగించాలి. యంత్రాలకు వాడే ఫిల్టర్‌లను నెలకోసారి శుభ్రం చేయాలి. ప్రతి రోజూ టీడీఎస్ పరికరం ద్వారా నీటి సాంద్రతను పరిశీలించి నమోదు చేయాలి. కానీ, ఇవన్నీ ఎక్కడా జరగడం లేదు. అనుమతులూ తీసుకోవడం లేదు. అన్ని అనుమతులతో ప్లాంట్ ఏర్పాటుకు దాదాపు రూ.50 లక్షల పైనే ఖర్చవుతుందని అంచనా. తూతూ మంత్రంగా ప్లాంట్లు ఏర్పాటు చేసి మినరల్ వాటర్ అంటూ ప్రజల ప్రాణాలతో జలగాటం ఆడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేమి ప్లాంట్లు నిర్వాహకులకు కలిసొస్తోంది. కొందరు ప్లాంట్ల నిర్వాహకులు వాటర్ క్యాన్లనూ సరిగా శుభ్రం చేయడం లేదు. ఏళ్ల తరబడి పాతవాటినే వినియోగిస్తున్నారు. మూడు నెలలకోసారి మార్చాలనే నిబంధన ఎక్కడా అమలు కావడం లేదు. కాకినాడలో ఇటీవల పలు ఆర్వో ప్లాంట్లను నగర పాలక ఇంజినీరింగ్ అధికారులు తనిఖీ చేశారు. నీటి శాంపిళ్లను సేకరించి విశాఖకు పంపించగా.. ప్లాంట్ల నిర్వహణ సరిగ్గా లేదని తేలింది. తాగునీరు సురక్షితమో.. కాదో ఇలా తెలుసుకోవచ్చు, థర్మామీటర్‌ను పోలి ఉండే బాటిల్ డిసాల్వ్ సాలిడ్స్ (టీడీఎస్) పరికరం ద్వారా పరీక్షించవచ్చు. మార్కెట్లో ఇవి తక్కువ ధరకే లభిస్తాయి. టీడీఎస్ స్థాయిని పార్ట్స్ పర్ మిలియన్ (పీపీఎం) స్థాయిలో లెక్కిస్తారు.



## కింగ్ కోహ్లి సెంచరీల ఎఫెక్ట్ తో
# వైజాగ్ హౌస్ ఫుల్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**
భారత్ క్రికెట్ దిగ్గజం కింగ్ కోహ్లి ఇటీవల దక్షిణాఫ్రికాపై సెంచరీలతో చెలరేగి అభిమానులకు కనువిందు చేశాడు. టీమిండియా దక్షిణాఫ్రికాల మధ్య మూడు వన్డేల సిరీస్‌లో పవర్ ఫుల్ సెంచరీలు నమోదు చేయడంతో కోహ్లి అభిమానులు సంబరపడుతున్నారు. ఇప్పటికే రాంచీ, రాయపూర్ లో రెండు మ్యాచ్ లు ముగిశాయి. మూడో మ్యాచ్ విశాఖపట్నం వేదికగా శనివారం జరగనుంది. అయితే మూడో వన్డేకు సంబంధించి టికెట్ల విక్రయాలు మొదట్లో చెప్పుకోదగ్గ స్థాయిలో జరగలేదని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధికారులు తెలిపారు. కానీ ఎప్పుడైతే విరాట్ కోహ్లి రాంచీ, రాయపూర్ మ్యాచ్ లలో వరుస సెంచరీలతో కదం తొక్కాడో.. ఆ తర్వాత ఒక్కసారిగా టికెట్ల విక్రయాలు ఊపందుకున్నాయని వారు వివరించారు. డిసెంబర్ 6న జరగనున్న మ్యాచ్ కు సంబంధించి, మొదట నవంబర్ 28నే టికెట్ల విక్రయానికి ఆన్ లైన్లో అందుబాటులోకి వచ్చాయి. తర్వాత ఆఫ్ లైన్లో టికెట్ల విక్రయాల కోసం కౌంటర్లు ఏర్పాటుచేశారు. కానీ పెద్దగా స్పందన రాలేదు. ఎప్పుడైతే విరాట్ కోహ్లి రాంచీ వేదికగా జరిగిన మొదటి వన్డేలో సూపర్ సెంచరీ (135) సాధించాడో.. అప్పుడు పరిస్థితుల్లో మార్పు వచ్చింది. టికెట్ల అమ్మకాలు ఊపందుకున్నాయి. 'టికెట్ల విక్రయం నవంబర్ 28న ప్రారంభమైంది. మొదట్లో అభిమానుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. కానీ కోహ్లి రాంచీలో సెంచరీ చేసిన తర్వాత నిమిషాల్లో టికెట్లన్నీ అమ్ముడుపోయాయి' అని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ మీడియా అండ్ ఆపరేషన్స్ టీమ్ తెలిపింది. రాయపూర్ మ్యాచ్ లో కూడా కోహ్లి విజృంభించడంతో వైజాగ్ స్టేడియం హౌస్ ఫుల్ అయిపోయింది.

## కేఎల్ రాహుల్ పై సౌతాఫ్రికా
# క్రికెటర్ ప్రశంసల వర్షం



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**
టీమిండియా, దక్షిణాఫ్రికా మధ్య మూడు వన్డేల మ్యాచ్ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే రెండు మ్యాచ్ లు పూర్తి కాగా, చివరి మ్యాచ్ ఆడాల్సి ఉంది. అయితే తాజాగా టీమిండియా క్రికెటర్ కేఎల్ రాహుల్ ఆటతీరుపై సౌతాఫ్రికా మాజీ ఫాస్ట్ బౌలర్ డేల్ స్టెయిన్ ప్రశంసల వర్షం కురిపించారు. ఇప్పటిదాకా జరిగిన రెండు మ్యాచ్ లలోనూ కేఎల్ రాహుల్ అర్ధసెంచరీలతో మెరిశారు. దీనితో బ్యాటింగ్ లో నిలకడ ప్రదర్శిస్తున్నాడని మెచ్చుకున్నారు. కేఎల్ రాహుల్ ని టాప్ ఆర్డర్ లో పెడితే మరిన్ని సెంచరీలు చేస్తాడని సూచించారు. రాహుల్ మూడో స్థానంలో బ్యాటింగుకు దిగితే ఖచ్చితంగా సెంచరీలు సాధించగలడు. అతడు ఏ స్థానంలో ఆడినా జట్టుకోసం బాగా ఆడుతున్నాడు. ఎప్పుడు తగ్గాలో, ఎప్పుడు వేగంగా ఆడాలో కూడా అతనికి తెలుసన్నాడు. ప్రస్తుతం గిల్, శ్రేయస్ అయ్యర్ గాయాల కారణంగా వన్డే జట్టుకు దూరమవడంతో కేఎల్ రాహుల్ కెప్టెన్ గా వ్యవహరిస్తున్నాడు. రాంచీ వేదికగా జరిగిన మొదటి వన్డేలో టీమ్ ఇండియా 17 పరుగులతో విజయం సాధించగా..రాయ్ పూర్ వన్డేలో సఫారీల జట్టు 4 వికెట్ల తేడాతో గెలిచింది. మూడవ వన్డే వైజాగ్ లో శనివారం జరగనుంది. కేఎల్ రాహుల్ ఇప్పటివరకూ వన్డేల్లో 83 ఇన్నింగ్స్ ఆడగా..50 యావరేజ్ స్కోర్ తో 3218 పరుగులు చేశాడు. దీనిలో 3 సెంచరీలు, 20 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.



## సామూహిక నిరుద్యోగ
# ప్రమాదం పొంచి ఉంది

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**
ఏఐ గాడ్ ఫాదర్ గా పిలుచుకునే జెఫ్రీ హింటన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంపై మరో బాంబు వేశారు. ఏఐ వినియోగం ఎక్కువయ్యేకొద్దీ లక్షల మంది ఉద్యోగాలు కోల్పోతున్నారని, దీనివల్ల సామూహిక నిరుద్యోగ ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్కువ ఖర్చుతో మానవ శ్రమను పూర్తిగా భర్తీ చేసే దిశగా కంపెనీలు ముందుకు సాగుతున్నాయన్నారు. టెక్ దిగ్గజ కంపెనీలు డేటా సెంటర్లు, చిప్స్ పై ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు పెడుతున్నారని పేర్కొన్నారు. ఏఐ కొత్త ఉద్యోగాలను సృష్టించలేదని, కోల్పోయే ఉద్యోగాల సంఖ్యను భర్తీ చేయలేదని ఆయన పేర్కొన్నారు.

# ఐపీఎల్ నావల్ల కాదు: రిటైర్మెంట్‌పై రస్సెల్

- ❖ ఐపీఎల్ రిటైర్మెంట్ పై క్లారిటీ ఇచ్చిన రస్సెల్
- ❖ ఐపీఎల్ లో అన్నివైపులా విపరీతమైన ఒత్తిడి
- ❖ ప్రతీ రోజూ ఫిట్ గా ఉండలేం
- ❖ రస్సెల్ ను కోచ్ గా పెట్టుకునే ఉద్దేశంలో కేకేఆర్



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**
ఐపీఎల్‌లో మోస్ట్ సక్సెస్‌ఫుల్ ఆల్‌రౌండర్‌గా ఉన్న రస్సెల్‌ను కోల్‌కతా నైట్ రైడర్స్ ఫ్రాంఛైజీ మినీ వేలానికి ముందే రిలీజ్ చేసింది. దాంతో అందరూ రస్సెల్ ఈసారి వేలంలో భారీ ధర పలుకుతాడు అని అనుకున్నారు. కానీ అందరి అంచనాలను తారుమారు చేస్తూ రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ విషయంలో క్లారిటీ ఇచ్చాడు రస్సెల్. ఐపీఎల్ ఒత్తిడిని తాను తట్టుకోలేనని పేర్కొన్నాడు. "ఐపీఎల్ లో మ్యాచ్ లు ఎక్కువ. ట్రావెల్ ఎక్కువ చేయాల్సి వస్తుంది. రికవరీ, ప్రాక్టీస్, జిమ్.. ఇవన్నీ బ్యాలెన్స్ చేయడం చాలా కష్టం. రోజూ అదే స్థాయిలో ప్రదర్శన ఇవ్వడం చాలా కష్టం. అంతేకాక బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ అన్నీ చేయాలి. ఐపీఎల్ లాంటి లీగ్ లో టాప్ ఫిట్ గా ఉండడం ఎంతో శ్రమతో కూడుకుని ఉంటుంది. కేవలం బ్యాటర్ గా ఆడటం నాకు సరిపోదు. కనీసం రెండు ఓవర్లు బౌల్ చేస్తేనే నా బ్యాటింగ్ కూడా సెట్ అవుతుంది" అని రస్సెల్ పేర్కొన్నాడు. అలాగే ఇంపాక్ట్ ప్లేయర్ గా సిక్స్ లు మాత్రమే కొట్టే ప్లేయర్ గానూ ఆడటం నచ్చదని చెప్పాడు. కేకేఆర్ తరఫున 12 సీజన్లు ఆడిన రస్సెల్ 2014, 2024 టైటిళ్లలో కీలక పాత్ర పోషించాడు. కేకేఆర్ లో కొనసాగుతూనే ఇతర లీగుల్లో కూడా ఆడుతూ ఉండేవాడు. ఐపీఎల్ నుంచి పూర్తిగా రిటైర్మెంట్ తీసుకున్న రస్సెల్ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న ఇతర టీ20 లీగ్ లలో మాత్రం కొనసాగుతున్నాడు. రస్సెల్ ఇప్పటి వరకు 140 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడి 2651 పరుగులు చేయడమే కాకుండా 123 వికెట్లు కూడా పడగొట్టాడు. రస్సెల్ స్ట్రయిక్ రేట్ ఏకంగా 174.18గా ఉంది. ఐపీఎల్‌లో వెయ్యికి పైగా బంతులు ఆడిన ప్లేయర్లలో రస్సెల్ స్ట్రయిక్ రేటే అధికం. కేకేఆర్ మాత్రం ఐపీఎల్ వరకు అతన్ని కోచ్ గా తమ సెటప్ లోనే కొసాగించుకోవాలని చూస్తోంది.

## జైపూర్ వ్యాక్స్ మ్యూజియంలో
# హర్మన్ ప్రీత్ కౌర్ మైనపు విగ్రహం

- ❖ మహిళల క్రికెట్ కు డిమాండ్ తీసుకొచ్చిన కెప్టెన్
- ❖ జైపూర్ వ్యాక్స్ మ్యూజియంలో మహిళా కెప్టెన్ మైనపు విగ్రహం
- ❖ మొదటిసారి భారత మహిళా జట్టుకు ప్రపంచకప్ అందించిన కెప్టెన్



**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**
భారత మహిళల క్రికెట్‌కు 'ఆటిట్యూడ్', 'అటాక్', 'భయం లేని బ్యాటింగ్' అనే మాటలను పరిచయం చేసిన పేరు హర్మన్‌ప్రీత్ కౌర్. అందుకే ఆమెను పంజాబ్ పులి, లేడీ సెహ్వాగ్ అంటుంటారు. తాజాగా ఆమె మరో అరుదైన ఘనత సాధించింది. జైపూర్ వ్యాక్స్ మ్యూజియంలో ఈ కూల్ కెప్టెన్ మైనపు విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు, దీనికోసం ఆమె కొలతలు సేకరించినట్లు ఇన్ స్టాగ్రామ్ లో జైపూర్ వ్యాక్స్ మ్యూజియం ప్రకటించింది. దీనితో ఆమె ప్రపంచంలోనే మైనపు విగ్రహం కలిగిన తొలి మహిళా క్రికెటర్ గా పేరు పొందనుంది. ఈ మ్యూజియంలో సచిన్, కోహ్లి, ధోనీల మైనపు విగ్రహాల సరసన ఈ పంజాబీ క్రికెటర్ మైనపు శిల్పం కూడా చేరనుంది. హర్మన్ 1989 మార్చి 8న పంజాబ్‌లోని మోగా అనే చిన్న పట్టణంలో జన్మించింది. చిన్నప్పటి నుంచే ఆమెకు బంతిని దూరంగా కొట్టడం అంటే ఇష్టం. బ్యాట్ బరువుగా ఉన్నా ఏమాత్రం కంగారు పడేది కాదు. ఆమె తండ్రి హర్మందర్ సింగ్ భుల్లర్ స్వయంగా క్రీడాకారుడు. అమ్మాయిలను క్రీడల వైపు పంపని కాలంలో హర్మన్ చేతికి మొదటి బ్యాట్ ఇచ్చింది కూడా ఆయనే. మంచి కోచ్ ఉండే ప్రదేశానికి వెళ్ళడానికి తండ్రి తన బైక్ అమ్మి, ఆమెకు సైకిల్ కొనిచ్చేంతగా సపోర్ట్ చేశారు. అలా ప్రొఫెషనల్ క్రికెటర్ గా ప్రస్థానం మొదలుపెట్టిన హర్మన్ 2009లో ఇండియా వన్డే జట్టులోకి ఎంట్రీ ఇచ్చింది. వచ్చిన కొన్నేళ్లకే జట్టులో ముఖ్య ప్లేయర్ గా మారింది. 2016లో ఆస్ట్రేలియా WBBL ఆడేందుకు సైన్ అయిన భారత మహిళల తొలి క్రికెటర్ కూడా హర్మనే! విదేశీ లీగ్‌కు భారత మహిళా టీమ్ ను తీసుకెళ్లే మార్గం ఆమెతోనే మొదలైంది. 2017 ప్రపంచకప్‌లో ఆమె 171పరుగులు సాధించడం భారత మహిళల క్రికెట్ లో గేమ్ ఛేంజర్ అనే చెప్పాలి. ఆస్ట్రేలియా వంటి బలమైన జట్టుతో సెమీఫైనల్. ఒక మహిళా క్రికెటర్ ప్రపంచకప్ ప్లే ఆఫ్‌లో ఇంతటి ఇన్నింగ్స్ ఆడటం అప్పటివరకు ప్రపంచం ఊహించలేదు. ఈ ఇన్నింగ్స్ తో ప్రపంచ మీడియాలో "INDIA HAS A NEW SUPERSTAR" అనే హెడ్ లైన్లు దర్శనమిచ్చాయి. టీ20 ఫార్మాట్‌లో టీమ్‌ను వరుసగా మూడు ఐసీసీ టోర్నీల సెమీఫైనల్‌కు తీసుకువెళ్లిన కెప్టెన్ గా ఆమె పేరు పొందింది. ఒత్తిడిని జయించి కెప్టెన్ కూల్ గా పేరు పొందింది. "ప్రెజర్ వల్ల ఎన్నోసార్లు ఏడిచాను...కానీ ఆ రాత్రులే నన్ను కెప్టెన్‌గా తయారు చేశాయి." అని హర్మన్ చెప్పింది.

# ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' రేసులో షఫాలీ వర్మ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**
మహిళల వన్డే వరల్డ్ కప్ ఫైనల్ స్టార్ షఫాలీ వర్మ తాజాగా నవంబర్ నెలకు ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ది మంత్' నామినేషన్స్ లో నిలిచింది. ఫైనల్ లో అద్భుతంగా ఆడిన షఫాలీ అనూహ్యంగా టీమ్ లోకి వచ్చింది. సెమీ ఫైనల్ మ్యాచ్ కు ముందు ప్రతికా రావల్ గాయపడడంతో షఫాలీ టీమ్ లోకి ఎంట్రీ ఇచ్చింది. సెమీస్ లో సరిగ్గా ఆడక



పోయినా ఫైనల్ లో సత్తా చాటింది. 78 బంతుల్లో 87 పరుగులు చేసింది. బౌలింగ్ లో కూడా విజృంభించి కీలకమైన రెండు వికెట్లు కూల్చింది. ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ కోసం యూఏఈకి చెందిన ఈషా ఓజా, థాయ్ లాండ్ కు చెందిన తిపట్చా పుట్టావాంగ్ కూడా నామినేట్ అయ్యారు. టైటిల్ ఎవరిని వరిస్తుందో వేచి చూడాల్సిందే.

# వడ్డీరేట్లను కట్ చేసిన ఆర్బీఐ..

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీ రేట్లను తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. ఫలితంగా రెపో రేటు 25 బేసిస్ పాయింట్లు తగ్గి 5.25 శాతానికి చేరింది. ఈ మేరకు మానిటరీ పాలసీ సమావేశం అనంతరం ఆర్బీఐ గవర్నర్ కీలక ప్రకటన చేశారు. వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్టు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఫలితంగా రెపో రేటు 5.5 శాతం నుంచి 5.25 శాతానికి దిగొచ్చింది. ఈ మేరకు మూడు రోజుల ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ సమావేశం అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ప్రకటించారు. ద్రవ్యోల్బణం 4 శాతం కంటే చాలా తక్కువగా ఉన్నందున, శుక్రవారం ఆర్‌బీఐ తన బెంచ్‌మార్క్ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.25%కి తీసుకువస్తుందని బ్లూమ్‌బెర్గ్ సర్వే చేసిన 44 మంది ఆర్థికవేత్తల్లో ఎక్కువమంది అంచనా వేశారు. అయితే భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందుతుండటం, రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 90 స్థాయి కంటే దిగువకు పడిపోయి రికార్డు కనిష్ఠానికి చేరడం వంటి కారణాల వల్ల ఆర్బీఐ రేట్లను యథాతథంగా ఉంచే అవకాశం కూడా ఉందని సిటీ గ్రూప్ ఇంక్, స్టాండర్డ్ చార్టర్డ్ పీఎల్‌సీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు అంచనా వేశాయి. చివరికి ఆర్బీఐ వడ్డీ





రేట్లను తగ్గిస్తున్నట్టు నిర్ణయించింది.

**ఆర్బీఐ ద్రవ్య విధాన కమిటీ కీలక నిర్ణయాలు..**
**డిసెంబర్ 3 నుంచి 5 వరకు జరిగిన ద్రవ్య పరపతి విధాన కమిటీ సమావేశంలో భారతదేశ కేంద్ర బ్యాంక్ తీసుకున్న ముఖ్య నిర్ణయాల వివరాలు:**
ఆర్బీఐ బెంచ్‌మార్క్ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 5.25%కి చేసింది. మానిటరీ పాలసీ వైఖరిని తటస్థంగా కొనసాగించింది. భారతదేశ జీడీపీ వృద్ధి రేటును గతంలో అంచనా వేసిన 6.8% నుంచి 7.3%కి పెంచింది! ఎఫ్వై26లో భారతదేశ ద్రవ్యోల్బణం రేటును గతంలో అంచనా వేసిన 2.6% నుంచి 2%కి తగ్గించింది. గత రెండు ద్రవ్య విధాన సమావేశాల్లో రెపో రేటును మార్చకుండా ఉంచిన ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా, గత నెలలో రెపో రేటు తగ్గింపులకు "ఖచ్చితంగా అవకాశం ఉంది" అని చెప్పారు. అయితే, అప్పటి నుంచి వెలువడిన అధికారిక డేటా ప్రకారం.. అమెరికా విధించిన 50 శాతం సుంకాలను ఎదుర్కొంటూ కూడా భారత ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకతను ప్రదర్శిస్తుందని వెల్లడైంది. మరోవైపు, రూపాయి విలువ భారీగా పడిపోయింది. దీని ఫలితంగా, ఆర్బీఐ రెపో రేటు కోత అంచనాలు మసకబారినట్లుగా కనిపిస్తున్నాయని, కేంద్ర బ్యాంక్ సుదీర్ఘ విరామం దశలోకి ప్రవేశిస్తున్నట్లు అనిపిస్తోందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యుడు సౌమ్య కాంతి ఘోష్ పేర్కొన్నారు. గత ఎంపీసీ సమావేశం జరిగినప్పటి నుంచి రూపాయి విలువ పడిపోవడం శుక్రవారం నాటి నిర్ణయాన్ని మరింత ఊహించలేనిదిగా చేసింది! భారతదేశం యూఎస్ వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో, ఈ వారం డాలర్‌కు 90 స్థాయిని దాటేసింది. ఫ్లాట్‌గా స్టాక్ మార్కెట్.. ఆర్బీఐ మోనటరీ పాలసీ సమావేశం నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం ట్రేడింగ్ సెషన్లో ఫ్లాట్‌గా కొనసాగుతున్నాయి. ఉదయం 10 గంటలకు నిఫ్టీ 50 20 పాయింట్ల నష్టంతో 26,007 వద్ద ట్రేడ్ అవుతోంది. బ్యాంక్ నిఫ్టీ 126 పాయింట్లు పెరిగి 59,414 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్ 47 పాయింట్ల నష్టంతో 85,219 వద్ద ట్రేడ్ అవుతోంది.

# ఎఫ్‌పీఐలు వెనక్కి తీసుకున్న పెట్టుబడులు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**
విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (FPI) భారీగా తమ పెట్టుబడులను వెనక్కితీసుకుంటున్నారు. గడిచిన నాలుగు రోజుల్లో దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి ఏకంగా రూ.13,121 కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. మొత్తంగా ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.1.56 లక్షల కోట్లు లేదా 17.8 బిలియన్ డాలర్ల పెట్టుబడులను తరలించుకుపోయారని ఎన్ఎస్‌డీఎల్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే నవంబర్ నెలలో రూ.3,765 కోట్లు వెనక్కి తీసుకున్నారు. వరుసగా మూడు నెలల పాటు భారీ స్థాయిలో నిధులను వెనక్కితీసుకున్న ఎఫ్ఐఐలు అక్టోబర్‌లో రూ.14,610 కోట్ల పెట్టుబడులు పెట్టడం విశేషం. సెప్టెంబర్‌లో రూ.23,885 కోట్లు, ఆగస్టులో రూ.34,990 కోట్లు, జులై నెలలో రూ.17,700 కోట్ల పెట్టుబడులను తరలించుకుపోయారు. ఇదే




క్రమంలో డిసెంబర్ నెల తొలి నాలుగు రోజులు 1 నుంచి 4 వరకు ఏకంగా రూ.13,121 కోట్లను వెనక్కి తీసుకున్నారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ బలహీనంగా ఉండటంతో ఎఫ్ఐఐల్లో ఆందోళన నెలకొంది, ఫలితంగా ఈక్విటీ మార్కెట్ల నుంచి భారీ స్థాయిలో తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుంటున్నట్టు దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, అమెరికా భారత్ దేశాల వాణిజ్య ఒప్పందం కొలిక్కి రాకపోవడం కూడా మరో కారణం.

**ఎట్టకేలకు లాభాల్లోకి సూచీలు**
స్టాక్ మార్కెట్ల వరుస పతనానికి బ్రేక్‌పడింది. టెక్నాలజీ, ఐటీ రంగ షేర్ల నుంచి లభించిన మద్దతుతో సూచీలు తిరిగి లాభాల్లోకి రాగలిగాయి. ఇంట్రాడేలో 400 పాయింట్ల వరకు లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 158.51 పాయింట్లు అందుకుని 85,265.32 వద్ద ముగియగా, మరో సూచీ నిఫ్టీ 26 వేల మార్క్ ను తిరిగి అధిగమించింది. చివరకు 47.75 పాయింట్లు అందుకొని 26,033.75 వద్ద స్థిరపడింది. గత నాలుగు వరుస సెషన్లలో సెన్సెక్స్ 613 పాయింట్లు, నిఫ్టీ 230 పాయింట్లు నష్టపోయిన విషయం తెలిసిందే. టీసీఎస్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్ తదితర షేర్లు లాభాల్లో ముగిశాయి.




# మ్యాచ్‌లే ఆడతాం!..

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**
మరికొద్దిరోజుల్లో అబుదాబి వేదికగా నిర్వహించాల్సి ఉన్న ఐపీఎల్ వేలానికి ముందు పలువురు విదేశీ ఆటగాళ్లు తాము సీజన్ మొత్తానికి అందుబాటులో ఉండలేమని కొత్త మెలిక పెట్టారు. గత సీజన్‌లో పంజాబ్ కింగ్స్ కు ఆడిన జోష్ ఇంగ్లిస్.. 2026లో నాలుగు మ్యాచ్‌లు మాత్రమే ఆడతానని బీసీసీఐకి తెలిపాడు. వేలంలో భారీ ధర పలుకుతాడని అంచనాలున్న ఇంగ్లిస్.. అన్ని తక్కువ మ్యాచ్‌లు ఆడితే అతడిమీద ఫ్రాంచైజీలు ఆసక్తిచూపుతాయా? అన్నది ఆసక్తికరం. ఇంగ్లిస్‌తో పాటు ఆసీస్‌కే చెందిన అగర్, సదర్లండ్, రిలీ రూసో సైతం తాము కొన్ని మ్యాచ్‌లే ఆడతామని బీసీసీఐకి తెలిపారు.



## థాంక్యూ రూట్.. మా నాన్న
# పరువు కాపాడావు..!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**
ఆసీస్ బౌలర్లను విసిగిస్తూ సాధికారిక ఇన్నింగ్స్ ఆడిన రన్ మెషీన్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్ అయితే ఇంగ్లండ్ స్టార్‌కు మరీ మరీ కృతజ్ఞతలు తెలిపాడు. ఈ లెజెండ్ కూతురు గ్రేస్ సైతం రూట్‌కు ధన్యవాదాలు చెప్పింది. వీరిద్దరూ ప్రత్యేకంగా రూట్‌ను అభినందించడానికి ఓ కారణముంది. యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా గడ్డపై ఏళ్లుగా ఊరిస్తున్న శతకాన్ని ఎట్టకేలకు సాధించాడు జో రూట్. గబ్బా స్టేడియంలో పింక్ బాల్ టెస్టులో సూపర్ సెంచరీతో ఇంగ్లండ్‌ను ఆదుకున్నాడు రూట్. ఆసీస్ బౌలర్లను విసిగిస్తూ సాధికారిక ఇన్నింగ్స్ ఆడిన రన్ మెషీన్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. ఆస్ట్రేలియా దిగ్గజం మాథ్యూ హేడెన్ అయితే ఇంగ్లండ్ స్టార్‌కు మరీ మరీ కృతజ్ఞతలు తెలిపాడు. ఈ లెజెండ్ కూతురు గ్రేస్ సైతం రూట్‌కు ధన్యవాదాలు చెప్పింది. వీరిద్దరూ ప్రత్యేకంగా రూట్‌ను అభినందించడానికి ఓ కారణముంది. యాషెస్ సిరీస్‌కు ముందు భారత జట్టుపై మూడు సెంచరీలతో ఫామ్ చాటుకున్నాడు జో రూట్. అదే ఊపులో ఆసీస్ గడ్డపై గబ్బా వేదికగా తనసెంచరీ కలను సాకారం చేసుకున్నాడు రూట్. చివరి వికెట్ పడకుండా ఇంగ్లండ్ స్కోర్ 300 దాటిన రూట్‌పైన ఆస్ట్రేలియా ఆటగాళ్లు కోపంగా ఉన్నవేళ మాథ్యూ హేడెన్ మాత్రం ప్రశంసలు కురిపించాడు. 'ఆస్ట్రేలియా గడ్డపై సెంచరీ కొట్టినందుకు అభినందనలు. క్రికెట్‌లో నా అంత మందమైన చర్మం మరొకరికి లేదు. అయితే.. నేను మంచి ఉద్దేశంతోనే న్యూడ్ వాక్ ఛాలెంజ్ చేశాను. నువ్వు వంద చేసి నా పరువు కాపాడావు కాబట్టి అభినందనలు. పది ఫిఫ్టీల తర్వాత ఎట్టకేలకు సెంచరీ సాధించావు' అని రూట్ సెంచరీపై హేడెన్ స్పందించాడు. పాడ్‌కాస్ట్ లో ఏం జరిగిందంటే.. యాషెస్ సిరీస్ ప్రారంభానికి ముందు 'ఆల్ ఓవర్ బార్ ది క్రికెట్' అనే పాడ్‌కాస్ట్ షోలో మాథ్యూ హేడెన్ పాల్గొన్నాడు. ఈ సందర్భంగా 'యాషెస్ ఆల్‌టైమ్ జట్టు'లో రూట్ పేరు లేకపోవడాన్ని అతడు తప్పుపట్టాడు. ఫ్యాబ్ 4లో ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్న రూట్‌ను పక్కన పెట్టడం అవివేకమని హేడెన్ అన్నాడు. అంతటితో ఆగకుండా ఎవరూ ఊహించని కామెంట్ చేశాడీ వెటరన్. యాసెస్‌లో ఇంగ్లండ్ స్టార్ జో రూట్ సెంచరీ చేయకుంటే తాను మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో నగ్నంగా నడుస్తానని వెల్లడించాడు. 'ఇంగ్లండ్ స్క్వాడ్‌లో అన్నివిధాల ఉపయుక్తమైన క్రికెటర్ రూట్. మీరు అతడిని ఆల్‌టైమ్ టీమ్‌లో తీసుకోకపోవడం నన్ను ఆశ్చర్యానికి గురి చేసింది. ప్రస్తుతం రూట్ సగటు 40. అత్యధిక స్కోర్ 180. ఈ వేసవిలో ఆసీస్‌పై అతడు సెంచరీ కొట్టకుంటే నేను ఎంసీజీలో నగ్నంగా నడుస్తాను' అని ఆల్ ఓవర్ బార్ ది క్రికెట్ పాడ్‌కాస్ట్ లో హేడెన్ పేర్కొన్నాడు. హేడెన్ చేసిన కామెంట్స్ పై అతడి కూతురు గ్రేస్ హ్యారిస్ ఫన్నీగా స్పందించింది. 'ప్లీజ్ రూట్.. సెంచరీ కొట్టు' అని కామెంట్ చేసింది. గబ్బాలో రూట్ సెంచరీ కొట్టడంతో ఖుషీ అయిన గ్రేస్.. ఇంగ్లండ్ స్టార్‌కు ధన్యవాదాలు తెలిపింది. 'రూట్ నీకు ధన్యవాదాలు. నువ్వు మా అందరి కళ్లను కాపాడావు' అని గ్రేస్ పోస్ట్ పెట్టింది. అండర్సన్ – టెండూల్కర్ ట్రోఫీలో మూడు సెంచరీలతో కదం తొక్కిన రూట్.. ఒకే ఒక ఇన్నింగ్స్‌తో దిగ్గజాలు రాహుల్ ద్రవిడ్, జాక్వెస్ కలిస్, రికీ పాంటింగ్ రికార్డులు బద్ధలు కొట్టాడు. భీకర ఫామ్‌లో ఉన్న అతడు కచ్చితంగా యాషెస్ సిరీస్‌లో వంద కొడుతాడనే ధీమాతోనే హేడెన్ 'న్యూడ్ వాక్' కామెంట్ చేశాడు. అయితే.. ఆస్ట్రేలియాపై రూట్ రికార్డు ఏమంత ఘనంగా లేదు. గత 27 ఇన్నింగ్స్ ల్లో 35.68 సగటుతో 892 రన్స్ చేశాడంతే. మూడుసార్లు రూట్ 80 ల్లోనే ఔటయ్యాడు. అందుకే.. హేడెన్ అంచనా తప్పుతుందని.. అతడిని మెల్‌బోర్న్‌లో నగ్నంగా చూడాల్సి వస్తుందేమోనని అందరూ అనుకున్నారు. కానీ.. రూట్ తన క్లాస్ ఆటతో 181 బంతుల్లో సెంచరీ సాధించాడు.



## గిగ్ కార్మికులు
# రోబోలు కారు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**
క్విక్ కామర్స్ సంస్థల పనితీరుపై రాజ్యసభ ఎంపీ రాఘవ చడ్డా తీవ్ర ఆవేదన చెందారు. గిగ్ కార్మికులు రోబోలు కారని, వారిని యంత్రాల్లాగ 10 నిమిషాల డెలివరీ కోసం ఒత్తిడి చేయడం చాలా దారుణమని రాజ్యసభలో ధ్వజమెత్తారు. ఈ వ్యవస్థను నిషేధించాలని కోరారు. రేటింగ్ తగ్గించడం, ఐడీ బ్లాక్ వంటి భయాలతో గిగ్ కార్మికులు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని, డెలివరీల కోసం రోడ్లపై సిగ్నల్స్ జంప్ చేస్తూ బాధలు పడుతున్నారని వాపోయారు. వీటికి తోడు కస్టమర్ల వేధింపులు కూడా ఎదుర్కొంటున్నారని, రోజువారీ కూలీల కంటే వారి పరిస్థితి దారుణంగా ఉందని పేర్కొన్నారు. ఈ ఇన్ స్టంట్ డెలివరీ యాప్ లకు మార్గదర్శకాలు రూపొందించాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ
మనసర్కార్
Follow: manasarkar

శనివారం | హైదరాబాద్
06.12.2025
www.manasarkar.com



# 'డ్రైవ్' టీజర్

ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):

ఆది పినిశెట్టి హీరోగా నటిస్తున్న థ్రిల్లర్ మూవీ 'డ్రైవ్'. ఈ చిత్రంలో మడోన్నా సెబాస్టియన్ హీరోయిన్ గా కనిపించనుంది. 'డ్రైవ్' సినిమాను భవ్య క్రియేషన్స్ బ్యానర్ పై ప్రొడ్యూసర్ వి.ఆనంద్ ప్రసాద్ నిర్మించారు. జెనూస్ మొహమద్ దర్శకత్వం వహించారు. ఈనెల 12న 'డ్రైవ్' సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ రోజు ఈ సినిమా టీజర్ ను రిలీజ్ చేశారు. 'డ్రైవ్' సినిమా టీజర్ ఎలా ఉందో చూస్తే.. తన తండ్రి స్థాపించిన ప్రజా మీడియా కార్పొరేషన్ వారసుడిగా సంస్థను విజయవంతంగా నిర్వహిస్తుంటాడు హీరో ఆది పినిశెట్టి. సౌత్ ఇండియాలో పేరున్న ఈ సంస్థ అక్కౌంట్స్ ను ఒక హ్యాకర్ హ్యాక్ చేస్తాడు. ఈ హ్యాక్ తో ప్రజా మీడియా కార్పొరేషన్ గౌరవం, క్రెడిబిలిటీ ప్రశ్నార్థకంలో పడతాయి. ఈ హ్యాకర్ ఎవరు?, ప్రజా మీడియా కార్పొరేషన్ తో పాటు హీరో పర్సనల్ లైఫ్ ను ఎందుకు టార్గెట్ చేశాడు ?. ఆ హ్యాకర్ ను హీరో పట్టుకోగలిగాడా ? లేదా ? అనేది టీజర్ లో ఆసక్తి కలిగిస్తోంది.

# సైక్ సిద్ధార్థ.. ఓ బ్యూటీఫుల్ జర్నీ

యామిని భాస్కర్ ఇంటర్వ్యూ ...

**యంగ్ హీరో శ్రీ నందు తన అప్ కమింగ్ మూవీ 'సైక్ సిద్ధార్థ'కు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బ్యాకింగ్ తో వస్తున్నారు. ఈ చిత్రానికి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్రీ నందు, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి సంయుక్తంగా నిర్మించారు. మ్యాడ్ మాక్స్-స్టైల్ మ్యాడ్‌నెస్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన 'సైక్ సిద్ధార్థ'లో హై ఎనర్జీ ఎంటర్టైన్మెంట్ వుండబోతుంది. ఈ చిత్రంలో యామిని భాస్కర్ కథానాయికగా నటించగా, ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రీ, మౌనిక కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ నెల12న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ యామిని భాస్కర్ మీడియాతో సినిమా విశేషాలు పంచుకున్నారు.**

ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):

**ఈ ప్రాజెక్టు ఎలా వచ్చింది? కథ విన్నప్పుడు ఎలా అనిపించింది?**

నర్తనశాల తర్వాత రెండేళ్లు గ్యాప్ వచ్చింది. కోవిడ్ తర్వాత ఏం సినిమా, ఏం క్యారెక్టర్ చేయాలని ఆలోచిస్తున్నప్పుడు, డైరెక్టర్ వరుణ్ ఫ్రెండ్ మా కమ్యూనిటీ లోనే ఉంటాడు. మేము కలిసి వాకింగ్ చేస్తుంటాము. అప్పుడు ఈ కథ చెప్పాడు. డైవర్స్ తీసుకున్న అమ్మాయి, తనకు ఒక పిల్లాడు కూడా వుంటాడు. ఈ క్యారెక్టర్ చేస్తావా అని అడిగారు. కొత్తగా అనిపించింది. ఇలాంటి క్యారెక్టర్ ఇప్పటివరకు నేను చేయలేదు. తర్వాత డైరెక్టర్ వరుణ్ ని కలిశాను. ఆయన కథ చెప్పిన విధానం నాకు చాలా నచ్చింది. వెరీ స్ట్రాంగ్ ఇండిపెండెంట్ విమెన్ క్యారెక్టర్ చేశాను. పర్ఫార్మెన్స్ కి చాలా స్కోప్ ఉంది. కచ్చితంగా ఈ సినిమా తర్వాత నాకు మరిన్ని అవకాశాలు వస్తాయనే నమ్మకం ఉంది.

**ఈ సినిమా టీజర్ ట్రైలర్ బయటకు వచ్చిన తర్వాత అర్జున్ రెడ్డితో పోలికలు వచ్చాయి కదా?**

పోస్టర్ లుక్కు అలా ఉంటుందేమో కానీ ఈ కథకు అర్జున్ రెడ్డికి సంబంధం లేదు. అర్జున్ రెడ్డి, సిద్ధార్థ ఈ రెండు క్యారెక్టర్ లో టోటల్ డిఫరెంట్.

**ఈ సినిమాలో హీరోతో మీ జర్నీ ఎలా ఉండబోతుంది?**

ఇందులో నా క్యారెక్టర్ పేరు శ్రావ్య. ఒక హానికరమైన రిలేషన్ నుంచి బయటకు వచ్చి స్వతహాగా బ్రతకాలనుకుంటుంది. ఇదే సమయంలో సిద్ధార్థ కి బ్రేక్ అప్ అయి ఉంటుంది. తను అన్ని వదిలేసి ఒక బస్తీలో ఉండడానికి వస్తాడు. అక్కడ మేము కనెక్ట్ అవుతాము. అప్పుడు ఒక ప్రేమ కథ మొదలవుతుంది. అక్కడి నుంచి చాలా బ్యూటిఫుల్ జర్నీ ఉంటుంది. ఇది ఒక సహజమైన ప్రేమ కథ. అందరూ రిలేట్ అయ్యేలా ఉంటుంది.

**నందుతో వర్క్ చేయడం ఎలా అనిపించింది?**

నందు మహిళల పట్ల చాలా గౌరవంగా ఉంటాడు. చాలా జెన్యూన్ పర్సన్. చాలా మంచి మనిషి. నందుతో వర్క్ చేయడం చాలా ఆనందంగా అనిపించింది.

**ఈ సినిమా ఫైనల్ అవుట్ పుట్ చూసుకున్నాక మీకు ఎలా అనిపించింది?**

సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. ఔట్పుట్ విషయంలో అందరం చాలా హ్యాపీగా ఉన్నాము. సురేష్ బాబు గారు ఈ సినిమాని తీసుకోవడం మా అందరికీ పెద్ద సర్ప్రైజ్. రా మా నా యు డు




స్టూడియోలో మా సినిమా పోస్టర్ చూసుకోవడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఆ పోస్టర్ చూసి నేను డైరెక్టర్ వరుణ్ చాలా ఎమోషనల్ అయ్యాం. ఫోటోలు కూడా తీసుకున్నాం. డైరెక్టర్ సాయి రాజేష్ గారు ఈ సినిమా చూసి నా క్యారెక్టర్ గురించి చాలా ప్రత్యేకంగా ప్రశంసలు అందించారు. పర్ఫార్మెన్స్ కి చాలా స్కోప్ ఉన్న క్యారెక్టర్ చేశానని చెప్పారు. ఇప్పటినుంచి సినిమాలు మీద ప్రత్యేకంగా ఫోకస్ చేయమని చెప్పారు.

**ఈ సినిమా నిర్మాణం విషయంలో చాలా కష్టపడ్డామని నందు చెప్పారు కదా.. నిర్మాతల సపోర్ట్ ఎలా ఉంది?**

సినిమాకి ఏం కావాలో అవన్నీ ఇచ్చారు. నేను కూడా సినిమాని వోన్ చేసుకున్నాను. నేను డైట్ లో ఉండడం కారణంగా ఇంటి నుంచే ఫుడ్ తెచ్చుకునేదాన్ని. కార్వాన్ అంటూ ఏమీ లేదు. లొకేషన్ లోనే కూర్చుని చాలా ఎంజాయ్ చేస్తూ చేసాం.

-ఎం.డి అబ్దుల్



# నాగశౌర్య.. 'బ్యాడ్ బాయ్ కార్తీక్'

ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):

హీరో నాగ శౌర్య యాక్షన్ ఎంటర్టైనర్ 'బ్యాడ్ బాయ్ కార్తీక్' తో అలరించబోతున్నారు. నూతన దర్శకుడు రామ్ దేశినా (రమేష్) దర్శకత్వం వహించారు. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్ పై శ్రీనివాస రావు చింతలపూడి నిర్మించారు. ఇప్పటివరకు విడుదలైన పాటలు సూపర్ హిట్ అయ్యాయి, టీజర్ కూడా అద్భుతమైన స్పందన అందుకుంది. తాజాగా సినిమాలోని పొమ్మంటే అనే ఎమోషనల్ పాటను విడుదల చేశారు. హారిస్ జయరాజ్ స్వరపరిచిన పొమ్మంటే, మెలోడీ, ఎమోషన్ ఆకట్టుకుంది. విడిపోవడం వల్ల కలిగే బాధను, తోబుట్టువుల అనుబంధాన్ని అందంగా ప్రజెంట్ చేసింది. రచయిత చంద్రబోస్ మనసుకి హత్తుకునే సాహిత్యం రాశారు, గాయకులు విజయ్ యేసుదాస్, శక్తిశ్రీ గోపాలన్ తమ వోకల్స్ తో మరింత హార్ట్ టచ్చింగ్ గా మలిచారు. ఈ పాట చాలా కాలం పాటు నిలిచిపోతుంది. విజువల్ గా ఈ పాటలో నాగ శౌర్య, శ్రీదేవి విజయ్ కుమార్ మిస్ అండర్ స్టాండింగ్ ద్వారా విడిపోయిన బ్రదర్, సిస్టర్స్ గా కనిపించారు. వారి అద్భుతమైన పెర్ఫామెన్స్, అజయ్ ప్రజెన్స్ ట్రాక్ ఎమోషన్ ని మరింత పెంచింది. ఇది తోబుట్టువుల ప్రేమకు మనసుని కదిలించే సాంగ్. రసూల్ ఎల్లోర్ ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు, ఎడిటింగ్ కోటగిరి వెంకటేశ్వర రావు, ఆర్ట్ డైరెక్షన్ రామాంజనేయులు నిర్వహిస్తున్నారు.


# షారూఖ్-కాజోల్ విగ్రహావిష్కరణ




ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):

బాలీవుడ్ స్టార్స్ షారూఖ్ ఖాన్, కాజోల్ లీసెస్టర్ స్క్వేర్‌లో కొత్త కంచు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ దర్శకుడు ఆదిత్య చోప్రా తెరకెక్కించి 'దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే' భారతీయ సినిమాల్లోనే అత్యంత ఆదరణ పొందిన చిత్రంగా నిలిచింది. ఈ సినిమాలో రాజ్, సిమ్రాన్ పాత్రలను పోషించినందుకు వారి పాత్రలకు దక్కిన గౌరవమది. యష్ రాజ్ ఫిల్మ్‌స్‌లో 30 సంవత్సరాలను పూర్తి చేసుకున్న ఈ బ్లాక్ బస్టర్ మూవీలోని రాజ్, సిమ్రాన్ పాత్రలకు సంబంధించిన ఐకానిక్ స్టిల్‌ను కాంస్య విగ్రహంగా రూపొందించారు. ఈ విగ్రహం వరల్డ్ వైడ్‌గా దక్షిణాసియాలో ఈ చిత్రానికి ఉన్న శాశ్వతమైన పాప్ కల్చర్‌ను ప్రభావితం చేసేలా సెలబ్రేట్ చేస్తోంది. లండన్ లీసెస్టర్‌లో విగ్రహ రూపంలో ఆవిష్కరించిన తొలి ఇండియన్ సినిమా ఇదే. హ్యారీ పోటర్, మేరి పాపిన్స్ ప్యాడింగ్టన్, సింగింగ్ ఇన్ ది రెయిన్ వంటి చార్మిత్రాత్మక చిత్రాల్లోని ప్రముఖ పాత్రలతో పాటు బ్యాట్ మ్యాన్, వండర్ ఉమెన్ వంటి వాటి సరసన ఇప్పుడీ విగ్రహం ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. ప్రపంచ సినిమా చరిత్రలో అత్యంత ప్రసిద్ధ పాత్రలతో పాటు సీన్స్ ఇన్ ది స్క్వేర్ ట్రయిల్‌లో ఈ విగ్రహం తన ప్రత్యేక స్థానాన్ని పొందింది. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి బాలీవుడ్ సూపర్‌స్టార్స్ షారూఖ్ ఖాన్‌తో పాటు కాజోల్, యష్‌రాజ్ ఫిల్మ్స్ సీఈఓ అక్షయే విదానీ, హార్ట్ ఆఫ్ లండన్ బిజినెస్ అలయన్స్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ రాస్ మోర్గన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా... షారూఖ్ ఖాన్ మాట్లాడుతూ.. 'దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే' సినిమా స్వచ్ఛమైన మనసుతో ఎంతగానో ప్రేమించి రూపొందించాం. ప్రేమ ఎలా మనుషుల మధ్య ఉన్న అడ్డంకులను తొలగిస్తుందో, ప్రేమ ఎక్కువగా ఉంటే ప్రపంచం ఎంత బావుంటుందనే కథను దీంతో చెప్పాలనుకున్నాం. అందుకే 'దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే' 30 ఏళ్లుగా ఇంతటి ప్రభావం చూపుతుందని భావిస్తున్నాను. వ్యక్తిగతంగా చూస్తే, 'దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే' నా వ్యక్తిత్వంలోని ఒక భాగం. ఈ సినిమా రిలీజైనప్పటి నుంచి ఇప్పటి వరకు నేను, కాజోల్ ప్రేక్షకుల నుంచి ప్రేమను ఇప్పటికీ పొందుతున్నాం. దాన్నెంతో గౌరవంగా భావిస్తున్నాం. యునైటెడ్ కింగ్‌డమ్ ప్రజలకు, హార్ట్ ఆఫ్ లండన్ బిజినెస్ అలయన్స్‌కు 'దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే'ను ఇలా సెలబ్రేట్ చేసి మాకు ఇలాంటి శాశ్వతమైన గౌరవాన్ని ఇచ్చినందుకు నేను వారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఎంతో గొప్పదైన సీన్స్ ఇన్ ది స్క్వేర్ ట్రైల్‌లో గౌరవం పొందిన తొలి భారతీయ సినిమా 'దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే' కావడం చాలా ఎమోషనల్ మూమెంట్. మాకు మా పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చింది. ఈ సినిమాను ప్రపంచం ఇంతగా స్వీకరించిందే క్షణాలు మాకెంతో గర్వంగా ఉంటుంది. ఈ క్షణాన్ని మొత్తం నటీనటులు, సాంకేతిక వర్గం, నా స్నేహితుడు, దర్శకుడు అదిత్య చోప్రా.. యష్ రాజ్ ఫిలిమ్స్ కుటుంబంతో పంచుకోవాలనుకుంటున్నాను. ఇది నేనెప్పటికీ మరచిపోలేని క్షణం" అన్నారు. కాజోల్ మాట్లాడుతూ ..దిల్‌వాలే దుల్హనియా లే జాయేంగే రిలీజైన 30 ఏళ్ల తర్వాత కూడా ఇంత ప్రేమను పొందుతూ ఉండటం అద్భుతంగా ఉంది. లండన్‌లో విగ్రహం ఆవిష్కరించిన దృశ్యాన్ని చూసినప్పుడు.. ఆ చారిత్రాత్మక అనుభూతిని మళ్లీ పొందినట్లుగా అనిపించింది. ఇన్ని తరాలుగా అందరితో నూ ట్రావెల్ అవుతోన్న కథ. ఎంతో ప్రాముఖ్యత ఉన్న లీసెస్టర్ స్క్వేర్‌లో విగ్రహం ఏర్పాటు చేసిన ఈ క్షణం మా ప్రయాణాన్ని మరింత ప్రత్యేకంగా మార్చింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఈ గౌరవం పొందిన తొలి భారతీయ సినిమా కావడం, ప్రపంచంలోని 'దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే' అభిమానుల హృదయాల్లో, మనసుల్లో ఎప్పటికీ నిలిచే అనుభూతి ఇది. మా సినిమాను ఇంతకాలం గుండెల్లో ఉంచుకున్న ఉన్న ప్రతి ఒక్కరికీ నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అన్నారు. 'దిల్‌వాలే దుల్హనియా లేజాయెంగే' సినిమా రాజ్, సిమ్రన్ కథను చెబుతోంది.

# టాలీవుడ్ నిర్మాతలతో కొరియన్ డైరెక్టర్ భేటీ ..



ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):

ఎక్స్ ట్రార్డినరీ, అటార్నీవూతో పాటు అనేక విజయవంతమైన కొరియన్ డ్రామాలతో ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ప్రముఖ కొరియన్ దర్శకుడు, నిర్మాత యూ ఇన్‌సిక్. 2025 హైదరాబాద్ కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భాగంగా హైదరాబాద్ లో తన పర్యటనను విజయవంతంగా పూర్తి చేస్తుకున్నారు. ఈ నెల 1న, దర్శకుడు యూ హైదరాబాద్‌లోని ప్రసాద్ ఫిల్మ్ ల్యాబ్స్‌లో ఒక ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్‌కు నాయకత్వం వహించారు, అతని సృజనాత్మక , నిర్మాణ శైలి, తెరవెనుక అనుభవాల గురించి అరుదైన ఇన్ సైట్స్ అందించారు. ఈ సెషన్‌లో కెడ్రామా అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తర్వాత, డైరెక్టర్ యూ హైదరాబాద్‌లోని ది లీలాలో తెలంగాణ చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ టాలీవుడ్ నిర్మాతలతో సమావేశమయ్యారు. అభివృద్ధి చెందుతున్న కంటెంట్ ల్యాండ్‌స్కేప్, సహకార నిర్మాణ అవకాశాలు, వినోద రంగంలో కొరియాభారతదేశ కొలాబరేషన్ బలోపేతం చేయడంపై చర్చలు జరిపారు. ఈ సమావేశంలో దిల్ రాజు, డి. సురేష్ బాబు, అల్లు అరవింద్, కె. ఎల్. నారాయణ, చిరంజీవి, నాగవంశి సూర్యదేవర, బన్నీ వాస్, ధీరజ్ మొగిలినేని, సుధాకర్ చెరుకూరి, శోభు యార్లగడ్డ, ఎస్.కె.ఎన్,రాజీవ్ రెడ్డి, ప్రశాంత్, నటుడు ఆనంద్ దేవరకొండ పాల్గొన్నారు. దర్శకుడు యూ ఇన్‌సిక్ విజిట్ కొరియా, భారతదేశం మధ్య లోతైన సాంస్కృతిక, సినిమా సహకారాన్ని పెంపొందించడానికి, కంటెంట్ క్రియేషన్, క్రియేటివ్ ఎక్స్ చేంజ్, భవిష్యత్తులో మరిన్ని భాగస్వామ్యాలకు మార్గం సుగమం చేస్తుంది.

# 'అవతార్'పై భారీ బజ్!



ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):

జేమ్స్ కామెరూన్ రూపొందించిన 'అవతార్ ఫైర్ అండ్ యాష్' కోసం ఐమాక్స్ బుకింగ్స్ దేశవ్యాప్తంగా ప్రారంభమైన వెంటనే ప్రేక్షకుల్లో హై లెవల్ రెస్పాన్స్ కనిపిస్తోంది. ఈ నెల 19న విడుదలకు ముందు నుంచే ఈ హాలీవుడ్ బిగ్గీపై భారీ బజ్ క్రియేట్ అయింది. ఐమాక్స్ స్క్రీన్లను నిర్వహిస్తున్న పి.వి.ఆర్, ఐనాక్స్ ఈసారి ముందుగానే యాక్షన్‌లోకి దిగి ముఖ్యమైన థియేటర్లలో ప్రత్యేక బుకింగ్ కౌంటర్లను ఏర్పాటు చేసింది. యాప్, వెబ్‌సైట్, థియేటర్ కౌంటర్ వంటి మూడు ఆప్షన్ల ద్వారా టికెట్లు బుక్ చేసుకునే సౌకర్యం ఉంది. ప్రచారం కూడా శరవేగంగా కొనసాగుతోంది. అవతార్ సిరీస్‌లో మూడో భాగంగా వస్తున్న 'ఫైర్ అండ్ యాష్' పండోరా ప్రపంచానికే మరో కొత్త షేడ్ ఇవ్వబోతోంది. ఫైర్ క్లాన్ నాయకుడు వరంగ్ పాత్ర కథకు ముఖ్య దిశను ఇవ్వబోతుందని తెలుస్తోంది. కొత్త క్లాన్లు.. కొత్త కల్చర్స్.. ఎమోషనల్ డెప్త్ ఇవన్నీ కలిసి విజువల్‌గా కూడా పెద్ద ఎత్తున ఆకట్టుకునే ఛాన్సులు ఉన్నాయి. ఈ నెల 19న సినిమా ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో భారీగా విడుదల కానుంది. ఐమాక్స్ షోలకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ముందుగానే టికెట్లు సెక్యూర్ చేసుకోవాలని థియేటర్లు సూచిస్తున్నాయి.



# కెరీర్ బ్యాలన్స్ కోసం జాన్వీ కపూర్ పరుగులు!

ఫిల్మ్ డెస్క్, (ఏడీఎన్ఎన్):

గ్లామర్ ప్రపంచంలో అంతటా మనమే కనిపించాలన్న కోరిక ఈ మధ్య బాలీవుడ్ భామలకు మరీ ఎక్కువైందనిపిస్తోంది. అన్నీ చోట్లా మనమే.. ఎక్కడైనా మనమే.. వైవిధ్యమైన పాత్రల ద్వారా ఎలాగైనా మెప్పించాలి అనే టార్గెట్‌తో ఉరుకులు పరుగులు తీయడం మామూలైపోయింది. అయితే.. అన్ని చేసినా, రిజల్ట్ కోరినట్టుగానే ఉంటోందా? అంటే నార్త్ హీరోయిన్ల పరిస్థితికి భిన్నంగా ఉంది జాన్వీ పరిస్థితి. నార్త్ లో టాప్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న దీపిక విషయానికొస్తే.. రెమ్యూనరేషన్, టైమింగ్స్ అంటూ తనకు తానే గిరిగీసుకునున్నారు. దీంతో చేతినిండా సినిమాలతో క్షణం తీరిక లేకుండా గడపాల్సిన లేడీ, ఎక్కడో ఒక్కడుగు వెనక్కేసిన ఫీలింగే వస్తోంది అభిమానులకు. ఆలియా కూడా అంతే. సౌత్‌లో మంచి క్రేజ్ ఉన్నా, టాలీవుడ్ ప్రాజెక్టులకు సైన్ చేయడానికి తటపటాయి స్తున్నారు. దీని రిఫ్లెక్షన్ కెరీర్ మీద కూడా పడుతోంది. అప్పుడెప్పుడో 'ట్రిపుల్ ఆర్' టైమ్‌లో ఆలియాను అక్కున చేర్చుకున్న సౌత్ ఆడియన్స్, ఇప్పుడు నెమ్మదిగా ఆమెను మర్చిపోయే పరిస్థితి కనిపిస్తోంది. శ్రద్ధా కపూర్, కృతి సనన్ పరిస్థితి కూడా ఇంతే. శ్రద్ధకి తెలుగులో మంచి హిట్ ఉంది. కృతికి సరైన విజయం ఇంకా దరిచేరలేదు. సో.. సౌత్ ఆడియన్స్ కి బాగా తెలిసిన వారే అయినా ఎందుకో డిస్టన్స్ మెయింటెయిన్ చేస్తున్న ఫీల్ క్రియేట్ అయింది. అయితే... జాన్వీ టాలీవుడ్ లో వరుస సినిమాలతో క్లిక్ కావాలన్న ట్రయల్స్ లో.. నార్త్ లో హోల్డ్ వదులుకోకూడదని వచ్చిన ప్రతి అవకాశానికీ ఓకే చెప్పేస్తున్నట్టుంది. . ఫలితంగా ఆ ప్రాజెక్టులు కాస్త బాక్సాఫీస్ వద్ద బోల్తా పడటంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది జాన్వీ.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**